అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

నేటి నుంచి రాహుల్‌గాంధీ ‘ఓట్ అధికార్’ యాత్ర 05

ఎవరినీ శత్రువుగా చూడను
‘హసిత భాష్పాలు’ పుస్తకావిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 03

సంపుటి 28, సంచిక: 58 | ఆదివారం | 17-08-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



ట్రంప్‌-పుతిన్ అలాస్కా

# చర్చల్లో పురోగతి

ఈసారి మాస్కో రండి.. మాట్లాడుదాం : పుతిన్

**మాస్కో:** ఉక్రేన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా-రష్యా అగ్రనేతల మధ్య శుక్రవారంనాటి అలాస్కా శిఖరాగ్ర చర్చల్లో ఎలాంటి నిర్దిష్ట ఒప్పందం కుదరలేదు. పుతిన్-ట్రంప్ మధ్య శుక్రవారం రెండున్నర గంటలసేపు జరిగిన చర్చలు కాల్పుల విరమణపై ఎలాంటి ఒప్పందానికీ రాకుండానే ముగిశాయి. చర్చల్లో ఒప్పందం కుదరలేదని ట్రంప్ చెప్పారు. కొంత పురోగతి సాధిం చామన్నారు. రెండు దేశాలూ పరస్పరం కీలక సమాచా రాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా ఒక అవగాహనకు వచ్చా యని, ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు రష్యా ఎంతో చిత్త శుద్ధితో కృషి చేస్తోందని పుతిన్ చెప్పారు. వారం రోజులుగా ఆర్భాటంగా ప్రచా రం జరిగినప్పటికీ ఉక్రేన్‌లో యుద్ధ నివారణపై ఎలాంటి ఒప్పందం లేకుండానే చర్చలు ముగియడంతో యూరో పియన్ యూనియన్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో యూరోపియన్ యూనియన్ నాయకులతో, ఉక్రేన్ అధ్య క్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ వేరు వేరుగా సుదీర్ఘ టెలిఫోన్ సంభా షణలు చేశారు. రష్యా తిరిగి ప్రపంచవేదికపైకి వచ్చిందని, ఒప్పం దం జరగకపోవడం పుతిన్ విజయమని విశ్లేషకులు కొందరు వ్యాఖ్యానించారు. అమెరికా రాష్ట్రం అలాస్కాలో

తరువాయి 2లో

బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లకు

## గడువు విధించే అధికారం

# కోర్టుకు లేదు

సుప్రీంకోర్టుకు విన్నవించిన కేంద్ర సర్కార్

**న్యూఢిల్లీ :** శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలంటూ కోర్టులు వారిని నిర్దేశించవచ్చా అనే అంశంపై అభి ప్రాయాలు తెలియజేయాలని ఇటీవల సుప్రీం కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన విషయం తెలి సిందే. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి పంపిన లిఖిత పూర్వక వివరాలు తాజాగా బయ టకు వచ్చాయి. అందులో రాష్ట్రపతి, గవ



ర్నర్‌ల ఆమోదానికి గడువు విధించే అధి కారం కోర్టుకు ఉండదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కొన్ని విషయాల్లో న్యాయ స్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగప రంగా

తరువాయి 2లో

అబార్షన్ కోసం వచ్చే మహిళలే లక్ష్యం

# ‘సృష్టి’ రహస్యం ఇదే

ప్రజాపక్షం/హైదరాబాద్

వివిధ కారణాల వల్ల అబార్షన్ల కోసం వచ్చే మహిళలనే డాక్టర్ నమ్రత లక్ష్యంగా చేసుకొనేవారని పోలీసుల విచారణలో బయటపడింది. సరోగసి పేరుతో మోసా లకు పాల్పడుతున్న సృష్టి ఆసుపత్రి ఎండి డాక్టర్ నమ్రత అబార్షన్ కోసం వచ్చే మహిళలకు పెద్ద మొత్తంలో డబ్బులు అందించి తన వ్యాపారాన్ని కొనసాగిం చింది. ‘సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీసెంటర్ పేరుతో డాక్టర్ నమ్రత అనేక అక్రమాలకు పాల్పడింది. అక్రమ సరోగసి రాకెట్‌లో ప్రధాన నిందితురాలిగా నిలిచిన డాక్టర్



నమ్రత తన విచారణలో విస్తుపోయే నిజాలు వెల్లడించారు. కోర్టులో పోలీసులు దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో ఈ కింది విషయాలు వెలుగు చూశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహా రాష్ట్ర, ఒడిశా, తమిళనాడులోని స్లమ్స్ ఏరి యాకు దగ్గరలో ఉన్న చిన్న ఆసుపత్రు లను నమ్రత

తరువాయి 2లో

4వ రాష్ట్ర మహాసభ
భారత కమ్యూనిస్టు పార్టీ (CPI) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ
2025-ఆగస్టు 20 నుండి 22 వరకు, గాజులరామారం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.
ప్రదర్శన: 20.08.2025న ఉదయం 9:00 గంటలకు
జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభం
మహాసభ వేదిక: మహారాజా గార్డెన్స్, గాజులరామారం,
మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.
ప్రారంభ సభ: 20.08.2025 (బుధవారం) ఉదయం 10:00 గంటలకు
ప్రారంభకులు: కామ్రేడ్ డి. రాజా, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి
అతిథులు : కామ్రేడ్ డాక్టర్ కె. నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి
కామ్రేడ్ సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ జాతీయ కార్యదర్శి
కామ్రేడ్ కె. రామకృష్ణ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి
కామ్రేడ్ జాన్ వెస్లీ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి
ఉదయం 10:00 గంటలకు :
అరుణ పతాకావిష్కరణ: కామ్రేడ్ కె. ప్రతాప రెడ్డి
ఉదయం 10:15 గంటలకు:
అమరవీరుల స్థూపావిష్కరణ: కామ్రేడ్ ఏటుకూరి ప్రసాద్
అభినందనలతో...
కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

పోరాటయోధునికి అరుణాంజలి

సామాన్యమైన జీవితాన్ని అసమాన్యంగా మార్చుకున్న ధీరుడు
తుదిశ్వాస వరకు నమ్మిన సిద్ధాంతానికై నిలిచిన మహోన్నతుడు
ప్రజాసమస్యల పరిష్కారానికై నిరంతరం తప్పించిన కమ్యూనిస్టు
ఎర్రజెండా నీడలో విశ్రమించిన శ్రామికుడు
కార్మిక కర్షక బడుగు బలహీన వర్గాలకు దన్నుగా నిలిచిన యోధుడు
నాలుగు దశాబ్దాల ఉద్యమ జీవితంలో అలుపెరగని అమరజీవి
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
ఉమ్మడి ఖమ్మం జిల్లా జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్
కా॥ బొల్లోజు అయోధ్య చారి గారికి
అరుణాంజలి
భారత కమ్యూనిస్టు పార్టీ (CPI)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి

పోరాటయోధునికి అరుణాంజలి

కార్మిక కర్షక బడుగు బలహీన వర్గాలకు దన్నుగా నిలిచిన యోధుడు
నాలుగు దశాబ్దాల ఉద్యమ జీవితంలో అలుపెరగని అమరజీవి
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్
కా॥ బొల్లోజు అయోధ్య చారి గారికి
అరుణాంజలి
మణుగూరు
మండల ప్రజలు
బులియన్ అసోసియేషన్ - మణుగూరు
మెడికల్ అసోసియేషన్ - మణుగూరు యూనియన్
ఎక్సలెంట్ హైస్కూల్ - మణుగూరు
సరస్వతి ఏజెన్సీస్ - మణుగూరు
శ్రీ విద్య టెక్నో జూనియర్ కాలేజీ - మణుగూరు
కృష్ణవేణి జూనియర్ కాలేజీ - మణుగూరు
తాళ్ళపల్లి యాదగిరి గౌడ్
మణుగూరు



# ప్రపంచం
WORLD NEWS

## పాకిస్థాన్ వరద మృతులు 300పైనే..

**పెషావర్:** పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లోని అనేక ప్రాంతాలలో వర్షాలు, వరదలో మృతులసంఖ్య 300 దాటిపోయింది. మృతుల్లో 13 మంది పిల్లలు ఉన్నారు. వరదల్లో చాలా మంది గల్లంతయ్యారు. గురువారం రాత్రి కురిసిన కుండపోత వర్షాల కారణంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని లోయర్ దిర్, బజౌర్, అబోటాబాద్ తదితర జిల్లాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డాయని సహాయ బృందాల అధికారులు తెలిపారు. ఈనెల 21వ తేదీవరకూ అంటే మరో ఐదు రోజులపాటు ఈ ఆకస్మిక వర్షాలు, వరద ప్రమాదాలు అనేక జిల్లాలకు పొంచి ఉందని పిడిఎంఎ (రాష్ట్రీయ ప్రకృతి వైపరీత్యాల నిర్వహణాధికారులు) అధికారులు ముందస్తు హెచ్చరిక చేశారు. గడచిన 48 గంటల్లో వర్షాలు, వరదలవల్ల మరణాల సంఖ్య 307కు పైగా పెరిగాయని పిడిఎంఎ అధికార ప్రతినిధి ఫైజీ చెప్పారు.

(మొదటి పేజీ తరువాయి)

# చర్చల్లో పురోగతి




అత్యంత జనసమ్మర్ధమైన యాంకరేట్ పురపాలక పట్టణంలో ఉన్న అమెరికా ఉమ్మడి సైనికస్థావర కేంద్రం "ఎల్మండోర్ఫ్ రిచర్డ్‌సన్" వద్ద "అలాస్కా–2025" అనే ఒక పెద్ద బ్యానర్ ఏర్పాటు చేసి పుతిన్–ట్రంప్ చర్చల నిమిత్తం ప్రత్యేక వేదిక నిర్మించారు. పుతిన్‌కోసం రెడ్‌కార్పెట్ పరిచారు. ప్రచ్ఛన్నయుద్ధకాలంలో రష్యాపై దాడులు చేసేందుకు తయారు చేసిన బి–2, ఎఫ్–22 యుద్ధ విమానాలు కూడా ఆ ప్రదేశంలోనే పార్కింగ్ చేసి ఉన్నాయి. నాయకులు ఇద్దరూ విమానాలు దిగిన తర్వాత పలకరింపులు, కరచాలనంతో వారి కలయిక ప్రారంభమైంది. తర్వాత పోడియం వద్ద ఫోటోలు దిగి వేదిక పైకి వెళ్ళి రెండున్నర గంటలసేపు ఉన్నతస్థాయీ సలహాదారుల సహాయంతో చర్చలు జరిపారు. తర్వాత లాంఛనంగా అక్కడే ఉమ్మడిగా పాత్రికేయులతో మాట్లాడారు. ఆ తర్వాత విడివిడిగా ఇంటర్వ్యూలలో అభిప్రాయాలు వ్యక్తం చేశారు. "ప్రెసిడెంట్ పుతిన్... మీరు పౌరులను చంపడం ఇక ఆపేస్తారా?" అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు పుతిన్ ఏం చెబుతున్నారో తనకు వినబడటం లేదంటూ చెవి దగ్గర చెయ్యిపెట్టి సైగ చేశారు. తర్వాత పుతిన్–ట్రంప్ ఇద్దరు 'ద బీస్ట్' అని పిలిచే అమెరికా అధ్యక్షుడి కాన్వాయ్ వాహనంలో కలిసి కొద్దిదూరం ప్రయాణం చేశారు. వారి వెంట కెమేరాలు పరుగులు తీశాయి. ఈ రైడ్ పూర్తయ్యేవరకూ పుతిన్ నవ్వులు చిందిస్తూనే ఉన్నారు.

చర్చలు ఎంతో నిర్మాణాత్మకంగా జరిగాయని మరోవైపు ట్రంప్–పుతిన్ ఇద్దరూ మీడియా వద్ద ఉద్ఘాటించారు. తర్వాత ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "అలాస్కా శిఖరాగ్ర సదస్సు పదికి పది మార్కులతో ర్యాంకు సంపాదించింది" అన్నారు. చర్చల్లో మంచి పురోగతి సాధించామని, ఐతే ప్రతి అంశంపైనా ఒక ఒప్పందానికి రాకుండానే చర్చ ముగిసిందని ట్రంప్ చెప్పారు. పుతిన్ కూడా దాదాపు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ముందుగా అనుకున్నవిధంగా కాకుండా పుతిన్ వెంట ఇద్దరు సహాయకులు, ట్రంప్ వెంట ఇద్దరు సహాయకులు చర్చల్లో పాల్గొన్నారు. పుతిన్ వెంట విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్, విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషకోవ్ వచ్చారు. ట్రంప్ వెంట విదేశాంగమంత్రి మార్కో రుబియో, మధ్యప్రాచ్యంలో ఆయన ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ ఉన్నారు.

చర్చల్లో కొంత పురోగతి సాధించామని, కానీ కొన్ని విషయాలపై తాము అనంగీకారం తెలియజేశామని పుతిన్ అన్నారు. ఈసారి రెండో విడత చర్చలకు మాస్కోకు రావాల్సిందిగా ట్రంప్‌ను ఆహ్వానించారు. అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు, రెండు దేశాలమధ్యా సహకార పునరుద్ధరణకు ఇదొక సరికొత్త ఆరంభమని పుతిన్ చెప్పినట్లు టాస్ వార్తాసంస్థ తెలియజేసింది. ఉక్రేన్ సమస్యపైనే అలాస్కాలో ప్రధానంగా చర్చించామని పుతిన్ అన్నారు.

అలాస్కా నుండి తిరిగి వెళ్ళిపోయేముందుగా, సిట్కా–అలాస్కా ఆర్చ్‌బిషప్ అలెక్సీతో పుతిన్ సంభాషించారు. ఒకప్పటి రష్యా సామ్రాజ్యంలో అలాస్కా అంతర్భాగంగా ఉండేది. ఇక్కడ ప్రస్తుతం 50 వేలమందిపైగా సంప్రదాయ క్రైస్తవులు ఉన్నారు. ఈ చర్చలకు వారం ముందుగానే చర్చలు ఫలవంతం కావాలని ఇక్కడి క్రైస్తవ మతస్తులు ప్రార్థనలు చేశారు. యూరప్‌లో 1945లో రెండో ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాత తిరిగి ఉక్రేన్‌లో 2022 నుండి జరుగుతున్న అతి పెద్ద యుద్ధాన్ని నివారించేందుకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### నేరుగా ఉక్రేన్–రష్యా శాంతి ఒప్పందమే ఉత్తమం : ట్రంప్

ఉక్రేన్‌లో తాత్కాలికంగా కాల్పుల విరమణ ఒప్పందం కోసం చర్చలకంటే నేరుగా శాంతి ఒప్పందమే అత్యుత్తమమైన మార్గమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ఉక్రేన్–రష్యా మధ్య భీకరయుద్ధాన్ని ముగించేందుకు రెండు దేశాలు నేరుగా ప్రత్యక్ష శాంతి ఒప్పందం చేసుకోవడమే ఉత్తమ మార్గం అన్నారు. అలాస్కాలో జరిగిన చర్చలు విఫలమైన తర్వాత యూరప్ దేశాల నాయకులతో విడివిడిగా ట్రంప్ మంతనాలు చేశారు. ఆ తర్వాత ట్రంప్ పైవిధంగా స్పందించారు. ఈ మేరకు తన సొంత ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం వల్ల సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయన్నారు. శుక్రవారం తనకు అలాస్కాలో ఎంతో విజయవంతమైన గొప్ప దినమని పేర్కొన్నారు. జెలెన్స్కీతో సోమవారంనాడు ఓవల్ ఆఫీసులో సమావేశం జరుపుతున్నట్లు ట్రంప్ ధృవీకరించారు. ఇది సఫలమైతే జెలెన్స్కీ స్వయంగా రష్యా, ఉక్రేన్, అమెరికా త్రైపాక్షిక కూటమిగా సమావేశం నిర్వహిస్తారని, ఏదో కాల్పుల విరమణ కాకుండా పూర్తి శాంతి ఒప్పందం చేసుకోవడానికి ఈ ప్రయత్నాలు ఉపయోగపడతాయన్నారు. జెలెన్స్కీ కూడా ఒక పోస్టింగ్ పెడుతూ ఈ త్రైపాక్షిక సమావేశంవల్లే ఉక్రేన్‌లో చిరకాల శాంతి సాధ్యమన్నారు.

అలాస్కా చర్చలపై ఇంటర్నేషనల్ సిస్టర్ సిటీస్ అసోసియేషన్ అమెరికాశాఖ గవర్నర్ల బోర్డు గౌరవ ఛైర్మన్ బిల్ బోరమ్ అలాస్కా చర్చలపై ఒక విశ్లేషణ చేస్తూ, ఈ సమావేశం రెండు దేశాలమధ్యా స్నేహపూర్వక సంబంధాలను ప్రదర్శించిందన్నారు. అలాస్కా విమానాశ్రయంలో నాయకులు ఇద్దరూ విమానాలు దిగిన తర్వాత చేసిన కరచాలనం, ఆ విధానం వారి మధ్య స్నేహాన్ని, పరస్పర గౌరవాన్ని ప్రదర్శించిందన్నారు. పోడియం వద్ద నాయకుల వ్యాఖ్యలు చర్చలపట్ల వారికున్న నిజమైన చిత్తశుద్ధిని ప్రదర్శించాయని బిల్ బోరమ్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వెంట వ్యాపార ప్రతినిధులు కూడా ఉండటంతో వాణిజ్య ఒప్పంద అవకాశాలను కూడా విశ్లేషకులు అంచనావేశారు.

### ట్రంప్‌తో జెలెన్స్కీ సుదీర్ఘ సంభాషణ రేపు హుటాహుటిన ఓవల్ ఆఫీస్‌కి...

ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సోమవారంనాడు వాషింగ్టన్‌లోని ఓవల్ ఆఫీసులో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశమవుతారు. పుతిన్‌తో చర్చలు ఎటూ తేలకపోవడంతో జెలెన్స్కీ హుటాహుటిన ఓవల్ ఆఫీసుకు వెళుతున్నారు. పుతిన్‌తో ట్రంప్ మూడు గంటలసేపు సమావేశం తర్వాత జెలెన్స్కీ గంటన్నరసేపు ట్రంప్‌తో ఫోన్ సంభాషణ చేశారు. అలాస్కా సమావేశంలో కీలక విషయాలను ఈ సందర్భంగా ఆయనకు ట్రంప్ తెలియజేశారు. తనను వచ్చి కలుసుకోవాలని ట్రంప్ ఆహ్వానించారని జెలెన్స్కీ పాత్రికేయులకు చెప్పారు. అందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రంప్‌తో చాలా అర్థవంతమైన, సుదీర్ఘ ఫోన్ సంభాషణ చేశానని, సోమవారం ఓవల్ ఆఫీసులో ట్రంప్‌తో ముఖాముఖీ సమావేశం జరిపి తన అభిప్రాయాలను తెలియజేస్తానని జెలెన్స్కీ చెప్పారు. అలాస్కా శిఖరాగ్ర సదస్సులో ఎలాంటి సానుకూల ఫలితాలు రాలేదని చెప్పారు. చర్చల్లో యూరప్‌ను భాగస్వామ్యం చేయాల్సిన అవశ్యకతను మరోసారి గట్టిగా చెప్పారు. అమెరికాతో కలిసి పూర్తి భద్రతా హామీ ఇవ్వడంకోసం యూరప్‌ను ప్రతి దశలోనూ భాగస్వామిగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించకుండా, చర్చలను సాగదీస్తున్న పుతిన్ తగిన మూల్యం చెల్లిస్తారని, అందుకు తగ్గ ఫలితం అనుభవిస్తారని ఉక్రేన్ విదేశాంగమంత్రి ఆండ్రీ సైరిల్ హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించడానికి ఆయన సిద్ధపడుతున్నారా? లేక దురాక్రమణ చేయడానికి సిద్ధపడుతున్నారా? అనే విషయాన్ని కేవలం ఆయన చర్యలు మాత్రమే తెలియజేస్తున్నాయని ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు.

### ఉక్రేన్‌లో శాంతిచర్యలకు ఐరాస సంపూర్ణ మద్దతు

ఉక్రేన్‌లో చిరకాలశాంతి సాధనకు అన్నివిధాలుగా అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలు ఐక్యరాజ్యసమితి అందిస్తుందని సమితి ప్రధాన కార్యదర్శి తరపున ఆయన అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజెర్రిక్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాలకు అనుగుణంగా అంతర్జాతీయస్థాయిలో గుర్తించిన ఉక్రేన్ సరిహద్దులు, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతలను పూర్తిగా రక్షిస్తూ ఉక్రేన్‌లో స్థిరమైన, సమగ్ర శాంతి సాధన దిశలో మొదటి అడుగుగా జరిగిన ఈ చర్చల్లో బేషరతుగా తక్షణ కాల్పుల విరమణ ఒప్పందం సాధించాలని, ఆ దిశగా చర్చలు ఇకమీదట కూడా కొనసాగాలని డుజెర్రెక్ అన్నారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు అవసరమైన అన్ని అర్థవంతమైన చర్యలూ తీసుకోవడంలో మద్దతు ఇచ్చేందుకు ఐక్యరాజ్యసమితి సంసిద్ధంగా ఉందన్నారు.

## ఇండో–పాక్ యుద్ధం నేనే ఆపా
### అలాస్కాలో మళ్ళీ ట్రంప్

**న్యూయార్క్ :** భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని, అణుయుద్ధం వరకూ పరిస్థితి దిగజారకుండా అడ్డుకున్నాననీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి చెప్పుకున్నారు. అలాస్కా వేదికగా ఉక్రేన్ సమస్య పరిష్కారంపై చర్చల సందర్భంగా పుతిన్‌తో సంభాషిస్తూ ట్రంప్ చెప్పారు. ఇప్పటికే ట్రంప్ అనేక డజన్లసార్లు ఈ విషయం ప్రపంచవ్యాప్తంగా చాటింపు వేశారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న విషయం గురించి కూడా ఆయన భారత్ వ్యతిరేక ప్రచారం ప్రారంభించారు. కానీ ఈ రెండు దేశాలమధ్యా సైనికస్థాయిలో పాకిస్థాన్ డిజిఎంఓ చొరవ వల్ల కాల్పులు విరమించామని భారతదేశం చెబుతున్నది. ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండానే యుద్ధ విరమణ జరిగిందని తెలిపింది. కానీ ట్రంప్ మాత్రం అలాస్కాలో అందుకు విరుద్ధంగా తనదైన బాణిలో తన ప్రచారాన్ని కొనసాగించారు. ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధ విరమణకు ఎలాంటి ఒప్పందం లేకుండానే చర్చలు అలాస్కాలో ముగియడంతో తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే మధ్యవర్తిత్వంచేసి ఆపానని మరోసారి ఉద్ఘాటించారు. "ఆ రెండు దేశాలవైపూ చూడండి, అప్పటికే యుద్ధంలో ఆ రెండు దేశాలూ పరస్పరం విమానాలు కూల్చివేసుకున్నాయి, అవిరెండూ అణుశక్తి సామర్థ్యంగల దేశాలు, నేను మధ్యవర్తిత్వం చేయకపోయి ఉంటే అణుయుద్ధం వరకూ వెళ్ళేవి, కానీ నేను ఆపాను, అదేవిధంగా కాంబోడియా–థాయ్‌లాండ్ మధ్య సరిహద్దు ఘర్షణను మధ్యవర్తిత్వం ద్వారా నివారించాను, అర్మేనియా–అజర్‌బైజాన్ దేశాలమధ్య సరిహద్దు వివాదం పరిష్కరించి వాటిమధ్య వాషింగ్టన్‌లో ఒక త్రైపాక్షిక ఒప్పందంపై సంతకం చేయించాను" అని ట్రంప్ తన పద్ధతిలో చెప్పుకుపోయారు. "యుద్ధం చాలా చెడ్డది, దాన్ని ఆపాలి, దేశాలను దగ్గరకు చేర్చాలి, అందుకోసం అమెరికా తన అధికారాన్ని ఉపయోగిస్తున్నది" అని ట్రంప్ చెప్పారు. భారత్–పాకిస్థాన్ మధ్య వాణిజ్యాన్ని ప్రధానాంశంగా చూపించి యుద్ధాన్ని అడ్డుకున్నానని చెప్పారు. ఈ ఏడాది మే 10వ తేదీ నుండీ ఇప్పటివరకూ అనేకసార్లు ట్రంప్ ఈ విషయం చెబుతున్నారు.

## వరద బాధితులకు ఒమర్ అబ్దుల్లా పరామర్శ

**శ్రీనగర్:** జమూకశ్మీరులోని కిష్టార్ జిల్లా చషోటి గ్రామాన్ని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. వరద బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. విపత్తులో మృతిచెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపింది.

## ప్లాస్టిక్ వస్తువుల తయారీ యూనిట్‌లో అగ్ని ప్రమాదం : ఐదుగురు మృతి

**బెంగళూరు :** బెంగళూరు కెఆర్ మార్కెట్ సమీపంలోని నాగర్తపేటలోని ప్లాస్టిక్ వస్తువుల తయారీ యూనిట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నలుగురు కుటుంబ సభ్యులు, మరొక వ్యక్తి సజీవ దహనం అయ్యారని పోలీసులు తెలిపారు. మృతులను మదన్ సింగ్ (38), సంగీత (33), వారి ఇద్దరు పిల్లలు రితేష్ (7), విహాన్ (5), పొరుగున ఉన్న సురేష్ కుమార్ (26) గా పోలీసులు గుర్తించారు. మదన్ సింగ్ రాజస్థాన్‌కు చెందినవాడు, దాదాపు 10 సంవత్సరాలుగా ఆ భవనాన్ని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ప్లాస్టిక్ వంటగది వస్తువులతో పాటు చాపలు, స్టీలు వంటగది పాత్రలను తయారు చేసే చిన్న తయారీ యూనిట్‌ను అతను నడిపాడు. అతను భవనంపై అంతస్తులో నివసిస్తున్నాడు. ఎలక్ట్రిక్ స్పార్క్ మంటలకు కారణమై ఉండవచ్చని పోలీసులు తెలిపారు. అగ్నిప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించలేదు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

## కోర్టుకు లేదు (మొదటి పేజీ తరువాయి)

గందరగోళం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లులపై గవర్నర్లు అంగీకారం తెలిపే విషయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ.. గడువు విధించడం వల్ల రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం తెలిపింది. ఆ రెండు స్థానాలు ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన ఉన్నత ఆదర్శాలను సూచిస్తాయని పేర్కొంది. వారి విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే అనవసరమైన న్యాయ జోక్యాల ద్వారా కాకుండా రాజ్యాంగపరమైన యంత్రాంగాల ద్వారా సరిదిద్దాలని సూచించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ.. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధింపుపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

## 'సృష్టి' రహస్యం ఇదే
(మొదటి పేజీ తరువాయి)

ఎంచుకుంది. గర్భంలో ఉన్నది ఆడ పిల్ల అని తెలియగానే కొందరు, అక్రమ సంబంధం వల్ల ఏర్పడిన గర్భాం వదిలించుకునేందుకు మరికొందరు, కారణాలు ఏవైనా గర్భం దాల్చిన తరువాత పిల్లల్ని కనడం ఇష్టంలేని మహిళలు అబార్షన్ చేసుకోవడం సహజం. చిన్న ఆసుపత్రులకు స్లమ్స్ ఏరియాలో ఉండే బాధిత మహిళలు అబార్షన్‌ల కోసం ఎక్కువ మంది వస్తుంటారు. అలాంటి మహిళలను గుర్తించి వారికి ఏజెంట్ల ద్వారా కౌన్సిలింగ్ ఇవ్వడం, మరోపక్క డబ్బు ఆశ చూపి లోబర్చుకుంటున్నారు. ఇలా లోబర్చుకున్న మహిళలు ప్రసవం అనంతరం పుట్టిన శిశువులను కొనుగోలు చేసి, సరోగసి ద్వారానే ఆ పిల్లలు పుట్టినట్టుగా పిల్లలు లేని దంపతులను నమ్మించామని విచారణలో నమ్రత పోలీసులకు తెలిపారు. ఈ విధంగా ఎంతోమంది కుటుంబాలను మోసం చేసినట్లు ఆమె ఒప్పుకున్నారు. నమ్రత కన్ఫెషన్ రిపోర్ట్‌లోని అంశాలు సంచలనంగా మారాయి. ఏజెంట్ల ద్వారా పిల్లలను కొనుగోలు చేసిన విషయాన్ని ఆమె బహిర్గతం చేశారు. సరోగసి పేరుతో పిల్లలు లేని దంపతుల దగ్గర నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేసినట్టు అంగీకరించారు. పిల్లల కొనుగోలు వ్యవహారంలో సంజయ్, సంతోషి కీలకపాత్ర పోషించారని నమ్రత వెల్లడించారు. అంతేకాకుండా, తన రెండో కుమారుడు లీగల్ వ్యవహారాల్లో సహకరించేవాడని కన్ఫెషన్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఈ కేసు బయటపడటం తో వైద్య రంగంలో కలకలం రేగింది.

## చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలు
# సిద్ధంగా ఉంచండి
### అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సిఎం సూచించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి శనివారం ఉదయం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాల ను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడతారని అన్నారు.

రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యం లో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిఎం సూచించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం చోటు చేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని సిఎం తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జిహెచ్‌ఎంసి, హైడ్రా, ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## రాష్ట్రంలో మరో మూడు రోజులు..
# భారీ నుంచి అతి భారీ వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 19 వరకు రాష్ట్రంలో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తర ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో శనివారం, ఆదివారం అతి నుంచి అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఆ జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. పలు జిల్లాల్లో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు పలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. దీంతో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీచేశామన్నారు. జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ములుగు, మహబూబాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాలల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదిలాబాద్, కామారెడ్డి, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, హనుమకొండ, పెద్దపల్లి, వరంగల్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు.

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకా శం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇప్పటికే రెడ్, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన అధికారులు జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ మినహా మిగతా అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో అలెర్ట్ జారీ చేశామని చెప్పారు. హైదరాబద్ నగరానికి మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌కు అధికారులు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో వరదల ప్రభావిత ప్రాంతాలు, మూసీ పరివాహక ప్రాంతాలకు సంబంధించి హెచ్చరిక జారీ చేశామని చెప్పారు. జిహెచ్‌ఎంసి, డిఆర్‌ఎఫ్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు అధికారులను అప్రమత్తం చేశామని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మంచిర్యాలలో 7.18 సెంటీమీటర్ల వర్షంపాతం నమోదయింది. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 6.5సెం.మీ., ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో 5.45 సెం.మీ వర్షపాతం నమోదయింది. అత్యధికంగా సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో 14.7 సెం.మీ., నల్లవల్లి 9.7, చౌటకుర్ 9, మెదక్ జిల్లా శివంపేటలో 12.8 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

### వేతనాలకోసం కెనడా విమాన సిబ్బంది సమ్మె వందల విమానాలు రద్దు

**ఒట్టావా :** కెనడాలో విమాన రవాణా సిబ్బంది సమ్మె చేయడంతో వందల విమాన సర్వీలులు శనివారంనాడు రద్దైపోయాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180నగరాలకు కెనడా నుండి విమానాలు రాకపోకలు సాగిస్తాయి. విమాన కాక్‌పిట్‌లలో ఉండే పైలట్లు, ఇతర సిబ్బంది శనివారం తెల్లవారు ఝాము నుండీ సమ్మె ప్రారంభించడంతో రోజుకు 1,30,000 మంది ప్రయాణికులకు సమస్యలు వచ్చిపడ్డాయనిఅధికారులు చెప్పారు. ప్రయాణికుల హాలీడే ట్రిప్పులు, వారి ప్లానింగ్‌లు దెబ్బతిన్నాయన్నారు.దాదాపు 10,000 మంది ఎయిర్ కెనడా సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నారని ఎయిర్ కెనడా స్టాఫ్ యూనియన్ ప్రకటించింది. జీతా లు పెంచాలని, విమానాలు ఎగరకపోయినాగానీ డ్యూటీలో ఉన్నప్పుడు వేతనాలు చెల్లించాలని వారు కోరుతున్నారు.



## బొగతలో...ఆహ్లాదం.. ఆనందం
# ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతం
### స్విమ్మింగ్ పూల్ లోకి అనుమతి నిలిపివేత

**ప్రజాపక్షం/వాజేడు :** ఛత్తీస్‌ఘడ్ అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వాజేడు మండలంలోని తెలంగాణ నయాగరా జలపాతం గా పిలువబడే బోగత జలపాతానికి భారీగా నీరు చేరడంతో బొగత ఉదృతంగా ప్రవహిస్తుంది. బొగత అందాలను చూసేందుకు పర్యాటకులు హైదరాబాద్ వరంగల్ కరీంనగర్ కర్ణాటక ఖమ్మం తెలంగాణ చతిస్గడ్, మహారాష్ట్ర వివిధ ప్రాంతాల నుంచి రెండు రోజులు సెలవు దినం కావడంతో శనివారం పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చి బొగత అందాలను ఆస్వాదిస్తూ, బోగతలో...అహ్లాదంగా.. ఎంతో ఆనందంగా ఉందని వ్యక్తం చేశారు. సుమారుగా 50 అడుగుల ఎత్తులో నుండి లోయలోకి జాలువారితో పాలనురుగువలె తుంపర్లు ఎగిసిపడుతూ, అందాలను వెదజల్లుతుంది. జలపాతం ఇరువైపులా పచ్చదనంతో ఉన్న అడవిలో జలదారుల శబ్దం, అడవిలో పక్షుల కేరింత ల నడుమ బొగత వద్ద అల్హాదకరమైన వాతావరణం నెలకొంది. పర్యాటకులు తమ చరవాణిలో ఫోటోలు బంధిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఈత కొనున్లోకి ఎవరిని అనుమతించడం లేదు. నీటి కలలోకి ఎవరు దిగవద్దని అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

## భారత్‌పై పెనాల్టీ సుంకాలు
# ఉండకపోవచ్చు
### ట్రంప్ సంకేతాలు

**న్యూయార్క్ :** బహుశా భారత్‌పై పెనాల్టీ సుంకాల భారాన్ని అమెరికా విధించకపోవచ్చునని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అలాస్కాలో చర్చలకు వెళుతూ విమానప్రయాణ సమయంలో ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌పై పెనాల్టీ సుంకాల భారం ఉండకపోవచ్చునన్నారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకుగాను పెనాల్టీ విధిస్తున్నట్లు ట్రంప్ గతనెలలో ప్రకటించారు. ఈ పెనాల్టీ సుంకాలు ఆగస్టు 27వ తేదీ నుండి అమలులోకి వస్తాయని కూడా ముహూర్తం నిర్ణయించారు. చైనా తర్వాత రెండోస్థానంలో భారతదేశం రష్యా నుండి భారీగా ముడి చమురు కొనుగోలు చేస్తోందని, దానిని శుద్ధిచేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తూ రష్యాకు లాభాలమీద లాభాలు సంపాదించిపెడుతోందని, ఈ ధనంతోనే ఉక్రేన్‌లో రష్యా యుద్ధం చేస్తోందని, ఒకరకంగా ఉక్రేన్‌లో ఆగకుండా రష్యా యుద్ధ దాడులు చేయడానికి పరోక్షంగా భారతదేశమే ప్రధాన కారణమని ట్రంప్ నిందలు వేశారు. రష్యాతో చమురు వ్యాపారం మానకపోతే పెనాల్టీ సుంకాలు విధిస్తానని చెప్పి ఒక తేదీ ప్రటించారు. అలాస్కాలో పుతిన్‌తో చర్చలకు ముందుగా ఇప్పుడు పెనాల్టీ విధించే అవకాశం లేదని తాజా సంకేతాలు ఇచ్చారు. రష్యాతో వ్యాపారం చేస్తున్నందుకుగాను, గడుపులోపు వాణిజ్య ఒప్పందం చేసుకోనందుకుగాను మొత్తంగా 50 శాతం సుంకాలభారాన్ని ట్రంప్ భారత్‌పై విధించారు. ఇందులో రష్యా చమురు దిగుమతి చేసుకుంటున్నందుకుగాను 25 శాతం సుంకాలను జరిమానాగా విధించారు. ఈ టారిఫ్‌ల విధింపు అన్యాయం, సమనీయం కాదని భారత ప్రభుత్వం వాదిస్తున్నది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## శిబుసోరెన్‌కు సిఎం నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. శిబుసోరెన్ స్వంత గ్రామమైన జార్ఖండ్ రామ్‌ఘడ్ జిల్లాలోని నమ్రాలో సంప్రదాయ గిరిజన ఆచారాలతో శనివారం నిర్వహించిన శిబుసోరెన్ శ్రద్ధాంజలి కార్యక్రమానికి సిఎం రేవంత్ రెడ్డి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శిబుసోరెన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, శిబుసోరెన్ సేవలను గుర్తు చేశారు. శిబు సోరెన్ జార్ఖండ్‌కు మాత్రమే కాదని, దేశంలోని గిరిజన, అణగారిన వర్గాల పక్షాన బలమైన స్వరం వినిపించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గిరిజన సమాజ ప్రయోజనాల కోసం శిబుసోరెన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. శిబు సోరెన్ కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను సిఎం రేవంత్ రెడ్డి కలిసి తన సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఎవరినీ శత్రువుగా చూడను

### అధికారాన్ని వ్యక్తిగతంగా ఉపయోగించను
### 'హసిత భాష్పాలు' పుస్తకావిష్కరణలో సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని తన కోసం కోసం వినియోగిస్తే తనకంటే మూర్ఖులు మరొకరు ఉండరని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తన అధికారాన్ని తన వ్యక్తిగతంగా ఉపయోగించలేదని, ప్రజల కోసం, పేదల సంక్షేమం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం వినియోగిస్తానని, అందుకు అందరూ తనకు అండగా నిలవాలని కోరారు. తన గెలుపే వారికి (ప్రత్యర్థులు) దుఃఖమని, అంతకంటే బాధ, ఆవేదన తాను ఏం ఇవ్వగలనని, సిఎం కుర్చీలో కూర్చొని, దస్త్రంపైన సంతకం చేస్తుంటే, వారి గుండె మీద గీత గీసినట్లుగానే ఉంటుంది కదా? అని సిఎం వ్యాఖ్యానించారు. శ్రీరామ్ రచించిన "హసిత భాష్పాలు" అనే కావ్యాన్ని హైదరాబాద్‌లోని టిజి జెన్‌కో ఆడిటోరియంలో సిఎం రేవంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత శ్రీరామ్, అందెశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తానని, 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తన లక్ష్యమని, ప్రపంచంలో గొప్ప రాష్ట్రంగా తెలంగాణను నిలబెడతానని అన్నారు. తన కోపాన్ని ప్రదర్శించేందుకు తాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని కాలేదని, తెలంగాణ ప్రజలు తన భుజాలపైన పెద్ద బాధ్యతను అప్పగించారని, ఏ హోదాను నిర్వహించకుండానే , ఏ మంత్రి పదవి చేపట్టకుండానే సిఎం అయ్యానని అన్నారు. తాను ఎవ్వరినీ శత్రువుగా చూడటం లేదని, తాను శత్రువుగా చూడాలంటే కూడా తన శత్రువుకు కూడా అంత గొప్ప తనం ఉండాలని, ఆ స్థాయి కూడా ఉండాలని అన్నారు. ఎవరి పాపాలకు వారు పోతారనే సిద్ధాంతాన్ని తాను నమ్ముతానని అన్నారు. ప్రతి వారం ఒక గంట తనను తాను సమీక్షించుకుని, ఏమైనా పొరపాటు జరిగితే సరిదిద్దుకుంటానని చెప్పారు. ఈ సమాజానికి తన వైపు నుంచి చేయాల్సింది ఉన్నదని, ఆ బాధ్యతతోనే తాను సిఎం పదవిని నిర్వహిస్తున్నానని సిఎం అన్నారు. కమాండ్ కంట్రోల్, సచివాలయం వారు నిర్మించినవాటిని ప్రపంచ అందాల పోటీలో పాల్గొన్న 109 దేశాల ప్రతినిధులకు చూపించానని కొందరు విమర్శిస్తున్నారని, కానీ, తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే' గీతాన్ని ఆ 109 దేశాల ప్రతినిధులతో తాను పాడించానని, తెలంగాణ కళాకారులు రూపొందించిన తెలంగాణ తల్లి ముందు వారిని మోకరిల్లేలా చేశానని అన్నారు. కట్టడాలు ఎవరైనా కట్టవచ్చునని, కానీ మేడలు, రంగుల భవనాలు అభివృద్ధి కాదని, చివరి పేద వారికి సంక్షేమ ఫలాలు చేరడమే విజయం అని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెబుతారని, తాను కూడా అదే నమ్ముతానని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు జిల్లాకు చెందిన సురవరం ప్రతాప్ రెడ్డిలాంటి కవులు, కళాకారులు పోరాటానికి స్ఫూర్తినిచ్చారని, ఈ ప్రాంతానికి చెందిన బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర మొదటి సిఎంగా ప్రాతినిధ్యం వహించారని, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా జైపాల్‌రెడ్డి లాంటి వారిని చూసి తాను గర్వపడుతానని సిఎం అన్నారు.

**సర్వం కోల్పోయినా.. వేల కోట్ల పెట్టుబడుల 'ఉద్యమకారుల' మధ్య అంతరం ఏమిటో ...**

ప్రజాకవులు గూడ అంజన్న, దాశరథి, కాళోజీ, అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న లాంటి కవులు లాంటి వారు పోరాటానికి, ధిక్కార స్వరానికి వేదికై ,ప్రజలకు ఒక స్ఫూర్తిని, ప్రజలకు స్వేచ్ఛను, సామాజిక న్యాయాన్ని, సమాన అవకాశాలను ఇవ్వడానికి వారు సర్వం కోల్పోయారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. చేగువేరా నుంచి అందెశ్రీ వరకు ఉద్యమంలో ప్రజలకు స్ఫూర్తినిచ్చి, లక్షలాదిమందిని ఉద్యమ బాట పట్టించి, విజయ పథం వైపు నడిపించారన్నారు. కానీ కొద్ది మంది వ్యక్తులు ఉద్యమకారులం అని చెప్పుకుని టివిలు, పేపర్లు, ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని, అయినా తాము ఉద్యమకారులం అని చెప్పుకుంటున్నారని, ఈ రెండింటి మధ్య ఉన్న అంతరం ఏమిటో అందెశ్రీలాంటి వారే చెప్పాలని, తనకు మాత్రం అర్థం కావడం లేదని సిఎం అన్నారు.

# సమాజాన్ని, దేశాన్ని కాపాడేది ఎర్రజెండా సైనికులే

### వికారాబాద్ జిల్లా 4వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/వికారాబాద్/తాండూర్ :** కమ్యూనిస్టులు అనేవారు లేకపోతే సమాజమే చచ్చిపోతుందని, భారతదేశాన్ని సైనికులు ఎలా కాపాడుతున్నరో, ఈ సమాజాన్ని, దేశాన్ని కాపాడేది ఎర్ర జెండా సైనికులేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లాలోని తాండూర్‌లో సిపిఐ వికారాబాద్ జిల్లా 4వ మహాసభలు జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అధ్యక్షతన జరిగాయి. జిల్లా మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం కూనంనేని సాంబశివరావు ప్రసంగిస్తూ కమ్యూనిస్టులు లేకపోతే సమాజమే చచ్చిపోతుందని, అయితే ఒక కమ్యూనిస్టు చనిపోతే వందలాదిమంది కమ్యూనిస్టులు పుట్టుకొస్తారని ఉద్ఘాటించారు. కావున కమ్యూనిస్టుల్లో మార్పు రావాలని, ఎర్రజెండాలు కలిసి ఒకే ఎర్రజెండా కిందికి రావాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు అనే చెట్టును మీరు రక్షిస్తే అది మీకు రక్షణగా ఉంటుంది అన్నారు. అప్పుడు ఈ బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడంతో పాటు మోదీ, అమిత్‌షాలాంటి వ్యక్తులను అణిచి వేయవచ్చున్నారు. దేశంలో, రాష్ట్రంలో ఒక సీటు మాత్రమే కాదు.. అన్ని స్థానాలలో విజయం సాధించవచ్చు అన్నారు. అధికారం కోసం ఆరాటం చేసిన కొన్ని పార్టీలు అధికారం పోగానే కనుమరుగైపోతాయని, కమ్యూనిస్టు పార్టీ ఎర్ర జెండా మాత్రమే చిరకాలం ఉండేది అనీ అన్నారు. డిసెంబర్ 2026నాటి సిపిఐ 100 ఏండ్లు పూర్తి చేసుకోబోతున్నదని తెలిపారు. పోరాటాల పురిటి నొప్పులతో పుట్టిన సిపిఐ పార్టీ అవిశ్రాంతంగా నిర్వహిస్తున్న సమరశీల పోరాటాల్లో నాటి నుంచి నేటి వరకు వేలాదిమంది అసువులు బాసారని అన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పథకాలు 100శాతం అమలు చేయడం సాధ్యం కాదనీ అన్నారు. విలేకరుల ఇండ్ల విషయంలో కోర్టు కేసు ఉన్నందున చేయలేక పోతున్నారని, జీతాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. అధికార పార్టీతో కలిసి ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, సిపిఐ నాయకులు గోపాల్‌రెడ్డి, ఫీర్ మహమ్మద్, అన ంతయ్య, మునీర్, సురేష్, బషీర్ ,రవీందర్, అబ్దుల్లా, జగదాంబ, వెంకటేష్, పలువురు సిపిఐ ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వికారాబాద్ జిల్లా కార్యదర్శిగా విజయలక్ష్మి పండిత్**



వికారాబాద్ జిల్లా 4వ మహాసభల్లో జిల్లా కార్యవర్గాన్ని కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. జిల్లా కార్యదర్శిగా విజయలక్ష్మి పండిత్ ఎన్నికయ్యారు. కాగా గోపాల్‌రెడ్డి, ఫీర్ మహమ్మద్ అనంతయ్య, సురేష్ జగదాంబ, బషీర్, రవీందర్, మునీర్‌లతో కార్యవర్గాన్ని ప్రకటించారు.

# 'రహదారుల పునరుద్ధరణ'లో వేగం పెంచండి

### భారీ వర్షాలతో గ్రామీణ రహదారులకు రూ.147 కోట్ల నష్టం... : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని గ్రామీణ రహదారులకు రూ.147.70 కోట్ల వరకు నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. మొత్తంగా 84.97 కిలోమీటర్ల రహదారులు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని రహదారులు, కల్వర్టులు, లోకాజ్ వేలు, క్రాస్ డ్రెయిన్ పనులు దెబ్బతిన్నాయని, ఇందుకు తాత్కాలిక, శాశ్వత పనుల పునరుద్ధరణ పనులను వేగంగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ సీతక్క అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరమ్మత్తుల కోసం అవసరమైన నిధులు జిల్లా కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించి ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో అధిక వర్షం కురుస్తున్న ప్రాంతాల్లోని పరిస్థితులను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన, ఇఎన్‌సిలు కృపాకర్ రెడ్డి, ఎన్.అశోక్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజల అవసరాలను గమనించి, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా, అధిక జాగ్రత్తలు తీసుకోవాలని, తాగు నీటి కలుషితం జరగకుండా, ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రంగా పెట్టాలని, నీటిని డబుల్ క్లోరినేషన్ చేసి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీతక్క సూచించారు.వర్షాల వల్ల తలెత్తే ఎమర్జెన్సీ పరిస్థితులపై తక్షణమే స్పందించాలని, ఏ సమస్య ఎదురైనా వెంటనే పునరుద్ధరణ పనుల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మిషన్ భగీరథ అధికారులు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నారని, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, నీటి సరఫరా కేంద్రాలు, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేస్తున్నారని, పంచాయతీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు గ్రామాల నుంచి రోడ్లు, కల్వర్లు దెబ్బతిన్న చోట్ల సమాచారం సేకరించి, తాత్కాలిక ప్రత్యామ్నాయ రహదారి సదుపాయాలను కల్పిస్తున్నారని అధికారులు మంత్రికి వివరించారు.

మొత్తం 84.97 కిలోమీటర్ల గ్రామీణ రహదారులు దెబ్బతినగా, 48 ప్రాంతాల్లో ఉపరి తర రోడ్లు దెబ్బతిన్నాయి, ఈ పనులకు తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ.3.32 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ కోసం రూ.42.63 కోట్లు ఖర్చు కానున్నట్లు పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అంచనా వేశారు. కల్వర్టు, లోకాజ్ వేలు, క్రాస్ డ్రేయిన్ పనులు మొత్తం 77 ప్రాంతాల్లో దెబ్బతినగా, వీటికి తాత్కాలిక పనుల కోసం రూ.1.55 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ కోసం రూ.57.60 కోట్ల వ్యయం కానుందని ఇంజనీర్లు అంచనా వేశారు. 30 ప్రాంతాల్లో గండ్లు పడగా, తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ.కోటికి పైగా ఖర్చు అవుతాయని, శాశ్వత పునరుద్ధరణ కోసం రూ.5.45 కోట్లు ఖర్చు అవుతాయని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. మొత్తంగా పిఆర్ ఆర్‌డి పరిధిలో మొత్తం 124 రోడ్లు దెబ్బతినగా, తాత్కాలిక పునరుద్ధరణ పనుల కోసం సుమారు రూ.6 కోట్లు శాశ్వత పునరుద్ధరణకు రూ.141 కోట్ల వరకు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు.

# తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద పునరుద్ధరణ చర్యలు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తూ ప్రాణనష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజా రవాణకు ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాడైన రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణ పనులకు ప్రతిపాదనలను రూపొందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు హై అలెర్ట్‌గా ఉండాలన్నారు. అధిక వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు వివరాలపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శనివారం ఆర్ అండ్ బి ఉన్నతాధికారులతో శనివారం మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రవాహాలకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు రహదారులు, భవనాల శాఖ(ఆర్ అండ్ బి) పరిధిలో 454 చోట్ల సమస్య ఏర్పడిందని, ఇందులో 629 కిలోమీటర్ల రోడ్డు దెబ్బ తిన్నదని, 22 ప్రాంతాల్లో రోడ్డు తెగిపోతే వెంటనే నాలుగు చోట్ల తాత్కాలిక పున రుద్ధరణ చేసి, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చేశామని వివరించారు. 171 ప్రాంతాల్లో ఇంకా కాజ్‌వేలు, కల్వర్టులు వరద ప్రవాహం ఉందని, రాకపోకలకు ఇబ్బంది ఉన్న 108 ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 71 ప్రాంతాల వద్ద క్లియర్ చేశామన్నారు. మిగతా చోట్ల వేగంగా క్లియర్ చేస్తున్నామని, వాగుల వెంట 58 కిలోమీటర్ల రోడ్డు కోతకు గురైందని, అందులో 378 మీటర్లు మూసివేశామని వివరించారు. మొత్తంగా 147 ప్రాంతాల్లో కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని గుర్తించినట్టు మంత్రి తెలిపారు. ఇంకా రెండు మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి ఇంజనీర్లు కల్వర్టులు, లో లెవెల్ బ్రిడ్జిలు, కాజ్‌వేల వద్ద విధిగా తరచూ క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తూ, ప్రాణనష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అందుకు పోలీస్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ప్రజా రవాణకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు, వరదలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల పూర్తి స్థాయి వివరాలు పంపాలని జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్లను ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఫీల్డ్ మానిటరింగ్ చేయాలని స్టేట్ రోడ్స్ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్ ను మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. రాష్ట్ర మొత్తం జిల్లాల వారీగా ఆర్ అండ్ బి 37 డివిజన్ల పరిస్థితులు, ఫీల్డ్ ఇంజనీర్లతో ఎప్పటికప్పుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అలెర్ట్‌గా ఉన్నామని సి.ఇ మోహన్ నాయక్ మంత్రికి వివరించారు. పాడైన రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. స్టేట్ ఎన్‌హెచ్ రోడ్లకు సంబంధించిన వివరాలు ఇంచార్జ్ ఇఎన్‌సి జయ భారతి, ఆర్‌ఒబి, ఆర్‌యుబిల వద్ద పరిస్థితిని సి.ఈ రాజేశ్వర్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

## ధర్మవరంలో ఉగ్ర కలకలం

**పాక్ 'జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ'తో సంబంధాలున్నట్టు గుర్తింపు**

**ధర్మవరం:** ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఉగ్రవాద కలకలం రేగింది. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థతో అనుబంధమున్న నూర్ మహమ్మద్ షేక్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. పాకిస్థాన్ ఉగ్రమూకతో సంబంధాలున్నట్టు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) గుర్తించింది. సత్యసాయి జిల్లా కేంద్రంలో ఉగ్ర కదలికలు ఉన్నట్టు బాహ్య ప్రపంచానికి తెలియడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఉగ్రవాది నూర్ మహమ్మద్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. అతడి నుంచి 16 సిమ్‌కార్డులు, ఉగ్రవాద సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియా ఖాతాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏపీ రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ ఉగ్ర కార్యకలాపాలకు కుట్రపన్నారన్న దానిపై వివరాలు రాబడుతున్నారు. ఎంతమంది ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారో పూర్తి సమాచారం రాబట్టేందుకు విచారణ చేపడుతున్నారు. నూర్ మహమ్మద్ ధర్మవరంలో ఓ హోటల్‌లో వంటవాడిగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. వివరాలు మీడియాకు వెల్లడించేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. ఇదిలా ఉండగా... ధర్మవరంలో ఉగ్ర కలవరంతో ఆంధ్రప్రదేశ్‌లో ఉగ్ర కదలికలపై నిఘా వర్గాలు, పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు.

# మూగబోయిన ప్రశ్నించే గొంతుక

## బాధిత ప్రజల ధిక్కార స్వరం అయోధ్య



ఓ ప్రశ్నించే గొంతుక మూగబోయింది. సమస్య ఏదైనా ఎవరితో మాట్లాడాలన్న జంకు, బొంకు లేకుండా ప్రజల పక్షాన ప్రశ్నించే ఆ గొంతుక శాశ్వతంగా ప్రజల నుంచి దూరమైంది. జననం సామాన్యమే అయినా తన జీవిత కాలం పేద ప్రజలకు అండగా నాలుగు దశాబ్దాల కమ్యూనిస్టు ఉద్యమంతో నిలిచి చరిత్రలో తనకంటూ స్థానం సంపాదించుకున్న కమ్యూనిస్టు ఉద్యమ దిగ్గజం బొల్లోజు అయోధ్య. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా, సొసైటీ అధ్యక్షునిగా పని చేసిన అయోధ్య ఆగస్టు 6న సూర్యాపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం విదితమే. అయోధ్య కుటుంబం ఇప్పటి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజక వర్గంలోని గానబండ్ల గ్రామం నుంచి మణుగూరు సమీపంలోని రామానుజవరం గ్రామానికి వలస వచ్చింది. కమ్యూనిస్టు కుటుం బం కావడంతో ముగ్గురు అన్నదమ్ముల్లో చిన్నవాడైనా అయోధ్య కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితుడై గ్రామస్థాయిలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. దాట్ల వెంకటేశ్వరబాబు, మైసా కొండయ్య, పాకాలపాటి వెంకటేశ్వరరావు (పెద్దబ్బాయి)తో కలిసి మణుగూరు ప్రాంతంలో ఒక బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యాడు. ఈ ప్రాంతంలో అనేక గ్రామాలు నిర్మాణంలో అయోధ్య పాత్ర వెలకట్టలేనిది. ఒకపక్క పోడు భూములకు పట్టాలు సాధించడం, భూమి లేని పేదలకు పోడు నరికి సాగు చేసుకునే అవకాశం కల్పించడం మరో పక్క వారు నివసించేందుకు గ్రామాలు నిర్మించడం అయోధ్యతో పాటు అప్పటి కమ్యూనిస్టు నాయకుల నేతృత్వంలో జరిగింది. ఆయన ముక్కుసూటితనం ఎంతో మంది అభిమానులతో పాటు కొందరు శత్రువులను కూడా తెచ్చిపెట్టిన మాట వాస్తవం. అయినా తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేశాడు.

మూడు దశాబ్దాల క్రితం మణుగూరు ప్రాంతంలో అప్పటి పీపుల్స్ వార్ చాలా బలంగా ఉండేది. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పోడు సాగు పెంపుదల, గ్రామాల నిర్మాణ చూసి కమ్యూనిస్టు ఉద్యమం బలపడితే తమకు ప్రమాదమని భావించారు. అయోధ్యను అడవుల్లోకి తీసుకెళ్లి కొండన్న, మంగన్న దళాలు బెదిరింపులకు పాల్పడ్డాయి. నువ్వు కమ్యూనిస్టు పార్టీ వీడకపోతే ప్రాణం పోగొట్టుకోక తప్పదని కణతిపై తుపాకీ పెట్టి హెచ్చరించారు. అయినా అయోధ్య ససేమీరా అంటూ తెగేసి చెప్పి కడ దాకా కమ్యూనిస్టు పార్టీలో కొనసాగిన ధైర్యశాలి. నాలుగు దశాబ్దాల పాటు మణుగూరు ప్రాంతంలో అత్యంత కీలక నేతగా పని చేశారు. ఎన్నో ప్రజా ఉద్యమాలకు, భూ పోరాటాలకు నాయకత్వం వహించారు. అప్పట్లో మణుగూరు ప్రాంతం లో ఉన్న భూస్వామ్య కుటుంబాలు పలు బెదిరింపులకు పాల్పడ్డాయి. ఓ జమీందారు 250 ఎకరాల భూమిని అయోధ్యకు అప్పగిస్తే,దానిని కూడా పేదలకు పంచిన త్యాగశీలి. అసమానతలు లేని, దోపిడీ లేని సమాజం కోసం ఆయన తుదిశ్వాస వరకు పరితపించారు.

ఒకప్పటి బూర్గంపాడు ఆ తర్వాత ఆవిర్భావించిన పినపాక నియోజక వర్గాల్లో కింగ్ మేకర్‌గా నిలిచారు అయోధ్య. పలుమార్లు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడమే కాకుండా పార్టీ నిర్ణయానుసారం పొత్తుల్లో ఇతర అభ్యర్థులను సైతం గెలిపించడంలో తనదైన ముద్రవేశారు. కొన్ని సందర్భాల్లో బలమైన సిపిఐని ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలు ఏకమైనా అయోధ్య వెనకడుగు వేయలేదు. జెడ్పిటిసి ఎన్నికలలోనూ, సొసైటీ ఎన్నికల్లోనూ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో కలిసి గెలిపించాడు. పార్టీ మాట అయోధ్యకు శిరోధార్యం. రాష్ట్ర, జిల్లా పార్టీలు ఏ నిర్ణయం చేసినా తూచ తప్పకుండా పాటించే వారు. చిన్న రాష్ట్రాలతో అభివృద్ధి సాధ్యమని కమ్యూనిస్టు పార్టీ భావించి ప్రత్యేక తెలంగాణకు మద్దతునిస్తే అయోధ్య దానిని అంగీకరిస్తూ ప్రత్యేక తెలంగాణ కోసం సాగిన ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రస్తుత సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుతో కలిసి ప్రత్యేక తెలంగాణ కోసం 400 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి తెలంగాణ సాధనోద్యమంలో అతి పెద్ద కదలికకు కారణమయ్యారు. ప్రజలను కార్యోన్ముఖులను చేశారు. బిటిపిఎస్ నిర్మాణంలో బాధిత ప్రజల పక్షాన నిలిచారు. ఇక్కడ భూములు కోల్పోయిన వారి పక్షాన నిలిచి హేతుబద్ధమైన ప్యాకేజీ ఇప్పించడంతో పాటు అర్హత కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో అయోధ్య చేసిన కృషి ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికి మరిచిపోలేరు. పార్టీ అండతో పలుమార్లు అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలిసి సింగరేణి ఓపెన్ కాస్ట్, బిటిపిఎస్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పార్టీలో ఏ బాధ్యత అప్పగించినా శిరసావహించి ఆ పనిని విజయవంతంగా పూర్తి చేసిన అయోధ్య జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా, ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో ఐదేండ్ల పాటు కీలక భూమిక పోషించారు. అప్పటి పాలకవర్గం మిత్రపక్షమే అయినా ప్రజలకు వ్యతిరేకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రశ్నించేందుకు, ఆందోళన చేసేందుకు వెనకడుగు వేయలేదు. సొసైటీ అధ్యక్షులుగా ఏజెన్సీ ప్రాంత రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు.



అయోధ్య ఒక ఉద్యమ ప్రతీక. అయోధ్య ఒక ప్రశ్నించే గొంతుక. అయోధ్య నడిచి వస్తున్న అరుణ పతాక. ప్రజల పక్షాన నిర్వర్తించాల్సిన పలు కర్తవ్యాలు మిగిలి ఉన్నా రోడ్డు ప్రమాద రూపంలో వచ్చిన అకాల మరణం ప్రజల నుంచి ఆయనను దూరం చేసింది. ఎందరినో శోకసంద్రంలో ముంచింది. మణుగూరు పట్టణానికే పెద్ద దిక్కుగా నిలిచిన అయోధ్య మరణాన్ని పేద, మధ్యతరగతి ప్రజలు, కార్మిక, కర్షకులు, వ్యాపార వాణిజ్య వర్గాలు జీర్ణించుకోలేకపోయాయి. ఆయన పోరాటాలను నిరంతరం మననం చేసుకుంటూ భవిష్యత్తు ఉద్యమ నిర్మాణమే మనందరి కర్తవ్యం కావాలి. అమరుల ఆశయ సాధనకు పాటు పడటమే సరైన నివాళి.

**ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి**
**(నేడు మణుగూరులోని కిన్నెర కళ్యాణ మంటపంలో బొల్లోజు అయోధ్య సంస్మరణ సభ)**

## వాజ్‌పేయ్ హయాంలో దేశం అభివృద్ధి



### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాజ్‌పాయ్ ప్రధానిగా ఉన్నప్పుడు దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. దివంగత మాజీ ప్రధాని అటల్ బీహారీ వర్ధంతి కార్యక్రమాన్ని హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. వాజ్‌పాయ్ చిత్రపటానికి రాంచందర్ రావు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రాంచందర్ రావు మాట్లాడుతూ ఆయన నాయకత్వంలో భారతదేశం ఆర్థికంగా, మౌలిక వసతుల పరంగా అద్భుతంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ ఎస్.ప్రకాష్ రెడ్డి, మాధవి, సీనియర్ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**లా గణేశన్ మృతి పట్ల.. సంతాపం తెలిపిన రాంచందర్‌రావు**

నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ మరణం పట్ల బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు సంతాపం తెలిపారు. లా గణేషన్ అనేక కీలక బాధ్యతలు నిర్వహించారని, వాటిలో రాజ్యసభ సభ్యుడిగా, తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా, బిజెపిలో పలు బాధ్యతలను నిర్వహించారన్నారు. మరణం పట్ల లా గణేశన్ కుటుంబ సభ్యులకు రాంచందర్ రావు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ - ఎల్.బి.నగర్ సర్కిల్-4
NIT No. 18/EEC-4/LBNR/2025-26 | షార్ట్ టెండర్ ప్రకటన | తేది: 14.08.2025
పని పేరు: నిర్వహణ పనులు - 3 నెం.లు, అంచనా విలువ: రూ. 21.10 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 18.08.2025న మ.3.00గం.ల నుండి 21.08.2025న మ.03.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 6603-PP/CL/ADVT/1/2025-26, Date: 16-08-2025



# జనరల్

STATE & REGIONAL NEWS

## ధర్మస్థల హత్యలను రాజకీయం చేస్తున్న బిజెపి

**బెంగళూరు:** కర్ణాటక రాష్ట్రం ధర్మస్థలలో కిరాతకమైన హత్యలు, అత్యాచారాల కేసుతో బిజెపి రాజకీయ క్రీడలాడుతోందని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ ఆరోపించారు. బిజెపి తలపెట్టిన ధర్మస్థల చలో ర్యాలీ పిలుపుపై శనివారం స్పందిస్తూ, ఈ కేసును బిజెపి రాజకీయ సమస్యగా మారుస్తోందని విమర్శించారు. భారీ ఎత్తున అనేక వాహనాలతో ధర్మస్థలకు ర్యాలీగా వెళ్ళాలని బిజెపి పిలుపు ఇచ్చింది. హిందూ ఆలయాలకు, సంప్రదాయాలకు వ్యతిరేకంగా బిజెపి కేవలం తన ప్రయోజనాలకోసం తలపెట్టిన ర్యాలీ అని శివకుమార్ విమర్శించారు. "ధర్మస్థలలో హత్యల గురించి బిజెపి మొదట నోరెత్తలేదు, కానీ ఇప్పుడు మాట్లాడుతోంది, వారు ఇప్పుడు కాకుండా సమస్య మొదలైనప్పటినుండీ మాట్లాడటం ప్రారంభించి ఉంటే బాగుండేది, ఇప్పుడు బిజెపి రాజకీయం చేస్తోంది తప్ప ఇంకేమీ లేదు, వారు ధర్మస్థలకు వెళ్ళడం కేవలం రాజకీయం మాత్రమే" అని శివకుమార్ విమర్శించారు.



## చందానగర్ ఖజానా జ్యువెలరీ దోపిడీ దొంగల అరెస్ట్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసునుసైబరాబాద్ పోలీసులు ఛేదించారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి నాటు తుపాకులు,బులెట్లుస్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను మాదాపూర్ డిసిపి వినీత్ మీడియాకు వెల్లడించారు. నిందితులు ఖజానా జ్యువెలరీ వద్ద 20 రోజులు రెక్కీ నిర్వహించినట్లు తెలిపారు. దోపిడీలో మొత్తం 7 గురు వ్యక్తులు పాల్గొనట్లు చెప్పారు. బైకులపై వచ్చి దోపిడీ చేసి అనంతరం బైకులపైనే పారిపోయినట్లు వివవరించారు.అంతేకాకుండా దోపిడీ కి నకిలీ నంబర్ ప్లేట్లతో వచ్చి దోపిడీ చేసుకుని వెళ్ళేటప్పుడు నెంబర్ ప్లేట్లను తిరిగి చేంజ్ చేసుకున్నట్లు డి సి పి పేర్కొన్నారు.హైదరాబాద్ నగర శివారులో భద్రతాసిబ్బంది ఎక్కువగా లేని ప్రాంతం లోని దుకాణాన్ని ఎంచుకొని దోపిడీకి పాల్పడి నట్లు తెలిపారు. దోపిడీ లో మొత్తం 10 కిలోల వెండి ఆభరణాల తోపాటు ఇతర వస్తువులతో ఎత్తుకుపోయినట్లు పేర్కొన్నారు.ఇట్టి దోపిడీ ముఠా గతంలో కర్ణాటక,బిహార్,కోల్ కత్త, ప్రాంతాల్లో దోపిడీలకు పాల్పడినట్లు గుర్తించినట్లు డిసిపి వెల్లడించారు.గత రెండు సంవత్సరాలు హైదరాబాద్ లోనే ఉంటూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం గడిపిన ఇట్టి బిహారీ ముఠా హైదరాబాద్ లో చేసిన దొంగతనం మొట్టమొదటిదాని,ఇతర రాష్ట్రాల కూలీలను పనిలో నియమించుకునేవాళ్లు జాగ్రత్తగా ఉండాలని డిసిపి సూచించారు. పనిలో నియమించుకునే కూలీలకు ఏమైనా నేర చరికత్ర ఉందా...అన్న కోణంలో ఆరా తీయాలని తెలిపారు.లేబర్ సప్లయ్ ఏజెన్సీలు తమ వద్దకు వస్తున్న వారి వివరాలు పోలీస్ లకు ఇస్తే బాగుంటుందని మాదాపూర్ డిసిపి వినీత్ స్పష్టం చేశారు.

## భారీ వర్షాలను ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నాం

### రైల్వే జిఎం సంజయ్‌కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారీ వర్షాల వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోడానికి సిద్దంగా ఉన్నామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. ఇందుకు అధికారులందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలు తీసుకునేందుకు జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ రైల్ నిలయంలో శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సురక్షితమైన రైలు కార్యకలాపాలను నిర్ధారించడంపై ఈ సమావేశం దృష్టి సారించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాల వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి జోన్ అధికారులు సిద్దంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో ముంపుకు ఎక్కువగా గురయ్యే వంతెనలు, సొరంగాలు,రోడ్ అండర్ బ్రిడ్జిలు వంటి సున్నితమైన మౌలిక సదుపాయాలపై ఆయన సమీక్షించారు. వీటిని అధిగమించేందుకువ అధికారులకు కీలక ఆదేశాలలోను జారీ చేశారు. కీలక ప్రదేశాలలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం, 24 గంటలూ నిఘా నిర్వహించాలన్నారు. త్వరిత గతిన స్పందించడం, ఇసుక, బ్యాలస్ట్, సిమెంట్, బండరాళ్లు పైపుల సిద్దంగా పెట్టుకోవాలన్నారు.పెరిగిన వృక్షసంపద వల్ల కలిగే ప్రమాదాన్ని గుర్తించిన జనరల్ మేనేజర్, కార్యాచరణ ప్రమాదాలను నివారించడానికి ట్రాక్‌లు,ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ (ఓ.ఎచ్.ఈ) అడ్డంకుగా పెరిగిన చెట్లను నరికివేయడం, కత్తిరించడం లేదా నాచ్ చేయడం వంటి చర్యలను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తోపాటు విజయవాడ, గుంతకల్ , గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల నుండి డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఏంలు), అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్లు (ఎ.డి.ఆర్.ఏంలు), డివిజనల్ ఇంజనీర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయడం లేదా అవసరమైతే తప్ప మిగిలిన వాటిని వాయిదా వేయడం చూసుకోవాలన్నారు. సునితమైన ప్రదేశాలు, స్టేషన్ యార్డులలో డ్రైనేజీ వ్యవస్థ యొక్క పనితీరును పరిశీలించాలన్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్‌పై ప్రశంసలు స్వాతంత్ర్య పోరాటాన్ని అవమానించినట్టే

### విజయన్ విమర్శ



**తిరువనంతపురం:** ఎర్రకోటపైనుండి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారంనాడు ఆర్‌ఎస్‌ఎస్‌పై ప్రశంసలు కురిపించడం భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని, స్వాతంత్ర్య పోరాటాన్ని అవమానించడంతో సమానమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. మానవ ప్రేమ, పరస్పర ప్రేమానురాగాల ఆదాన ప్రదానాల చరిత్రను పాతిపెట్టి ఆ స్థానంలో విద్వేషాన్ని నింపేందుకు చేసే ప్రయత్నాలను దేశ ప్రజలు ఐక్యంగా నిలబడి ప్రతిఘటించాలని పిలుపు ఇచ్చారు. ఈ మేరకు శనివారం నాడు ముఖ్యమంత్రి ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. మహాత్మా గాంధీ హత్యానంతరం నిషేధానికి గురైన మతఛాందసవాద ఆర్ ఎస్ ఎస్ సంస్థను స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ప్రశంసించడం అంటే భారత స్వాతంత్ర్యపోరాట ఘనతనంతటినీ ఆ సంస్థకు ఆపాదించేందుకు చేసే ప్రయత్నమేనని ఆ ప్రకటనలో విజయన్ విమర్శించారు. "వికారమైన, పరిహాసాస్పదమైన చర్యలకు మసిపూసి మారేడుకాయలా మార్చడం సాధ్యంకాదని హెచ్చరించారు. ఆర్‌ఎస్‌ఎస్ చరిత్ర అత్యంత విషపూరితమైనదని, ఆర్ ఎస్‌ఎస్ చరిత్రే విభజనవాద రాజకీయ చరిత్ర అని విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకరోజున తన ప్రసంగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్‌ఎస్‌ఎస్‌ను గొప్ప సంస్థగా తన ప్రసంగంలో చిత్రీకరించేందుకు ఉపయోగించుకున్నారని, ఇది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను అవమానించడమేనని పేర్కొన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద స్వచ్ఛంధ సేవాసంస్థ ఆర్ ఎస్‌ఎస్ 100 సంవత్సరాల ప్రయాణం ఎంతో గర్వకారణం, ఘనకీర్తి ప్రతిష్ఠలతో కూడుకున్నదని శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోదీ ప్రశంసించారు. దీనిపై సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు దేశానికి చిత్తశుద్ధితో చేసిన సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని ఆయన అన్నారు. "100 సంవత్సరాలక్రితం ఒక సంస్థ ఆవిర్భవించింది, అదే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్), జాతి సేవలో 100 సంవత్సరాలు ఎంతో గర్వించదగిన ప్రయాణం, చరిత్రపుటల్లో ఎంతో గర్వకారణం,ఖ్యాతిమంతమైన సేవలు" అన్నారు. మోదీ కూడా గతంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా పనిచేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను మోదీ కీర్తించడం, కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖవారి స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రికలో మహాత్మాగాంధీ పేరుకంటే వి.డి.సావర్కర్ ప్రతిష్ఠను ఉన్నతంగా చూపించడం...ఇదంతా ఒక కుట్రలో భాగంగా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు.

# అక్కడా.. ఇక్కడా మహిళే సూత్రధారి

### మేడ్చల్ జిల్లాలోనూ సృష్టి ఫెర్టిలిటీ తరహాలో అక్రమ సరోగసి

### పేద మహిళల గర్భానికి కాస్తంత ఇచ్చి సంతానం లేని వారికి అమ్మకాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మహిళ సూత్రధారిగా తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ తరహాలో మేడ్చల్ జిల్లాలో మరో మహిళ కీలక సూత్రధారిగా అక్కమ సరోగసి వెలుగులోకి వచ్చింది. రెండు ఉదంతాల్లోనూ సంతానం లేని వారి నుండి భారీ మొత్తంలో డబ్బులు లాగుతూ మరో మహిళల ద్వారా సంతానాన్ని అప్పగించటమే నేరవిధానం. తాజాగా వెలుగులోకి వచ్చిన మేడ్చల్ జిల్లా అక్రమ సరోగసి ఉదంతంలో సూత్రధారైన మహిళ తన కుమారుడితో కల్సి పలు ఫెర్టిలిటీ సెంటర్లు, ఆస్పత్రులతో సంబంధాలు పెట్టుకొని పేదరికంతో మగ్గే కుటుంబీకుల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా తీసుకొన్న మహిళల నుండి అండాలు, గర్భానికి ధర కట్టి కాస్తంత ఇచ్చి సంతానం లేని వారి నుండి సంపాదించుకోవటమే లక్ష్యంగా తెరలేపింది. జిల్లాలోని పేట్ బషిరాబాద్‌లో శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఉమాగౌరి, మేడ్చల్ ఎస్ఓటి, స్థానిక పోలీసుల సాయంతో నిర్వహించిన దాడుల్లో విషయం వెలుగులోకి వచ్చింది. దాడుల్లో గర్భధారణ మందులు, హార్మోన్ ఇంజక్షన్లు, బాండ్ పేపర్లు, ప్రామిసరీ నోట్లతో పాటు రూ. 6.47 లక్షల నగదు స్వాధీనం చేసుకొన్నారు. తల్లీకొడుకులతో పాటు ఈ దందాలో పాత్రులుగా గుర్తించిన ఏడుగురు మహిళలను సైతం అరెస్టు చేసి మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చిలకలూరిపేటకు చెందిన భర్త నుండి విడిపోయిన నర్రెద్దుల లక్ష్మీ రెడ్డి తొలుత మహారాష్ట్రకు వెళ్లి ఫెర్టిలిటీ కేంద్రాలకు అండాల విక్రయం, సరోగసి ద్వారా , అక్కడి పిల్లలను ఎత్తుకొచ్చి సంతానం లేని దంపతులకు విక్రయించటం ద్వారా ముంబయి పోలీసులకు పట్టుబడి కొంత కాలం జైలు జీవితం సైతం గడిపింది. ఆ తర్వాత జైలు నుండి విడుదలైన తర్వాత హైదరాబాద్‌కు మకాం మార్చి పాత తరహాలోనే నేరాలకు పాల్పడుతూ డబ్బు సంపాదించి ఆమె ఐదేళ్ల క్రితం సుచిత్ర చౌరాస్తా సమీపంలోని న్యూమాణిక్య నగర్‌లో ఓ సొంత భవనం నిర్మించుకొంది. అప్పటి నుండి తన నేరాలను మరింత ఉధృతంగా చేసే లక్ష్యంగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన తన కుమారుడు నరేందర్‌రెడ్డి సాయంతో ఎపి, మహారాష్ట్ర, తెలంగాణా రాష్ట్రాల్లో తన కార్యకలాపాలకుగాను ఏజంట్లను ఏర్పాటు చేసుకొంది. ఏజంట్ల ద్వారా వివిధ ప్రాంతాల్లో పేదరికంతో మగ్గుతున్న కుటుంబాలను వెతికి పట్టుకొని వారి నుండి అండాలు ఇచ్చి గర్భాల ద్వారా కలిగిన పిల్లలను సంతానం లేని వారి నుండి లక్షల్లో తీసుకొని అప్పచెప్పటం నేరవిధానంగా మార్చుకొంది. ఈ విధంగా సంతానం లేని దంపతుల నుండి రూ. 10 నుండి 20 లక్షలు తీసుకోవటం, అండం, ఇచ్చిన పేద కుటుంబ మహిళలకు నాలుగైదు లక్షలు ఇవ్వటం చేసే వారు. పేదింటి యువతులకు గాలం వేసి కొంత మొత్తాన్ని ఇస్తానని ఆశ చూపించటం ద్వారా వారిని సరోగసి, అండాల దానానికి ఒప్పించి జోరుగా అక్రమ సరోగసి దందా సాగిస్తున్నారు. ప్రధాన నిందితురాలు లక్ష్మి రెడ్డి నివాసం నుండి వైద్యారోగ్య శాఖాధికారులు, పోలీసులు ఆమె ఇంట్లో నుండి అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, ఈవిఎఫ్, ఫర్టికేర్, శ్రీ ఫెర్టిలిటి, అమూల్య ఫెర్టిలిటి సెంటర్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకొన్న ఆధారాలను స్వాధీనం చేసుకొన్నారు. రెండు కిడ్నీలు దెబ్బ తిన్న భర్తను బతికించుకొనేందుకు లక్ష్మి రెడ్డితో సరోగసికి అంగీకరించిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ మహిళ కొంత డబ్బు తీసుకొని గర్భం దాల్చి వారి సూచనల మేరకు కొంపల్లిలోని అంగన్వాడి కేంద్రంలో తన పేరు నమోదు చేసేందుకు రావటంతో అనుమానం కలిగటం, తర్వాత ఆరా తీసి దాడులు నిర్వహించటంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.



కమర్షియల్ సరోగసి నిషేధం

పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని తన అండాన్ని ఉపయోగించిటం, ఐవిఎఫ్ ద్వారా సృష్టించిన అండాన్ని గర్భాశయంలో నాటడం గర్భాన్ని దాల్చి పిల్లలను కనటమనేది సరోగసిగా పేర్కొంటారు. కాగా డబ్బులు తీసుకొని సరోగసికి వెళ్లటమనేది కమర్షియల్ సరోగసిగా పేర్కొంటూ మన దేశంలో 2021 సరోగసి చట్టం ద్వారా నిషేధించారు.

## ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉంటేనే విద్యుత్ కనెక్షన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఆఫీసర్లు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయకుండా బహుళ అంతస్తుల భవనాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వరాదని హైకోర్టు తీర్పు చెప్పింది. బిల్డర్లు ఆమోదించిన ప్లాన్‌ను పలుసార్లు మార్పులు చేర్పులు చేసి నిర్మాణాలు చేస్తున్నందున ముందుగా విద్యుత్ కనెక్షన్ పొందడానికి వీల్లేదని స్పష్టం చేసింది. కోర్టులో తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తామని హామీ ఇచ్చి అందుకు విరుద్ధంగా చేస్తున్నారని, ప్లాన్‌కు భిన్నంగా నిర్మాణాలు, అదనపు అంతస్తులను నిర్మిస్తున్నారని తప్పుపట్టింది. కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తే ఊరుకోబోమని తెల్చి చెప్పింది. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చెప్పింది. సమాజ హితం కోసం ఈ విధమైన ఉత్తర్వులు ఇస్తున్నట్లు వెల్లడించింది. తొలుత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ఆ తరువాతే తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీఎస్‌పీడీసీఎల్) విద్యుత్ కనెక్షన్‌ను చట్ట ప్రకారం పొందాలని తీర్పులో పేర్కొంది. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని తన భవనానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఓసీ కోసం పట్టుబట్టకుండా టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మహమ్మద్ ఆరిఫ్ రిజ్వాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. స్టిల్ట్‌తో పాటు ఐదు అంతస్తుల నిర్మాణం జీహెచ్‌ఎంసీ మంజూరు చేసిన ప్రణాళిక ప్రకారమే జరిగిందన్నారు. అన్ని చార్జీలు చెల్లించిన తర్వాతే విద్యుత్ కనెక్షన్‌కు అనుమతి కోరామని చెప్పారు. టీజీఎస్‌పీడీసీఎల్ తరఫు న్యాయవాది శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గతంలో ఓసీ సడలింపులకు అధికారులు అనుమతి ఇవ్వడంతో చాలా మంది లబ్ధిదారులు ఆ తర్వాత కూడా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించలేదన్నారు. విద్యుత్ కనెక్షన్ పొంది సరఫరాను అనుభవిస్తున్నారని.. దీంతో ఈ ఏడాది జనవరిలో టీజీఎస్‌పీడీసీఎల్ ఓ సర్క్యులర్ జారీ చేసిందన్నారు. 10 మీటర్ల ఎత్తు కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలకు విద్యుత్ సేవలకు ఓసీ తప్పనిసరి చేసిందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చాలా మంది బిల్డర్లు అనుమతి పొందిన దానికి విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని అభిప్రాయపడ్డారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించేలా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. నిబంధనల మేరకు నిర్మాణం చేపడితే ముందుగా ఓసీ పొందాలని, ఆ ఆ తర్వాత విద్యుత్ కనెక్షన్ కోరవచ్చని స్పష్టం చేస్తూ, పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించారు.


# అన్నదాతలకు 'ముంపు' కష్టాలు

### భారీ వర్షాలతో నీటి మునుగుతున్న పంటలు

### దుఖ : సాగరంలో రైతన్నలు







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారీ వర్షాలు అన్నదాతలకు కష్టాలను తెచ్చిపెట్టాయి. ఆరుగలం కష్టపడి వేసిన పంట నీటిపాలు కావడంతో రైతులు దుఖః సాగరంలో మునిగిపోతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నడంతో రైతాంగం బిక్కు బిక్కుమంటున్నారు. ముఖ్యంగా పత్తి, సోయాబిన్, కంది, కూరగాయాల పంటలకు భారీ నష్టం వాట్లిడంతో ఈ రైతులందరూ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పలు జిల్లాలలో పొలాలు కాల్వలను తలపిస్తుండడంతో నాటిన మొక్కలు కొట్టుకుపోతున్నాయి. మరో వైపు పొలాలు నీట మునుగడంతో ఉన్న మొక్కలు నీటిలో కుళ్లిపోతున్నాయి. వరద నీటి ప్రవాహానికి పొలాల్లో ఇసుక మెటాలు వేస్తుండడంతో రైతున్నలు లబోదిబో మంటున్నారు. ప్రధానంగా కాల్వలు, చెరువులు, కుంటల కింద సాగులో ఉన్న పంటలకు అపార నష్టం చోటు చేసుకుంది. మైదాన ప్రాంతాల్లో కొంత మేర పంటలు దెబ్బతిన్నాయి. ఈ భారీ వర్షాలతో వాణిజ్యపంటలకు తీవ్ర నష్టం వాట్లిగా వరి పంటలకు మాత్రం పెద్దగా నష్టం ఏమి జరగలేదు..

నది పరివాహక ప్రాంతాల్లో ఆపార నష్టం

వర్షకాలానికీ తోడు బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో ఎగువ రాష్ట్రాలతో పాటు రాష్ట్రంవ్యాప్తంగా గడిచిన వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గోదావరితో పాటు కృష్ణానదులకు భారీ వరద పొటెత్తడమే కాకుండా రాష్ట్రంలోని అన్ని జలాశయాలు నిండు కుండలను తలపిస్తూ పొంగి పోర్లుతున్నాయి. మరోవైపు చెరువులు, కుంటలు మత్తళ్లు దిక్కుతూ పరిసర ప్రాంతాల్లోని పంట పోలాలను ముంచెత్తుతున్నాయి. దీంతో పసుపు, అల్లం, పత్తి, సోయాబిన్, కందితో పాటు చిరు ధాన్యాలు, కూరగాయాల పంటలకు ఆపార నష్టం చోటు చేసుకుంది.ఉత్తర తెలంగాణలో శుక్రవారం ఆర్థరాత్రి నుంచి శనివారంకు భారీ వర్షం కురువడంతో పలు జిల్లాలో వాణిజ్య పంటలకు ఆపార నష్టం వాట్లిలింది.. వరద నీరు పొంగి పోర్లడంతో వేల ఎకరాలలో ఇసుక మేటాలు వేశాయి. దీంతో తిరిగి పంట సాగు చేసుకునే అవకాశం లేకపోవడంతో రైతులు లబోదిబోమంటూన్నారు.

**భారీ వర్షాలతో లెక్కలు తేలని పరిస్థితి :**

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తమైయ్యాయి. ఆయా జిల్లాల్లో చోటు చేసుకున్న పంట నష్టాలను అంచనా వేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అదేశాలతో జిల్లా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రాథమిక అంచనా వేస్తున్నారు. అయితే అంతకు అంతా భారీ వర్షాలు కురుస్తుండడంతో లెక్కలు ఇప్పుడే తేలే పరిస్థితి లేకుండ పోయింది.. శనివారంవరకు జరిగిన పంట నష్టాలను ఆయా జిల్లాల అధికారులు అంచన వివరాలను ఉన్నతాధికారులు పంపినప్పుడు తిరిగి శనివారం భారీ వర్షాలు కురువడంతో లెక్కలు ఒక్కసారిగా మారిపోయ్యాయి. దీంతో ఏ జిల్లాలో ఏ పంటలు ఎంత మేరకు నష్టం వాట్లిలిందనే వివరాలను కూడ అధికారులు వెల్లడించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతోపలు జిల్లాల్లో వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పడితే తప్ప ఏఏ జిల్లాలో ఏఏ పంటలకు ఎంత మేరకు పంట నష్టం వాట్లిందనే అంచన వేయలేమని అధికారులు వెల్లడిస్తున్నారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్లే వరద నీటి ఇబ్బందులు

### బిఆర్ఎస్ సీనియర్ నేత ఆనంద్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం కారణంగా గోషామహల్ నియోజకవర్గంలో ప్రజలు వరద ముంపుతో ఆస్తి నష్టంతో పాటు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారని బిఆర్ఎస్ సీనియర్ నేత ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ విమర్శించారు. గౌలిగూడలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదు నెలలుగా కచ్చా మోరీలు, నాలాల పూడికతీత పనులను చేపట్టాలని జిహెచ్ఎంసి అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే వరద నీరు ఇళ్లలోకి చేరి, సరుకులు, ఫర్నిచర్ వంటి వస్తువులు పాడైపోయి ప్రజలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

**గోషామహల్‌లో అక్రమ నిర్మాణాలు..**

అక్రమ నిర్మాణాలకు కొందరు కార్పొరేటర్లు, అధికారులు సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, తమ స్వార్థం కోసం అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న కార్పొరేటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్‌సి హాస్టల్ ఎదురుగా అక్రమంగా నిర్మిస్తున్న ఐదు అంతస్తుల భవనంపై నుండి పడి ఒక వ్యక్తి మరణించిన విషయాన్ని పోలీసులు, కార్పొరేటర్లు కుమ్మక్కై దాచి పెట్టారని ఆనంద్ కుమార్ గౌడ్ విమర్శించారు. దీనిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, భవనాన్ని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. గౌలిగూడ, కరాచీ బేకరీ గల్లీ, బేగంబజార్, ఇసామియా బజార్ వంటి ప్రాంతాల్లో కూడా అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ అక్రమ నిర్మాణాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నప్పటికీ అధికారులు కళ్లు మూసుకుని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఉత్తర తెలంగాణ కేంద్రంగా గొల్లకురుమల సాంస్కృతిక సమ్మేళనం

### ముఖ్య అతిథిగా హాజరైన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



**హనుమకొండ :** ఉద్యమాల పురిటి గడ్డ ఓరుగల్లులో 'యాదవ వెల్ఫేర్ ట్రస్ట్‌వరంగల్' వేదికగా కుడా మాజీ చైర్మన్ ఎస్. సుందర్ రాజ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో ఉత్తర తెలంగాణ వేదికగా గొల్లకురుమల ఐక్యతను చాటేలా ఈ గొల్లకురుమ సాంస్కృతికం సమ్మేళనాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. జానపద కళాకారుల ప్రదర్శన, మహిళల బోనాలతో హనుమకొండలోని గోకుల్ నగర్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా కాళోజీ కళాక్షేత్రం వరకు వేలమందితో శ్రీ కృష్ణుడి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు.రెండువేల మంది గొల్ల కురుమల యువత ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ వేడుకలకు హర్యానా మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులు వేడుకల్లో గొల్లకురుమ సంస్కృతి సంప్రదాయాలను కళ్లకు కట్టేలా ప్రదర్శనలు ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగాం, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన గొల్లకురుమలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రజలు ఈ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగస్వాములు అయ్యారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, మాజీ ఎమ్మెల్యేలు ఎం. ధర్మారావు,వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్,గొర్రెల, మేకల పెంపకందారుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీజేపీ నాయకులు రావు పద్మారెడ్డి, గంటా రవికుమార్, అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్, యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యుడు కెంచ కుమార స్వామి, కార్పొరేటర్ జక్కుల రమా రవీందర్,అశోక్, సినీ, టీవి కళాకారులు కోమలి, మల్లిక్ తేజ, యశోద, నక్క శ్రీకాంత్, అనిత,లావణ్య,మౌనిక,యాదవ మహాసభ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అబార్షన్ వికటించి మహిళ మృతి

### మృతదేహంతో ప్రైవేట్ హాస్పిటల్ ఎదుట ధర్నా....





**ప్రజాపక్షం /తుంగతుర్తి:** అబార్షన్ వికటించి మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సంగెం గ్రామానికి చెందిన బయ్యగళ్ల విజిత (26) గోరంట్ల గ్రామానికి చెందిన బయ్యగల్ల శ్రీనుతో గతంలో వివాహం జరిగింది. కాగా వీరికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. ఇటీవల విజిత మూడవ సారి గర్భం దాల్చి గా ఈనెల 15న సాయంత్రం కడుపునొప్పి రావడంతో మండల కేంద్రంలోని ఆర్‌ఎంపి వైద్యుడు నిర్వహిస్తున్న ప్రవేట్ ఆసుపత్రికి వెళ్ళారు. అక్కడ పరీక్షించిన వైద్యుడు స్కానింగ్ చేయాలని చెప్పడంతో చేయించారు. స్కానింగ్ చేయగా బిడ్డ అడ్డంగా ఉందని అబార్షన్ చేయాలని వైద్యులు చెప్పాడు. రూ. 25 వేలు చెల్లిస్తే అబార్షన్ చేస్తానని చెప్పడంతో అట్టి డబ్బులు చెల్లించాడు. దీంతో ఆమెకు అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో ఆమెను వెంటనే ఖమ్మం లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని చెప్పడంతో కుటుంబ సభ్యులు అక్కడికి తరలించారు. పరిస్థితి అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రిలో చేరిక చేసుకోలేదు. చివరికి అక్కడ ఉన్న మమత ఆసుపత్రిలో చేర్పించారు. పరిశీలించిన డాక్టర్లు గర్భసంచి పగిలిందని చెప్పారు. దీంతో ఆమె చికిత్స పొందుతుండగా తీవ్ర రక్తస్రావమై మరణించింది. దీంతో మృతురాలి బంధువులు మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ డాక్టర్ చేసిన అబార్షన్ ఆపరేషన్ వల్లనే మరణించిందని తమకు న్యాయం జరగాలని కోరుతూ మృతురాలి శవాన్ని హాస్పిటల్ ముందు ఉంచి ధర్నా చేస్తున్నారు . ఇందుకు బాధ్యులైన ఆర్‌ఎంపీ డాక్టర్ పై చర్యలు తీసుకుని తమకు న్యాయం జరిగేంత వరకు తాము ఇక్కడి నుండి కదిలే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## వచ్చే ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ ఎన్నికలు

### ఈ నిర్ణయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు : అలమ్

ఢాకా: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని, ఇందులో ఎలాంటి మార్పులూ చేర్పులూ ఉండబోవని, ఈ ఎన్నికలు జరగకుండా ఎవ్వరూ అడ్డుకోలేరనీ ఆ దేశ హోం వ్యవహారాల సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) జహంగీర్ అలమ్ చెప్పారు. ఈనెల ఐదో తేదీన తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్ యూనుస్ ప్రకటించిన విధంగా 2026 ఫిబ్రవరిలో ఎన్నికలుజరుగుతాయని, ఇందులో ఎలాంటి మార్పులూ లేవని అలమ్ చెప్పారు. మేం ఎవ్వరి మాటా వినదల్చుకోలేదు, ఎన్నికలు జరిగి తీరుతాయి, కొన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి, కానీ ప్రధాన బాధ్యత రాజకీయపార్టీలపైనే ఉంది అని అలమ్ చెప్పారు. ఈ ఎన్నికలు ఫిబ్రవరిలో జరగకుండా ఎవ్వరూ ఆపలేరన్నారు.

# నేటి నుంచి రాహుల్ గాంధీ ‘ఓట్ అధికార్ యాత్ర’

**● 15 రోజుల పాటు ప్రతిపక్ష నేత బిహార్‌లోనే మకాం ● సెప్టెంబరు 1న పాట్నాల భారీ ర్యాలీ**



**పాట్నా :** ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోసారి యాత్ర చేయనున్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ద్వారా ప్రజల ఓటు హక్కుపై జరిగిన దాడిని ఎత్తిచూపడానికి కాంగ్రెస్ అగ్రనేత ఆదివారం యాత్రను ప్రారంభించనున్నట్లు పార్టీ సీనియర్ నాయకుడు తెలిపారు. శనివారం బిహార్ రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అఖిలేష్ ప్రసాద్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సెప్టెంబర్ 1న పాట్నాలో జరిగే ర్యాలీతో ‘ఓటు అధికార్ యాత్ర’ ముగిసే వరకు పక్షం రోజుల పాటు రాష్ట్రంలో ఉండే అవకాశం ఉందని అన్నారు. ఆదివారం ఆయన ససారాం నుండి యాత్రను ప్రారంభిస్తారని చెప్పారు. అందుకు సంబంధిత అధికారుల నుండి అవసరమైన అన్ని అనుమతి పొందామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఈ ముందు యాత్ర ఇండియా కూటమికి అనుకూలంగా మారుతుందని రాజ్యసభ ఎంపి అన్నారు. ఈనెల 20, 25, 31 తేదీల్లో మూడు విశ్రాంతి రోజులతో రాష్ట్రంలోని 25 జిల్లాలను కవర్ చేసే యాత్రకు నాయకత్వం వహించడానికి రాహుల్ గాంధీ దాదాపు 15 రోజులు బిహార్‌లో ఉండే అవకాశం ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. ససారాంలో రాహుల్ గాంధీతో పాటు బిహార్ ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్, మూడు వామపక్ష పార్టీలు సహా ఇతర కూటమి భాగస్వాములు చేరే అవకాశం ఉందని, సెప్టెంబర్ 1న పాట్నాలో జరిగే చివరి ర్యాలీకి, వీలైనన్ని ఎక్కువ మంది సారూప్యత కలిగిన పార్టీల నాయకులను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు సింగ్ తెలిపారు. పార్లమెంటులో ఓటర్ల సవరణ వంటి సున్నితమైన అంశంపై చర్చ కోసం తాము చేసిన విజ్ఞప్తిని కేంద్ర సర్కార్ పట్టించుకోవడం లేదని అందుకే వీధుల్లోకి రావడం తప్ప వేరే మార్గం లేదన్నారు. ఎన్నికల కమిషన్ ప్రవర్తన మూర్ఖులు లేదా మోసపూరితంగా ఉన్న వారి నుండి రాజ్యాంగం అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటుందని బాబాసాహెబ్ అంబేద్కర్ హెచ్చరిక తమను గుర్తు చేస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి ఎన్‌డిఏ భాగస్వాములతో సహా అన్ని పార్టీలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ఆందోళన వ్యక్తం చేశాయని, అందులో భాగంగా లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించారని సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై బిజెపి, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జెడి(యు) మాతం నోరు మెదపలేదన్నారు. ఏది ఏమైనప్పటికీ, బిజెపితో పొత్తు పెట్టుకున్న కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో ఓడిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుత పాలనతో విసిగిపోయారన్నారు. రాహుల్‌గాంధీ ప్రతిపాదిత యాత్రకు వ్యతిరేకంగా కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చేసిన వ్యాఖ్యల గురించి అడిగినప్పుడు, కాంగ్రెస్ నాయకుడు నవ్వుతూ ఇలా సమాధానమస్తూ ‘నిన్న, ఆయన, నేను ఢిల్లీ నుండి ఒకే విమానంలో ఇక్కడికి వచ్చాము. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గురించి ఆయన మా ఆందోళనలను పంచుకుంటున్నారు. కానీ, బహిరంగంగా, ఆయన పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలి కాద’ అని అన్నారు. కాగా, యాత్రలో తేజస్వీ యాదవ్ పోషించబోయే కీలక పాత్రను ప్రదర్శించడానికి ఆర్‌జెడి హిందీ, భోజ్‌పురి మిశ్రమ సాహిత్యంతో కూడిన రెండున్నర నిమిషాల పాటను విడుదల చేసింది. పాట వీడియోలో, తేజసీ రాహుల్‌గాంధీతో కలిసి స్థలాన్ని పంచుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఎవరి ఓటు హక్కును లాక్కోకుండా, స్వేచ్ఛా స్ఫూర్తిని ఎప్పటికీ కోల్పోకుండా ప్రజలను ఉత్తేజపరిచేందుకు, అప్రమత్తంగా, సిద్ధంగా ఉన్న నాయకుడిగా ప్రశంసించబడింది.

### ఓట్ చోరీ ప్రచారం.. స్పూఫ్ వీడియో షేర్ చేసిన రాహుల్

ఓట్ చోరీకి పాల్పడుతోందంటూ ఎన్నికల కమిషన్‌పై వరుస విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మరోసారి ఓట్ల చౌర్యంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హాస్యం, వ్యంగ్యం మేళవించిన స్పూఫ్ వీడియోను శనివారంనాడు సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో షేర్ చేశారు. బాలీవుడ్ చిత్రం ‘లాపతా లేడీస్’ స్ఫూర్తితో ఈ వీడియోను రూపొందించారు. రహస్యంగా, దొంగతనంగా... ఇక వద్దు, ప్రజలు మేలుకొన్నారు’ అని రాహుల్ ఆ వీడియో తో పాటు ఒక పోస్ట్ చేశారు. ఆ వీడియోలో ఒక మధ్యవయస్కుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వస్తాడు. ఏమి పోయిందని అధికారి అడుగుతాడు. ఆ వ్యక్తి కొద్దిసేపు ఆగి... ‘నా ఓటు’.. అని చెబుతాడు. ఆశ్చర్యపోవడం ఆ పోలీసు అధికారి వంతవుతుంది. ‘ఓటు ఎత్తుకెళ్లడం ఎవరికైనా ఎలా సాధ్యమవుతుంది?’ అని ఆయన అడుగుతాడు. ‘నకిలీ ఓట్ల ద్వారా లక్షలాది ఓట్లు చోరీ అవుతున్నాయి’ అని ఆ మధ్య వయస్కుడు జవాబిస్తాడు. ‘ఒకరి ఓటును దోచుకోవడం అంటే ఒకరి హక్కును దోచుకోవడమే’ అనే సందేశంతో వీడియో ముగుస్తుంది.

## భారత దిగుమతులపై అమెరికా సుంకం పెంపు
# పరిశ్రమ, ఉపాధిపై తీవ్ర ప్రభావం

### తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె. స్టాలిన్ ఆందోళన



**చెన్నై:** భారత దిగుమతులపై అమెరికా సుంకం పెంచడం వల్ల పరిశ్రమ, ఉపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె. స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ఉపశమన ప్యాకేజీని అందించాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీలో ప్రధాన చెల్లింపుపై తాత్కాలిక నిషేధం ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అమెరికాతో పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాన్ని సాధించడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను అభినందిస్తూనే, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి దేశం వైఖరి పూర్తి మద్దతు తెలిపారు. ‘ఈ సందర్భంలో తమిళనాడుకు గణనీయమైన ఆందోళన కలిగించే విషయాన్ని మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాను. ఎందుకంటే ప్రస్తుత 25 శాతం సుంకం, దాని సంభావ్య పెరుగుదల 50 శాతానికి పెరగడం వల్ల తీవ్ర ప్రభావాలను ఎదుర్కొంటోంది’ అని స్టాలిన లేఖలో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో భారతదేశం మొత్తం వస్తువుల ఎగుమతులు యుఎస్‌డి 433.6 బిలియన్లలో 20 శాతం యుఎస్‌డి అయితే, తమిళనాడు యుఎస్‌డి 52.1 బిలియన్ వస్తువులలో 31 శాతం ఆ దేశానికి ఎగుమతి చేయబడ్డాయి. అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడటం వల్ల తమిళనాడుపై సుంకాల ప్రభావం ఇతర భారతీయ రాష్ట్రాల కంటే అసమానంగా ఎక్కువగా ఉంటుందని స్పష్టంగా సూచిస్తుంది. అందువల్ల ఈ సుంకం తమిళనాడు తయారీ రంగం, ఉపాధి దృష్టాంతంపై గణనీయమైన ప్రభావాలను చూపుతుందని ఆయన ప్రధాని మోదీతో అన్నారు. ఎగుమతులు మందగించడం వల్ల త్వరగా భారీ తొలగింపులు జరిగే రంగాలైన వస్త్రాలు, దుస్తులు, యంత్రాలు, ఆటో విడిభాగాలు, రత్నాలు, ఆభరణాలు, తోలు, పాదరక్షలు, సముద్ర ఉత్పత్తులు, రసాయనాలు అన్ని శ్రమతో కూడిన రంగాలు ఎక్కువగా ప్రభావితమవుతాయి. 2024–2025లో దేశంలోని వస్త్ర ఎగుమతుల్లో దక్షిణాది రాష్ట్రం 28 శాతం వాటా కలిగి ఉందని, ఇది అన్ని భారతీయ రాష్ట్రాలలో అతిపెద్ద వాటాదారు అని ఆయన అన్నారు. ఈ రంగం దాదాపు 75 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని, 25 శాతం సుంకం, ప్రతిపాదిత 50 శాతం సుంకంతో, 30 లక్షల ఉద్యోగాలు తక్షణ ప్రమాదంలో ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సంక్షోభాన్ని తగ్గించడానికి, మన ఎగుమతి పోటీతత్వాన్ని చాలా కాలంగా అడ్డుకుంటున్న నిర్మాణాత్మక సమస్యలను పరిష్కరించడం చాలా అవసరమని, ఈ విషయంలో ప్రభావిత రంగాలకు చెందిన పరిశ్రమ సంఘాలతో తాను విస్తృతంగా సంప్రదింపులు జరిపానన్నారు ఈ సంప్రదింపుల ఆధారంగా, వస్త్ర రంగానికి రెండు అంశాలలో అత్యవసరంగా మద్దతు అవసరమని స్పష్టమవుతోందని, మానవ నిర్మిత ఫైబర్ విలువ గొలుసు కోసం జిఎస్‌టి విలోమ సుంకం నిర్మాణాన్ని సరిదిద్దడం, మొత్తం గొలుసును 5 శాతం జిఎస్‌టి స్లాబ్ కిందకు తీసుకురావడం, అన్ని రకాల పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపు అని ఆయన అన్నారు. టారిఫ్ ప్రభావాలు, ప్రపంచ వాణిజ్యంలో పోటీ ఒత్తిళ్ల కారణంగా ఇతర రంగాలు కూడా ఇలాంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, తక్షణ ఉపశమనం అందించడానికి, కేంద్ర ప్రభుత్వం లిక్విడిటీని మెరుగుపరచడానికి, వ్యయ భారాలను తగ్గించడానికి సుంకాల వల్ల ప్రభావితమైన అన్ని ఎగుమతిదారులకు ప్రత్యేక వడ్డీ రాయితీ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని పరిగణించాలని స్టాలిన్ మోదీని కోరారు. అధిక టారిఫ్ మార్కెట్ నష్టాలను పూడ్చడానికి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఏలు), ద్వైపాక్షిక ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. సమస్య పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకుంటే, మన ఎగుమతిదారులకు మద్దతు ఇవ్వడానికి కొవిడ్ కాలంలో అమలు చేసిన మాదిరిగానే ప్రధాన చెల్లింపుపై మారటోరియంతో సహా ప్రత్యేక ఆర్థిక ఉపశమన ప్యాకేజీ అవసరమని ఆయన మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ‘తమిళనాడులో అభివృద్ధి చెందుతున్న తయారీ రంగం ఇంతకు ముందెన్నడూ చూడని సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది, ఇది వివిధ రంగాలలోని లక్షలాది మంది జీవనోపాధికి ముప్పు కలిగిస్తుంది. అందువల్ల, సంబంధిత మంత్రిత్వ శాఖలు, పరిశ్రమ వాటాదారులతో సంప్రదించి ఈ విషయంలో తక్షణ జోక్యం చేసుకోవాలని అభ్యర్థిస్తున్నాను‘ అని ముఖ్యమంత్రి అన్నారు.

## కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు

**న్యూఢిల్లీ :** దేశ విభజన సమయంలోని భయానక పరిస్థితులను వివరిస్తూ..నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) విద్యార్థుల కోసం ఓ ప్రత్యేక మాడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో 1947లో జరిగిన దేశ విభజనకు ఒక వ్యక్తి మాత్రమే కారణం కాదని.. ఇందులో ముగ్గురి పాత్ర ఉందని పేర్కొంది. విభజనకు పట్టుబట్టిన ముస్లిం లీగ్ అగ్రనేత మహమ్మద్ అలీజిన్నా, దానికి అంగీకరించిన కాంగ్రెస్, అమలు చేసిన లార్డ్ లూయిస్ మౌంట్ బాటన్ అని తెలిపింది. ఈ విభజన వల్లే భారత్‌కు కశ్మీర్ సమస్యగా మారిందని..నాటి నుంచి కశ్మీర్‌ను పాక్ మార్గంగా చేసుకొని దేశంపై పలు ఒత్తిడులను తీసుకురావడానికి ఉపయోగించుకుంటోందని ఆరోపించింది. 1947లో జరిగిన భారత్–పాకిస్థాన్ విభజన సమయంలో ప్రజల బాధ, బాధితుల వేదనలను గుర్తు చేసుకుంటూ ఏటా ఆగస్టు 14న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే విభజన గాయాల స్మారక దినం గురించి ప్రస్తావించారు.

**విమర్శించిన కాంగ్రెస్ :** అయితే చరిత్రలో జరిగిన అసలు విషయాలు తెలియజేయకుండా వక్రీకరించారని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. దేశంలోని లౌకికవాదాన్ని నిర్మూలించాలని చూస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ఈ దేశానికి చాలా ప్రమాదకరమని అన్నా రు. కాగా గతేడాది తొమ్మిది నుంచి 12వ తరగతులకు సంబంధించిన సిలబస్‌లో అనేక అంశాలను ఎన్‌సిఇఆర్‌టి తొలగించిన విషయం తెలిసిందే. ఈ చర్యలను అప్పట్లో కాంగ్రెస్ వ్యతిరేకించింది. వి ద్యార్థులకు అసలైన చరిత్ర గురించి చెప్పకుండా.. సిలబస్‌ను కాషాయీకరణ చేస్తున్నారంటూ ఆరోపించింది.

## ఓట్ చోరీ ఆరోపణలపై నేడు ఇసి మీడియా సమావేశం

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేసిన ‘ఓట్ల దొంగతనం’ ఆరోపణలు, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ప్రతిపక్ష పార్టీల నిరంతర నిరసనల మధ్య ఎన్నికల కమిషన్ (ఇసి) ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించనుంది. ఎన్నికల షెడ్యూల్‌లను ప్రకటించడం కాకుండా ఇతర అంశాలపై ఎన్నికల అధికారి అధికారికంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం అసాధారణ విషయం. విలేకరుల సమావేశం దేనిపై అనేది పేర్కొనబడలేదు కానీ అది ఎన్నికల అధికారిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించినదని అధికారులు తెలిపారు. సోమవారం ఎన్నికల సంఘం ఓటర్ల డేటాను తప్పుగా ఉపయోగించిందని, మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానాలో ‘ఓట్ల దొంగతనం‘ జరిగిందని రాహుల్ గాంధీ పదేపదే ఆరోపించారు. ఓటర్ల జాబితా నుండి తప్పుగా చేర్చబడ్డారని లేదా తొలగించబడ్డారని ఆయన ఆరోపించిన వారి పేర్లను, సంతకం చేసిన ప్రకటనతో పాటు సమర్పించాలని కమిషన్ కాంగ్రెస్ నాయకుడిని కోరింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు తన ఆరోపణలకు మద్దతు ఇవ్వడంలో విఫలమైతే క్షమాపణ చెప్పాలని కూడా పోల్ అథారిటీ కోరింది. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహించాలనే ఇసి చర్య ప్రతిపక్ష పార్టీల నుండి ప్రశ్నలను ఎదుర్కొంటోంది. ఈ చర్య పత్రాల కొరత కారణంగా కోట్లాది మంది అర్హులైన పౌరుల ఓటు హక్కును కోల్పోతుందని వారు చెబుతున్నారు. బిహార్‌లో ఎస్ఐఆర్‌లో పారదర్శకతను పెంచడానికి ఓటర్ల జాబితా నుండి తొలగించబడిన 65 లక్షల పేర్ల వివరాలను చేర్చకపోవడానికి గల కారణాలతో ప్రచురించాలని సుప్రీంకోర్టు ఇసిని కోరింది.

## జార్ఖండ్ విద్యాశాఖమంత్రి మృతి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జార్ఖండ్ విద్యా మంత్రి రాందాస్ సోరెన్ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని శనివారం రాంచీకి తరలించి ప్రజల సందర్శనార్థం అసెంబ్లీ ఆవరణలో ఉంచారు. జార్ఖండ్ గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్, స్పీకర్ రవీంద్ర నాథ్ మహతో, ప్రతిపక్ష నాయకుడు బాబులాల్ మరాండి, మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు శనివారం అసెంబ్లీ ఆవరణలో మంత్రికి నివాళులర్పించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రాధాకృష్ణ కిషోర్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కేశవ్ మహతో కమలేష్, రాజ్యసభ ఎంపి మహువా మాజీ తదితరులు అసెంబ్లీ ఆవరణలో సోరెన్‌కు నివాళులర్పించారు. మధ్యాహ్నం ఆయన నియోజకవర్గమైన ఘట్‌శిలకు తరలించారు. ఘట్‌శిలలోని మహు భండార్ మైదానంలో రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు, సామాన్య పౌరులు ఆయనకు నివాళులర్పించారు. కాగా, వారం క్రితం ఆసుపత్రిలో రామ్‌దాస్‌ను పరామర్శించానని, ఆయన బ్రెయిన్ డెడ్ అని సమాచారం అందిందని, అటువంటి పరిస్థితిలో, కోలుకునే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని, వైద్యులు తమ వంతు కృషి చేశారని సోరెన్‌కు నివాళులు అర్పించిన తర్వాత జార్ఖండ్ గవర్నర్ విలేకరులతో అన్నారు. గవర్నర్ కూడా మృతుల కుటుంబ సభ్యులను కలుసుకుని సంతాపం తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి తరుపున రాందాస్ సోరెన్‌కు రవాణా, రెవెన్యూ, భూ సంస్కరణల మంత్రి దీపక్ బిరువా నివాళులర్పించారు. సిఎం తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ ’శ్రద్ధ’ కోసం రామ్‌గఢ్ జిల్లాలోని నెమ్రా గ్రామంలో ఉండడంతో తాను నివాళి అర్పించినట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈనెల 2న తన నివాసంలోని బాత్రూంలో పడిపోయిన 62 ఏళ్ల జెఎంఎం నాయకుడిని జంషెడ్‌పూర్ నుండి దేశ రాజధానిలోని ఆసుపత్రికి విమానంలో తరలించారు. సోరెన్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయనకు ప్రాణాధార చికిత్స అందించారు. సీనియర్ నిపుణులతో కూడిన బహుళ విభాగ బృందం ఆయన పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తూ ఇంటెన్సివ్ వైద్య సంరక్షణలో ఉంచారు. కాగా, సోరెన్ మృతికి గుర్తుగా జార్ఖండ్ ప్రభుత్వం శనివారం రాష్ట్ర వ్యాప్తంగా సంతాప దినం ప్రకటించింది. జార్ఖండ్‌లోని అన్ని భవనాలపై జాతీయ జెండాను అవనతం చేశారు.

# ముంబైలో భారీ వర్షం..

### కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతి




**ముంబయి :** ముంబయిని భారీ వర్షం అతలాకుతలం చేసింది. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి ముంబయిలోని విఖ్రోలిలో వర్ష నగర్ ప్రాంతంలోని జన్కళ్యాన్ సొసైటీలో శనివారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడ్డాయి. భారీగా మట్టి, రాళ్లు ఓ గుడిసెపై పడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. తెల్లవారుజామున 2:39 గంటల సమయంలో ఈ ఘటన చోటు చే కుంది. సమాచారం అందుకున్న ముంబై అగ్నిమాపక దళం (ఎంఎఫ్‌బి), స్థానిక పోలీసులు, రెస్క్యూ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఇక భారీ వర్షానికి సియోన్, కుర్లా, చెంబూర్, అంధేరి సహా నగరం మొత్తం జలమయమైంది. సియోన్‌లో నిన్ని ప్రాంతాల్లో మోకాలి లోతులో నీరు నిలిచిపోయింది. వెస్ట్రన్ ఎక్స్‌ప్రెస్ హైవేపై వాహనాలు నిలిచిపోయాయి. భారీగా వర్షపు నీరు చేరడంతో అంధేరి సబ్‌వేని అధికారులు మూసివేశారు. విఖ్రోలిలో 21 గంటల్లో 248.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు ముంబై ఎయిర్‌పోర్ట్‌లో విమాన రాకపోకలపై తీవ్ర ప్రభా వం పడింది. పలు విమానాలు ఆలస్యం కాగా, మరి కొన్నింటిని దారి మళ్లిస్తున్నారు. మరోవైపు భారత వాతావణ శాఖ ముంబై నగరానికి అలర్ట్ జారీ చేసింది. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కు రుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ముంబయి, రాయ్‌గఢ్‌లకు రెడ్ అలర్ట్ ఇచ్చింది.



## తమిళనాడు మంత్రి స్థలాల్లో ఇడి సోదాలు

**చెన్నై :** తమిళనాడు మంత్రి, డిఎంకె నాయకుడు ఐ.పెరియసామి, ఆయన కుమారుడి ఎమ్మెల్యేకు సంబంధించిన పలు చోట్ల శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించిందని అధికారిక వర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఏ) కింద చెన్నై, దిండిగల్‌లలో దాడులు జరిగాయి. 72 ఏళ్ల గ్రామీణాభివృద్ధి, పంచాయతీలు, పంచాయతీ యూనియన్ల మంత్రి కుమారుడు ఐపి సెంటిల్‌కుమార్ ఇళ్లలో కూడా సోదాలు జరిగాయని వర్గాలు తెలిపాయి. దిండిగల్ జిల్లాలోని అథూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి పెరియసామి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇడి చర్యపై స్పందిస్తూ డిఎంకె సీనియర్ నాయకురాలు కనిమొళి మాట్లాడుతూ, ఆదాయపు పన్ను శాఖ, ఇడి వంటి కేంద్ర సంస్థలను ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా బిజెపి ఆయుధాలుగా ఉపయోగించుకుందని అన్నారు. ‘మంత్రి (పెరియసామి) చాలా సవాళ్లను అధిగమించి డిఎంకెకు అండగా నిలిచారు. ఎంత బెదిరింపులు వచ్చినా మా కార్యకర్తలు, నాయకులను బెదరరు’ అని ఆమె ట్యూటికోరిన్‌లో విలేకరులతో అన్నారు. ఏప్రిల్‌లో మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు మనీలాండరింగ్ దర్యాప్తు బృందం ఏర్పాటైంది. దిండిగల్‌లోని ప్రత్యేక కోర్టుకు రూ.2.1 కోట్ల ‘అసమాన‘ ఆస్తుల కేసుకు సంబంధించి పెరియసామి, అతని కుటుంబ సభ్యులపై అభియోగాలు రావడంతో దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పెరియసామి, అతని కుటుంబ సభ్యులను కేసు నుండి విడుదల చేస్తూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీకరప్షన్ (డివిఏసి) దాఖలు చేసిన కొన్ని క్రిమినల్ రివిజన్ పిటిషన్లకు ప్రతిస్పందనగా ఈ ఉత్తర్వు వచ్చింది. రోజువారీ విచారణను నిర్వహించి ఆరు నెలల్లోపు పూర్తి చేయాలని కూడా హైకోర్టు ప్రత్యేక కోర్టును ఆదేశించింది. 2006, 2010 మధ్య మంత్రిగా ఉన్నప్పుడు పెరియసామి తన పేరు మీద, అతని భార్య పి.సుశీల, కుమారులు సెంటిల్‌కుమార్, ప్రభు పేర్ల మీద రూ.2.1 కోట్ల వరకు సంపదను కూడబెట్టారని ప్రాసిక్యూషన్ కేసు వేసింది.


## దేశంలో రెండు రోజులు చైనా విదేశాంగమంత్రి పర్యటన



**న్యూఢిల్లీ:** చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ సోమవారం నుండి రెండు రోజులు మ నదేశంలో పర్యటిస్తారు. భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఏ) అజిత్ దోవల్, విదేశీ వ్యవహారాలమంత్రి జైశంకర్ శనివారం నాడు ఈ విషయం చెప్పారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ త్వరలో చైనాకు వెళుతున్నారు. మోదీ పర్యటనకు కొద్ది రోజులు ముందుగా చైనా విదేశాంగ మంత్రి రెండు రోజులు భారత్‌లో పర్యటిస్తారు. ఈ నెల 31 నుండి సెప్టెంబరు ఒకటో తేదీవరకూ రెండురోజులపాటు ఉత్తర చైనాలోని తియాన్‌జిన్ మున్సిపల్ నగరంలో జరిగే ఎస్‌సిఓ సదస్సులో మోదీ పాల్గొనేందుకు పర్యటన ఖరారైంది. ప్రస్తుతం ఎస్‌సిఓకు చైనా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోంది. ఈ పూర్వరంగంలో రెండు దేశాలమధ్య సరిహద్దు సమస్యపై ప్రత్యేక ప్రతినిధులమధ్య తదుపరి విడత సమావేశం నిమిత్తం ఏర్పాట్లు, ఇతర వివరాలను ఖరారు చేసేందుకు వాంగ్ యీ భారత్‌కు వస్తున్నారు. అజిత్ దోవల్ ఆహ్వానం మేరకు వాంగ్ యీ భారత్ పర్యటనకు వస్తున్నారు. వాంగ్ యీ చైనా కమ్యూనిస్టుపార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, విదేశాంగ మంత్రి. భారత్–చైనా మధ్య సరిహద్దు సమస్యపై ఇప్పటివరకూ 23 విడతలుగా ప్రత్యే క ప్రతినిధులమధ్య సమావేశాలు జరిగాయి. తదుపరి 24వ విడత సమావేశం జరుగుతుంది. గత ఏడాది డి సెంబరులో అజిత్ దోవల్ చైనాలో పర్యటించి వచ్చారు. సరిహద్దు సమస్యపై ప్రత్యేక ప్రతినిధుల చర్చల్లో పాల్గొన్నారు. రష్యా నగరం కజాన్‌లో మోదీ–జిన్‌పింగ్ మధ్య వివిధ సమస్యలపై చర్చలు జరిగాయి. అన్నిస్థాయిల్లోనూ రెండు దేశాలమధ్యా చ ర్చలను పునరుద్ధరించాలని నాయకులు ఇద్దరూ నిర్ణయించారు. మోదీ చైనా వెళ్ళడానికిముందుగా ఆగస్టు 29న జపాన్‌లో పర్యటిస్తారు. అక్కడి నుం డి చైనా నగరం తియాన్‌జిన్‌కు వెళతారు. రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి, సాధారణ సంబంధాలు కొనసాగించడానికి వీలుగా మోదీ పర్యటన దోహదపడుతుంది. 2020 మే నెలలో తూర్పు లఢఖ్‌లో సరిహద్దులవద్ద రెండు దేశాల సైనికులమధ్యా ఘర్షణ జరిగింది. తర్వాత గాల్వాన్ లోయలో జూన్ నెలలో ఘర్షణలు జరిగాయి. దీంతో రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నాయి. ఐతే గత ఏడాది అక్టోబరులో డెమ్చోక్, డెస్పాంగ్ ప్రాంతాలలో సైన్యాల వెనక్కి మళ్ళింపుపై ఒప్పందం కుదిరిన తర్వాత ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. వీటిని ఇప్పుడు పునరుద్ధరించుకునే చర్చలు జరుగుతున్నాయి.

## జిఎస్‌టి 2.0పై విస్తృత చర్చ కోసం...
# అధికారిక చర్చాపత్రాన్ని విడుదల చేయాలి

### కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ డిమాండ్



**న్యూఢిల్లీ :** వస్తువులు, సేవా పన్ను (జిఎస్‌టి) 2.0 పై విస్తృత చర్చ కోసం అధికారిక చర్చా పత్రాన్ని త్వరలోనే విడుదల చేయాలని శనివారం కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సంస్కరణ అక్షరాలా స్ఫూర్తితో ‘మంచి’ ‘సరళమైన పన్ను’గా ఉండాలని, కానీఅది ఇప్పుడు ‘వృద్ధిని అణచివేసే పన్ను’గా ఉండకూడదని కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి, ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేష్ హితవు చెప్పారు. దీపావళి పండుగ నాటికి జిఎస్‌టి రేట్లను తగ్గించడం ద్వారా నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించిన ఒక రోజు తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ డిమాండ్ చేసింది. వ్యాజ్యాలు, ఎగవేతలతో నిండిన ఎనిమిదేళ్ల పాలనను సంస్కరించాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం యత్నిస్తున్నదని జైరామ్ రమేష్ అన్నారు.దాదాపు ఒకటిన్నర సంవత్సరం కాలంగా కాంగ్రెస్ పార్టీ సమూలంగా మారిన జిఎస్‌టి 2.0 కోసం పిలుపునిస్తోందని జైరామ్ రమేష్ గుర్తుచేశారు. 2024లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పరివర్తనతో కూడిన జిఎస్‌టి 2.0పై ఒక ప్రతిజ్ఞ చేసిందన్నారు. ఈ పరివర్తన ప్రైవేట్ వినియోగం, ప్రైవేట్ పెట్టుబడులను పెంచకపోతే ఆర్థికవృద్ధి వేగవంతం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చివరకు మేల్కొన్నట్లు కనిపిస్తోందని జైరామ్ రమేష్ ఎద్దేవా చేశారు. జిఎస్‌టి రేట్ల నిర్మాణాన్ని సరళీకరించడం చాలా అవసరమని, రాష్ట్రాలకు ఆదాయ అసమానతను తగ్గించే విధంగా, గతంలో సాధారణమైన వర్గీకరణ వివాదాలను తొలగించే విధంగా సంస్కరణలు చేయాలని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ సూచించారు. ‘జిఎస్‌టి కాంపెన్సేషన్ సెస్ 2026’ మార్చి 31న ముగియనున్నది. రేటు నిర్మాణం హేతుబద్ధత నుంచి ఏదైనా ఆదాయ నిశ్చితిని భర్తీ చేయడానికి విస్తరించాలి’ అని జైరామ్ రమేష్ చెప్పారు. ఈ కీలకమైన, ముఖ్యమైన జాతీయ సమస్యపై విస్తృత చర్చ జరగడానికి వీలుగా జిఎస్‌టి 2.0పై అధికారిక చర్చా పత్రాన్ని త్వరలోనే విడుదల చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




## 'ధిరియో'కు ఆదరణ



గోవాలో అత్యంత ప్రసిద్ధి చెందిన 'ధిరియో' ఎద్దుల యుద్ధానికి ఆదరణ రోజురోజుకూ పెరుగుతున్నది. అందుకే దీనిని చట్టబద్ధం చేయాలన్న డిమాండ్ కూడా బలంగా వినిపిస్తున్నది. కోడి పందాల రూపంలోనే. ఎద్దులు లేదా దున్నపోతులు తలపడతాయి. సాంస్కృతిక ప్రాధాన్యం ఉన్న ఈ పోటీలను పర్యాటక కారణాలను దృష్టిలో ఉంచుకొని చట్టబద్ధం చేయాలని స్థానికులు చాలాకాలంగా కోరుతున్నారు. 'ధిరి' అని కూడా పిలిచే 'ధిరియో'పై నిషేధం ఉన్నప్పటికీ, గోవాలోని చాలా గ్రామాల్లో ఇది కొనసాగుతునే ఉంది. సాంస్కృతిక వారసత్వంగా గోవన్లు భావించే ఈ పోరు పోర్చుగీస్ కాలం నాటి సాంప్రదాయ క్రీడ. దీనిలో ప్రత్యేకంగా పోటీ కోసమే పెంచి, శిక్షణనిచ్చిన ఎద్దులను బరిలోకి దింపుతారు. ఇది స్పానిష్ ఎద్దుల పోరాటానికి భిన్నంగా ఉంటుంది. అక్కడ మనుషులు ఎద్దులను రెచ్చగొడతారు. వాటి శరీరంపై బల్లాల వంటి ఆయుధాన్ని దించుతారు. కానీ, ధిరియోలో కేవలం రెండు ఎద్దులు లేదా దున్నపోతులు మాత్రమే ఢీకొంటాయి. పురాతన కాలంలో చర్చి విందులు, వ్యవసాయ వేడుకలకు ఉద్దేశించిన క్రీడగా మొదలైంది. ఆరంభంలోనే ఇది ఒక ప్రసిద్ధ సామాజిక కార్యక్రమంగా మారింది. స్థానికులను విపరీతంగా ఆకర్షించింది. అందుకే, క్రమంగా ఇది గోవాలోని చాలా ప్రాంతాల్లో వేళ్లూనుకుంది. సాధారణంగా ఈ పోటీలు గ్రామ విందులు లేదా పంటకోత తర్వాత వేడుకల సమయంలో వరి పొలాలు లేదా ఫుట్‌బాల్ మైదానాలలో జరుగుతాయి. దీనిని 1997లో బాంబే హైకోర్టు జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం, 1960 కింద నిషేధించింది. హైకోర్టు నిర్ణయాన్ని 1997లో సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే, తమిళనాడులో ఎద్దులను మచ్చిక చేసుకునే క్రీడ 'జల్లికట్టు' మాదిరిగానే ధిరియోను కూడా అనుమతించాలన్నది స్థానికుల డిమాండ్ జల్లికట్టును 2014లో సుప్రీంకోర్టు నిషేధించింది. కానీ తరువాత తమిళనాడు సంస్కృతిలో భాగంగా పేర్కొంటూ, 2023లో నిషేధాన్ని తొలగించింది. ధిరియోకూ ఇదే సూత్రాన్ని వర్తింపచేయాలన్న వాదన బలంగా వినిపిస్తున్నది.

## రోబోట్‌లూ ఆడేస్తున్నాయ్!




ప్రపంచవ్యాప్తంగా రోబోట్‌లు ఎన్నో పనులు చేస్తున్నాయి. హ్యూమనాయిడ్ రోబోట్‌లు అచ్చం మనుషుల్లా మాట్లాడుతున్నాయి. అయితే, రోబోట్‌లు క్రీడల్లో పాల్గొనడం, వాటి కోసం ప్రత్యేకించి ప్రపంచ చాంపియన్‌షిప్‌ను నిర్వహించడం ఆశ్చర్యం కలిగించే విషయమే. చైనా రాజధాని బీజింగ్ వేదికగా ఈనెల 14వ తేదీ, గురువారం రోజున లాంఛనంగా ప్రారంభమైన హ్యూమనాయిడ్ రోబోటిక్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పోటీలు అధికారికంగా 15వ తేదీ, శుక్రవారం నుంచి మొదలయ్యాయి. ఆదివారంతో ముగుస్తాయి. 16 దేశాలకు చెందిన 280కిపైగా జట్లు బరిలోకి దిగాయి. 26 ఈవెంట్స్‌లో ఆధిపత్యం కోసం 500లకు పైగా హ్యూమనాయిడ్ రోబోట్‌లు పోటీపడుతున్నాయి.




ప్రారంభ వేడుకల్లో, క్రీడా జ్యోతిని వెలిగించే ప్రయత్నంలో ఒక రోబోట్ కిందపడింది. ఆ తర్వాత ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఒక రోబోట్ ట్రిప్ కావడంతో, చాలా రోబోట్‌లు పట్టుతప్పి పడిపోయాయి. వాటి తయారీదారులు, నిపుణులు వెంటనే మైదానంలోకి పరుగులు తీసి, లోపాలను సరిచేయాల్సి వచ్చింది. 1,500 మీటర్ల పరుగులో కింద పడిన ఒక రోబోట్‌పై అనర్హత వేటు పడింది. ఇలాంటి కొన్ని చిన్నచిన్న సంఘటనలను మినహాయిస్తే, ప్రపంచ రోబోటిక్ చాంపియన్‌షిప్స్ జోరుగా సాగుతున్నాయి. రోబోట్‌లు కూడా మైదానంలోకి దిగి ఆడేస్తున్నాయి.

## పర్సు దొరికింది!



పోయిన పర్సు ఒకటి దొరకడంలో ఆశ్చర్యం లేకపోవచ్చు. కానీ, 11 సంవత్సరాల తర్వాత కనిపించడం మాత్రం చిత్రమే. మిన్నెసొటా (అమెరికా)లోని మిషిగాన్‌లో ఫోర్డ్ కంపెనీ సర్వీస్ ప్లాంట్ ఉంది. అక్కడ పని చేస్తున్న రిచర్డ్ గిల్‌ఫోర్డ్ అనే మెకానిక్ 2015లో తన వాలెట్ పోగొట్టుకున్నాడు. ఎంత వెతికినా దొరకలేదు. సుమారు 2000 కార్లు ఉండగా, ఆ పర్సు ఎంతకీ దొరకకపోవడంతో నిరాశగా వెనుదిరిగాడు. రెండు రోజుల క్రితం, అదే ప్లాంట్ వద్దకు ఫోర్డ్ ఎడ్జ్ వాహనం మరమ్మతు కోసం వచ్చింది. కూలింగ్ ఫ్యాన్లు పనిచేయకపోవడంతో, వాటిని మార్చాల్సిందిగా ఆ వాహనం యజమాని కోరాడు. ప్లాంట్ మేనేజర్ చాడ్ ఓక్ ఆ ఫాన్లను విప్పినప్పుడు, అందులో పర్సు కనిపించింది. అందులో గిల్‌ఫోర్డ్ డ్రైవింగ్ లైసెన్స్, ఫోర్డ్ కంపెనీ జారీ చేసిన ఐడి కార్డు, 15 డాలర్ల నగదు, 250 డాలర్ల విలువ చేసే గిఫ్ట్ కార్డు ఉన్నాయి. ఇప్పటికీ పదవీ విరమణ పొందిన గిల్‌ఫోర్డ్‌కు వాటిలో 15 డాలర్లు తప్ప, మిగతావి పనికిరాక పోవచ్చు. కానీ, పదకొండు సంవత్సరాల తర్వాత వాలెట్ లభించడం అతనికి అంతులేని ఆనందాన్నివ్వడం ఖాయం.

## ట్రక్ డ్రైవర్ నిర్వాకం..



నెదర్లాండ్స్‌లోని మొయెర్డిక్ బ్రిడ్జి మీద నుంచి ఒక వ్యక్తి డియెప్ నదిలోకి దూకాడని, ఇది ఆత్మహత్యా ప్రయత్నం కావచ్చని సమాచారం అందుకున్న పోలీసులు క్షణాల్లో స్పందించారు. అగ్నిమాకప సిబ్బంది, అత్యవసర వైద్య బృందాన్ని, చివరికి రాయల్ నెదర్లాండ్స్ సీ రెస్క్యూ ఇన్‌స్టిట్యూట్‌ను కూడా అలెర్ట్ చేశారు. కొంతమంది రెస్క్యూ ఆపరేటర్లు మర పడవ వేసుకొని శరవేగంగా బ్రిడ్జి సమీపానికి చేరుకున్నారు. అక్కడ ఒక వ్యక్తి నీటి నుంచి ఒక నిచ్చెన సాయంతో, అటుగా వెళుతున్న ఓ పడవలో ఎక్కడాన్ని గమనించి ఊపిరి పీల్చుకున్నారు. ఆత్మహత్యాయత్నం నేరం కింద అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. కానీ, అతను చెప్పిన వివరణ విన్న అధికారులకు నవ్వాలో, ఏడవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. నీళ్లలోకి దూకినతను తనను తాను ఒక ట్రక్ డ్రైవర్‌గా పరిచయం చేసుకున్నాడు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో, బ్రిడ్జి పక్కనే లారీని పార్క్ చేసి, కొంతసేపు సేదతీరుదామని నదిలోకి దూకానని చెప్పుకొచ్చాడు. కానీ, నదిలోని నీరు కలుషితంగా ఉండడంతో, ఎక్కువ సేపు నీటిలో ఉండడం ఇష్టం లేక బయటకు వచ్చానని వివరించాడు.

— బిఎస్ఎస్ మైత్రేయి

## ఉక్రేన్ యుద్ధంపై ట్రంప్–పుతిన్ చర్చలు

# "ఒక అడుగు ముందుకు"

యావత్ ప్రపంచం ఉత్కంఠతో ఎదురుచూసిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లదీమిర్ పుతిన్ అలాస్కా చర్చలు ఏమి సాధించాయి? వెల్లడికాలేదు, కాని విఫలం కాలేదని స్పష్టమైన సంకేతాలున్నాయి. మూడేళ్లకు పైగా రష్యా–ఉక్రేన్ మధ్య జరుగుతున్న యుద్ధం ముగింపును సాధించటం వారి చర్చల లక్ష్యం. తాను అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే – పుతిన్‌తో తన వ్యక్తిగత స్నేహాన్ని ఉపయోగించి ఉక్రేన్–రష్యా యుద్ధాన్ని ముగింపజేస్తానన్న ట్రంప్ ప్రతిజ్ఞలు నెరవేరలేదు. ప్రయత్న లోపం లేదు. పుతిన్‌తో, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సంభాషించారు. మధ్యవర్తుల్ని పంపారు. అయితే సమస్య అత్యంత జటిలమైనదిగా ఉండటానికి రెండు కారణాలు ప్రధానం. ఒకటి, రష్యా సరిహద్దులో యూరప్ సైన్యాలు శాశ్వతంగా తిష్టవేసేందుకు వీలుగా ఉక్రేన్‌ను నాటోలో చేర్చుకోవటానికి యూరోపియన్ యూనియన్ పన్నాగం; ఇది రష్యా– యూరప్ రాజ్యాల మధ్య లోగడ కుదిరిన యూరప్ భద్రతా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నది. వాస్తవానికి ఉక్రేన్‌ను ముందుపెట్టి రష్యాపై యుద్ధం చేస్తున్నది యూరప్. ఆ పన్నాగాలను భగ్నం చేసేందుకై రష్యా ఉక్రేన్‌పై 2022 ఫిబ్రవరిలో సైనిక జోక్యానికి దిగింది. ఈ యుద్ధం సంగ్రామ క్షేత్రంలోని రెండు దేశాలకూ అపారనష్టం చేసింది. అమెరికా పూర్వాధ్యక్షుడు జో బైడన్ యూరప్ పక్షాన ఉక్రేన్‌కు ఆర్థిక, ఆయుధ సహాయం చేస్తూ యుద్ధాన్ని ప్రోత్సహించాడు. ఈ నేపథ్యంలో ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలోనే గాజా యుద్ధాన్ని, ఉక్రేన్ – రష్యా యుద్ధాన్ని పరిసమాప్తం చేస్తానని చెబుతూ వచ్చారు. అవి ఇప్పటివరకూ నెరవేరలేదు, అది వేరు విషయం. ట్రంప్ ముందుగా ఉక్రేన్‌లో కాల్పుల విరమణకు ప్రయత్నించారు. తాత్కాలిక విరమణకు ఉక్రేన్ అధ్యక్షుడు అంగీకరించగా, పుతిన్ తిరస్కరించాడు. తాను శాశ్వతంగా యుద్ధ విమరణను కోరుకుంటున్నానని, అయితే యుద్ధం ప్రారంభం కావటానికి మూలమైన మౌలిక సమస్యలు పరిష్కారం కావాలని స్పష్టం చేశాడు. ట్రంప్ జోక్యం ఫలించలేదు – ప్రతిష్టంభన కొనసాగుతోంది.

ప్రజాపక్షం

17-08-2025, ఆదివారం

ఈ నేపథ్యంలో అలాస్కాలో ట్రంప్–పుతిన్ చర్చల నిర్ణయం ఉక్రేన్ యుద్ధ పరిష్కారంపై ఆశలు రేకెత్తించాయి. ఉక్రేన్–రష్యా మధ్య భూభాగాల మార్పిడి సహా ఒప్పందం జరగబోతున్నట్లు ఊహాగానాలు బయలుదేరాయి. యూరప్ నేతలు బెంబేలెత్తిపోయారు. చర్చల్లో ఉక్రేన్‌ను భాగస్వామిని చేయాలని జెలెన్స్కీ కోరగా, యూరప్‌కు ప్రాతినిధ్యం లేకుండా యూరప్ సమస్యకు పరిష్కారం ఎలా అని ట్రంప్‌ను యూరప్ ప్రశ్నించింది. ముఖ్య నేతలు ట్రంప్‌తో కూడా సమావేశమైనారు.

అలాస్కా చర్చలు రెండున్నరగంటలపాటు ఎంతో సుహృద్భావ వాతావరణంలో జరిగాయి. ముందు నిర్ణయించినట్లు ట్రంప్–పుతిన్ ముఖాముఖి చర్చలకు బదులు త్రిముఖ చర్చలుగా సాగాయి. అమెరికా తరఫున విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో, ప్రత్యేక దూత స్టీవ్ విట్కోఫ్, రష్యా తరఫున విదేశాంగ మంత్రి సెర్గీ లెవరోవ్, సలహాదారు యూరి ఉషాకోవ్ కూడా పాల్గొన్నారు. 2018లో హెల్సింకిలో ట్రంప్–పుతిన్ మధ్య ముఖాముఖి చర్చలు జరిగాయి.

చర్చల అనంతరం వారు సంయుక్త పత్రికా గోష్టి నిర్వహించలేదు. ఉక్రేన్‌లో రష్యా యుద్ధం ముగింపు ఒప్పందం కుదరలేదు. అయితే తాము "ఒక అవగాహనకు" వచ్చినట్లు పుతిన్ చెప్పారు. చర్చలను వివరించటానికి తాను త్వరలో జెలెన్స్కీని, యూరప్ నాయకులను కలుసుకుంటానని ట్రంప్ చెప్పారు."ఒప్పందం కుదరనంతవరకు అది లేనట్లే. అనేక అంశాలపై అంగీకారానికి వచ్చాం. మరి కొన్నింటిపై పూర్తి అవగాహనకు రాలేదు" అని ట్రంప్ చెప్పారు. కాబట్టి త్వరలో మరోసారి ఆ నేతలిద్దరూ కలుసుకుని చర్చించే అవకాశముంది. ఆ సమావేశానికి లేదా ఆ తదుపరి మరో సమావేశానికి ఉక్రేన్ అధ్యక్షుణ్ణి, యూరప్ నేతలను కూడా ట్రంప్ ఆహ్వానించవచ్చు. ఏమైనా, రష్యా భద్రతకు యూరప్ యిచ్చే హామీపూర్వక ఒప్పందంపైనే ఉక్రేన్–రష్యా యుద్ధం ముగింపు ఆధారపడి ఉంటుంది. కొంత ఆలస్యమైనా, దౌత్యమార్గాల్లో చర్చల ద్వారా సంపూర్ణ అవగాహనకు రావటమే శాశ్వత పరిష్కారానికి మార్గం.

## నేటి ఈ యుద్ధకాలంలో

# మా'నవ'వాదం మనగలదా?



డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రపంచ దేశాలన్నీ యుద్ధ వాతావరణంలో మునిగి తేలుతున్న సమయంలో – మూడవ ప్రపంచ యుద్ధం తప్పదని కొందరు పరిశీలకులు చెపుతున్న తరుణంలో – మానవ సమాజానికి యుద్ధం అవసరమా? పరిణతి సాధించిన మానవుడు సహృదయంతో చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోలేడా? – అని అనిపిస్తుంది. ఒక్క యుద్ధం కొన్ని తరాల మీద ప్రభావం చూపుతుంది కదా? కాలుష్యం పెరిగిపోయి ప్రగతి కుంటుపడుతుంది కదా? కుట్రలు, కుతంత్రాలతో వివేచన లేని నాయకులంతా అధికారం చేజిక్కించుకోవడం వల్ల, అహంభావంతో నిర్ణయాలు తీసుకుంటున్నందు వల్ల కదా ప్రపంచం సమస్య లు ఎదుర్కోవాల్సి వస్తోంది? ఏది ఏమైనా, యుద్ధం ఎప్పుడూ వాంఛనీయం కాదు. అది మానవ సమాజాన్ని అతలాకుతలం చేస్తుంది. మానవీయ విలువలకు విలువిచ్చేవారు ఎవరూ యుద్ధాన్ని కోరుకోరు. ఉగ్రవాదాన్ని అసలే సమర్థించరు. అది ఏ మతానికి చెందిన ఉగ్రవాదమైనా! ఇప్పుడు ప్రపంచానికి కావల్సింది యుద్ధమా? బౌద్ధమా? – అన్న ఆలోచన రాగానే అశోకుడి కళింగ యుద్ధం గుర్తుకొస్తుంది. – పశ్చాత్తాపంతో ఛండా శోకుడు కరుణామయుడిగా మారడం, ఆయుధాలు వదిలేసి, బౌద్ధం స్వీకరించడం గుర్తుకొస్తుంది. అంతేకాదు, ఈ దేశాన్ని చుట్టుపక్కల దేశాలన్నింటినీ బౌద్ధ దేశాలుగా మార్చిన విషయం గుర్తుకొస్తుంది. తన సొంత కొడుకును, కూతురినీ అందుకు వినియోగించడం గుర్తుకొస్తుంది. ఆధునిక సాహిత్యంతో పరిచయం ఉన్నవారికి ప్రపంచ ప్రసిద్ధ రచయిత లియోటాల్‌స్టాయ్ నవల 'వార్ అండ్ పీస్' (WAR AND PEACE)గుర్తుకొస్తుంది.

మహాశాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఏమన్నాడంటే –"ఈ ప్రపంచం నాశనమైతే అది తుపాకుల వల్లనో, మిస్సైల్స్ వల్లనో, అణుబాంబుల వల్లనో కాదు – నైతిక విలువల పతనం వల్ల నాశనమౌతుంది" అని అన్నాడు. "శాంతిని నెలకొల్పే శక్తి ఒక్క బోధిసత్త్వుడికి మాత్రమే ఉంది. బుద్ధుడు–ఏసుకు గురువు. ఏసు కశ్మీర్‌లో పదమూడేళ్ళు ఉండి, బౌద్ధసారం గ్రహించి, బౌద్ధ జీవన విధానం నేర్చుకుని వెళ్ళాడు. ఏసు ద్వారానే బుద్ధుడి బోధనలు యూరప్ దేశాలకు చేరాయి. జాలి, కరుణ, దయ గురించి మొదటచెప్పింది బుద్ధుడే! ప్రకృతినీ, ప్రాణులన్నింటినీ ప్రేమించాలని చెప్పింది బుద్ధుడే! ఇప్పుడు యూరోపియను లు ఈ విషయం ఒప్పుకోరు. మళ్ళీ, అది వేరే విషయం! కానీ వాస్తవం ఇదే!"– అని ఐన్‌స్టీన్ రాసుకున్నాడు.

యుద్ధం అనగానే, ఇతర దేశాలలో జరుగుతున్న యుద్ధాలతో పాటు, మనదేశంలో ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ కూడా గుర్తుకు వస్తుంది కదా? ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలు ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు ప్రపంచానికి వెల్లడించారు(బ్రీఫింగ్). అది దేశ ప్రజలకు ఎంతో గర్వాన్నిచ్చే సన్నివేశం! ఇద్దరు మహిళలు రెండు వేర్వేరు యూనిఫాంలు. వారివి భిన్నమైన మత విశ్వాసాలు, భిన్నమైన నేపథ్యం గల కుటుంబాల నుండి వచ్చిన వారు. కానీ, దేశానికి సేవలందించడమే వారి లక్ష్యం! ఆ ఇద్దరు మహిళా ఆర్మీ అధికారుల్లో ఒకరు సోఫియా ఖురేషి అయితే, మరొకరు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్. భారతదేశానికి ఉన్న శక్తి అదే– వివిధ మతాల, వివిధ ప్రాంతాల సమైక్యతతోనే దేశం ముందుకొచ్చింది. దేశ మంతటా ప్రతిరంగంలో ప్రతిరోజూ మనం ఇలాంటి ఐక్యతను సాధిస్తూ వస్తున్నాం. 'హం ఏక్ హై'–అన్న నినాదమే మనల్ని బలంగా, స్థిరంగా ఉంచుతుంది.

సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్‌ల వలెనె సావిత్రి బాయి పూలే, ఫాతిమా షేక్‌లు కూడా ఒకరు హిందు, మరొకరు ముస్లిం. జ్యోతిబా పూలె నేతృత్వంలో దేశంలో బాలికలకు విద్య అత్యవసరమని వీరిద్దరు 1848లో పాఠశాలలు ప్రారంభించి నిర్వహించారు. దాని ఫలితం 177 ఏళ్ళ తర్వాత, తొలిసారిగా దేశంలో ఇప్పుడు మళ్ళీ కనిపించింది. మిలట్రీ ఆపరేషన్‌లో ఇద్దరు మహిళలు ముందుండి నాయకత్వం వహించడం దేశం గర్వించదగ్గ అంశం. ఆనాడు అవమానాలకు, అవహేళనలకు గురైన పూలె దంపతుల కృషి, ఫాతిమా షేక్ తోడ్పాటు వృథా పోలేదని అనిపించింది. "మా ప్రాధాన్యత మొదటి దేశానికి! తరువాతే మతమైనా, మరేదైనా"– అని అన్నాడు తాజుద్దీన్. ఈయన కల్నల్ సోఫియా ఖరేషి తండ్రి. తాజుద్దీనే కాదు, ఆయన తండ్రి కూడా భారత సైన్యంలో పనిచేసిన వారే. ఇప్పుడు తాజుద్దీన్ కూతురు కల్నల్ సోఫియా ఖురేషి 'ఆపరేషన్ సిందూర్'కు నాయకత్వం వహించింది. సోఫియా భర్త కల్నల్ తాజుద్దీన్ బాగేవాడి కూడా ఆర్మీ ఆఫీసరే. బరోడాకు (గుజరాత్) చెందిన సోఫియా, బెలగావి–బెల్గామ్ (కర్నాటక)కు చెందిన బాగేవాడిని 2015లో పెండ్లి చేసుకుంది. ఒక స్త్రీ ఎక్కడా మసీదులో మౌలానా కాలేదు. గుళ్ళో పూజారి కాలేదు. చర్చ్‌లో ఫాదర్ (పోప్) కాలేదు. కానీ, రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి, ప్రధాని వంటి ఏ పదవికైనా ఎదగొచ్చు. ఈరోజు ఆపరేషన్ సిందూర్‌కు నాయకత్వం వహించే అవకాశం రాజ్యాంగమే ఇచ్చింది. అందువల్ల డా.బి.ఆర్. అంబేద్కర్ ఈ దేశ ప్రజలకు ఎంత విలువైనది సమకూర్చాడో అర్థం చేసుకోవాలి!

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది ఎందుకంటే – రాజ్యాంగం ప్రకారం దేశరక్షణకు ఏర్పాటైన త్రివిధ దళాల భారత సేన యొక్క అంకిత భావం, నైపుణ్యం మాత్రమే కాదు. మతతత్వంతో దశాబ్దకాలంగా దేశంలో ఊగిపోతున్న 'జై శ్రీరామ్ సేన' ప్రమేయం ఇందులో ఏమీ లేదు. అందుకే జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఏమన్నాడూ... "మేం భారత సైన్యానికి వెన్నుదన్నుగా ఉంటాం. ఉగ్రవాదా న్ని రూపుమాపడంలో దేశవ్యాప్తంగా మా కేడర్ అంతా సైన్యం వెంటే ఉంది!" అని అన్నాడు . పాలకుల పేర్లు ఎవరివీ తీసుకోలేదు. మరోవైపు కొన్నికొన్ని దారుణాలు జరుగుతున్నాయి కదా? పహల్గామ్ ఉగ్రదాడిలో అమరుడైన నేవీ ఆఫీసర్ వినయ్ సతీమణిపై సోషల్ మీడియా లో ట్రోల్ రావడం చాలా దారుణమైన విషయంగా పరిగణించాలి. ఆ సోషల్ మీడియా ఎకౌంట్‌లలో అధికార బిజెపి పార్టీకి సంబంధించిన వ్యక్తులవే అధికంగా ఉన్నాయని తేలింది. అలాంటి ఎకౌంట్‌లు ఎందుకు బ్లాక్ చెయ్యలేదూ? అధికారంలో ఉన్న నాయకుల జాతీయ వాదం ఇదేనా? కల్నల్ సోఫియా ఖురేషీని 'ఉగ్రవాదుల సోదరి'గా అభివర్ణించాడొక పార్టీ నేత. పాకిస్థాన్‌కు దేశ రహస్యాలు అందించిన యూ ట్యూబర్ జ్యోతి మల్‌హోత్రా అధికార పార్టీకి సంబంధాలున్న వ్యక్తి . మరో అధికార పార్టీనేత తప్పంతా పహల్గామ్ దాడిలో భర్తల్ని కోల్పోయిన మహిళలదని అన్నాడు. భర్తల్ని కాల్చి చంపుతుంటే, ఈ ఉగ్రవాదులపై ఎందుకు 'తిరగబడలేదని' ప్రశ్నించాడు. టూరిస్టులకు భద్రత కల్పించలేని కేంద్ర ప్రభుత్వం, ఈ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి, పౌరులదే తప్పు అన్నట్లు మాట్లాడొచ్చా? మరో అధికార పార్టీనేత హైవే మీదనే ఒక మహిళతో లైంగిక కార్యక్రమం నిర్వహించాడు. నైతికత లేని, విద్యలేని, దార్శనికులుకాని వారంతా అధికారంలో ఉంటే దేశం ఎలా ఉంటుందో దేశ ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు.

నీతి, నిజాయితీ వదిలేసి మనువాదానికి భజనలు చేసేవారంతా ఎన్ని కుట్రలు చేసైనా అధికారం చేజిక్కించుకుంటున్నారు. అందుకే దేశం ఇంత ప్రమాదకరంగా తయారయ్యింది. రాజ్యాంగం స్థానంలో 'మనుస్మృతి'ని తేవాలని పన్నుతున్న కుట్రలు దేశ ప్రజలకు స్పష్టంగా తెలిసిపోతున్నాయి. ఈ దేశం శతాబ్దాలుగా మనువాదానికి బలైపో తూ, చివరకు ఇలా తయారయ్యింది. భారత దేశ చరిత్ర అంతా బౌద్ధానికీ, బ్రాహ్మణిజానికీ జరిగిన సంఘర్షణే అని అన్నారు అంబేద్కర్, నిజమే కదా? ఈ దేశం బయటి ఉగ్రవాదం కంటే అంతర్గత ఉగ్రవాదానికి ఎక్కువగా బలైపోతూ ఉంది. ఒకప్పుడు మహోన్నతమైన విలువలతో బౌద్ధ దేశంగా, విశ్వగురువుగా ప్రపంచానికి వెలుగులు పంచిన దేశాన్ని – మనువాదులు వారి ఆధిపత్యంకోసం నాశనం చేసుకుంటూ వచ్చారు. ప్రపంచంలోనే తొలి బౌద్ధ విశ్వవిద్యాలయాలు ఏర్పరిచి దేశదేశాల విద్యార్థులకు విద్యనందించిన దేశం ఇది. ఎవరు నాశనం చేశారు? చరిత్ర పుటల్లోకి పరిశీలనగా చూస్తే తెలుస్తుంది.

మనం చిన్నప్పుడు తరగతి గది గోడల మీద రాసిపెట్టిన వాక్యాలు చదువుతూ పెరిగాం. సత్యమునే పలుకుము / అబద్ద మాడరాదు/ జీవహింస చేయరాదు/ మంచి అన్నది పెంచుము /ప్రేమ, కరుణ, జాలి ముఖ్యము వంటివి చదివీ చదివీ అవి మన కంఠతా వచ్చేశాయి కానీ, వాటిని ప్రపంచానికి మొదటగా చెప్పిన మహనీయుడెవరు అన్న విషయం మన ఉపాధ్యాయులు మనకు చెప్పలేదు. తరువాత్తరువాత సత్యాన్ని, అహింసనీ ఆయుధాలుగా చేసుకుని ప్రపంచ వ్యాప్తంగా ఎందరో మహనుభావులు ఎన్నోఉద్యమాలు చేపట్టారని తెలుసుకున్నాం. కానీ వాటిని మొట్టమొదటగా చెప్పి, ప్రపంచం కళ్ళు తెరిపించిన పరిపూర్ణుడు బుద్ధుడు అన్న విషయం మనం చర్చించుకోలేదు. కారణం మనువాదుల కుట్రలు! బుద్ధుణ్ణి మరిపించి, వారు మనల్ని కల్పించిన దేవీ దేవతల ఆరాధన వైపు, మూఢ భక్తి వైపు మళ్ళించారు. వాస్తవాల్ని మరిపించి, భ్రమల్లో ముంచేశారు. సుమారు 2,500 ఏళ్ల క్రితం ప్రపంచంలో ఎక్కడా ఏ జ్ఞానం అందుబాటులో లేని రోజుల్లో 'కార్యకారణ సిద్ధాంతాన్ని' చెప్పి ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలకు దారివేసిన వాడు బుద్ధుడు. బుద్ధుణ్ణి, బుద్ధుడి బోధనల్ని అర్థం చేసుకున్న వారెవరైనా అసలు యుద్ధాన్ని సమర్థిస్తారా? మానవ వాదమన్న పదం ఆ ప్రాచీనయుగంలో లేదు గానీ, బుద్ధుడు బోధించింది, అశోకుడు ప్రచారం చేసింది మా'నవ' వాదమే కదా?

పశ్చిమ దేశాలకు బౌద్ధాన్ని పరిచయం చేసిన జర్మన్– అమెరికన్ రచయిత , PAUL CARUS. కారస్ (18 జులై 1852 – 11ఫిబ్రవరి 1919) THE GOSPAL OF BUDDA(1894) అనే గ్రంథం ప్రకటించాడు. అందులో బుద్ధుడు రాజగృహలో చెప్పిన మాటలు కొన్ని పొందుపరిచాడు. అవి ఇలా ఉన్నాయి.."ఒకరి నొకరు మోసగించుకోకండి. ఒకరినొకరు తక్కువ చేసుకోకండి,. మీ ఆధిక్యతను ప్రదర్శించకండి. అది, క్షణికం, కోపాల్ని, ద్వేషాల్ని, పగల్ని వదిలేయండి. తల్లి బిడ్డను వేయి కళ్ళతో ఎలా రక్షించుకుంటుందో, ప్రాణమివ్వడానికి ఎలా సిద్ధపడుతుందో– అలాంటి ప్రేమను మీరు మీతోటి వారికి పంచండి. ప్రేమకు హద్దులుండవని నిరూపించండి. జాలి, కరుణలతో కరిగిపోయే మృదువైన వ్యక్తిత్వాన్ని పెంచుకోండి! ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరినైనా అక్కున చేర్చుకోవడానికి సిద్ధంగా ఉండండి. అసూయా ద్వేషాలను పారద్రోలి– ఏ స్థితిలో ఉన్నా, అందరినీ ప్రేమిస్తూ, అన్యోన్యంగా ఉండడమే ఉత్తమ జీవిత మార్గం!"అన్నది బుద్ధుడు చెప్పిన జీవన సూత్రం!.ఇది జీర్ణించుకున్న వారెవరైనా యుద్ధాలకు పూనుకుంటారా?

**(కవిరాజు త్రిపురనేని రామస్వామి, జాతీయ పురస్కార తొలిగ్రహీత.)**

# విజన్ డాక్యుమెంట్‌లో అందరికీ చోటుండేనా?

పంద్రాగస్టున హైదరాబాద్‌లో రెండు సభలు జరిగాయి. ఒకటి భారతదేశ 79వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా గోల్కొండ ఖిలా వద్ద వేడుకలు, రెండవది రియల్ ఎస్టేట్, బిల్డర్‌లకు సంబంధించిన క్రెడాయ్ సంస్థ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవం. ఈ రెండిటికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డినే ముఖ్యఅతిథి. రెండు చోట్ల ఆయన చేసిన ప్రసంగాలలో కీలక అంశాలను ప్రస్తావించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించిన తెలంగాణ విజన్ డాక్యుమెంట్–2047 గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ప్రతిపక్ష బిఆర్ఎస్ తనపై చేసిన దాదాపు అన్ని ప్రధాన విమర్శలకు ఆ పార్టీ నేతల పేర్లు ఎత్తకుండానే ప్రతిస్పందించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తయ్యే 2047 నాటికి రాష్ట్ర ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలతో కూడిన విజన్ డాక్యుమెంట్ –2047ను వివరించేందుకు రెండు చోట్లా అధిక సమయమే తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుస్తామని ప్రకటించారు. ప్రస్తుతం దేశ జిడిపిలో 5 శాతంగా ఉన్న మన వాటాను పది శాతానికి పెంచే ఘన లక్ష్యాన్ని లక్ష్యాన్ని ముందుంచారు. వీటన్నిటి వివరాలతో డిసెంబర్ 9వ తేదీన 'తెలంగాణ విజన్ డాక్యుమెంట్–2047'ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాలు 2047 నాటికి తమ లక్ష్యాలతో విజన్ డాక్యుమెంట్‌లను ప్రకటించాయి. పొరుగున ఆంధ్రప్రదేశ్ సైతం స్వర్ణాంధ్ర 2047తో ఒక డాక్యుమెంట్‌ను విడుదల చేసింది.

ఇక తెలంగాణ విషయానికి వస్తే కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలంగాణను 2030 నాటికి 500 బిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని ప్రకటించింది. దానిని విస్తృత చేసి విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ జిఎస్‌డిపి విలువ 209 బిలియన్ డాలర్లు (16లక్షల కోట్లు). ప్రభుత్వ లక్ష్యం సుసాధ్యం కావాలంటే ప్రధానంగా పెట్టుబడులను ఆకర్షించడమే ఆధారం. అందుకే రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డులోపల ఐటి, సర్వీసు సెక్టార్ జోన్‌గా, అక్కడనుంచి రీజనల్‌రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)వరకు మ్యాన్యుఫాక్చరింగ్ జోన్‌గా,అవల వ్యవసాయ జోన్‌గా వర్గీకరించారు.

**మరి సామాన్యుల పరిస్థితి**

ఇంతటి భారీలక్ష్యాలతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం పెట్టుబడులకు, మరీ ముఖ్యంగా అంతర్జాతీయ,బహుళజాతి కంపెనీలు, పెట్టుబడులకు ఎర్రతివాచి పరిచేందుకు దేశమంటే మట్టి కాదోయ్! దేశమంటే మనుషులోయ్! అని మహాకవి గురుజాడ చెప్పింది, రాష్ట్రానికి కూడా వర్తిస్తుంది. 2047 నాటికి ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు పరిపూర్తి కావాలంటే అందుకు ప్రజల సహకారం కావాల్సిందే. ఈ అభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యాల్లో మరి సగటు తెలంగాణ వాసి పరిస్థితి ఏమిటనేది విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సంపద(జిఎస్‌డిపి) విపరీతంగానే పెరిగింది. కాగితాలలో తలసరి ఆదాయం పెరిగినట్లు కనపడుతున్నా అది వాస్తవంలో కానరాదు. ఎందుకంటే, పెద్ద ఎత్తున సృష్టించబడుతున్న సంపద కొద్దిమంది చేతుల్లోనే పోగవుతుండడం ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న పరిణామమే. దీనికి తెలంగాణేమి అతీతమేమీ కాదు. పెట్టుబడులు, సంపద సృష్టి పరుగుల్లో సామాన్యులు, ఉద్యోగులు, కార్మికుల భద్రత గాలిలో దీపంగా మారిందనేందుకు ఈ రెండు తాజా సంఘటనలు ఒక ఉదాహరణ.

**ఐటి ఉద్యోగాలకు గండం**

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఐటి అనుబంధ సేవలలో దేశంలోనే హైదరాబాద్ మొదటి ఐదు స్థానాలలో ఉంది. ఇక్కడ సుమారు 10 లక్షల మంది ఈ రంగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇటీవల తుఫానులా కమ్ముకొస్తున్న కృత్రిమ మేథస్సు

**రాజధాని సందడి**

**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ – ఎఐ) ఈ రంగంలో ఉద్యోగాలను భారీగా కుదిస్తుందని అంచనా. అందుకు అనుగుణంగానే ఇటీవల టిసిఎస్ నుంచి 12 వేల మంది ఉద్యోగుల తొలగింపు వార్తలు విన్నాం. భారతదేశంలో టిసిఎస్ రెండవ అతి పెద్ద క్యాంపస్ హైదరాబాద్‌దే. ఇక్కడ 90 వేలకు పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. కచ్చితంగా లేఆఫ్ అయిన వారిలో ఇక్కడ భారీగానే ఉంటారు. ఇప్పటి వరకు అధిక వేతనాలు పొందుతూ, కొత్త ఆదాయవర్గంగా విరాజిల్లుతూ, ఆర్థిక భద్రతతో జీవిస్తున్న వైట్ కాలర్ ఐటి ఉద్యోగులకు భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఎఐ, రోబోల వినియోగంతో ఉద్యోగాలు తొలగిస్తున్న కంపెనీలపై రోబో ట్యాక్స్ పేరుతో కొంత పన్ను విధించి రోడ్డున పడ్డ ఉద్యోగులకు ఊరటనివ్వాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. కంపెనీలు వచ్చినా ఉద్యోగాలు లేకుంటే ప్రయోజనమేమిటి?



**సిగాచి దుర్ఘటనతో తెరపైకి కార్మికుల భద్రత**

రాష్ట్రంలోనే పరిశ్రమలకు సంబంధించిన మరో ముఖ్యమైన అంశం ఇటీవల సంభవించిన సిగాచి ఇండస్ట్రీస్ ఘటన. హైదరాబాద్ నగర సమీపంలోనే పాశమైలారంలో జూన్ 30న జరిగిన ఈ కంపెనీలో భారీ పేలుడు జరిగింది. ఇందులో ఇప్పటి వరకు 45 మంది దుర్మరణం పాలవ్వడం భద్రతా ప్రమాణాలు పాటించడంలో నిర్లక్ష్యం కనపడుతోంది. ఆ ఘటనపై వేసిన విచారణ కమిటీ కంపెనీలో యంత్రాల నిర్వహణలో వైఫల్యాలను ఎత్తి చూపుతూ ఇచ్చిన నివేదికలోని అంశాలు వెలుగులోకి వచ్చాయి. 12 ఏళ్ళ పాత డ్రయ్యర్‌నే వాడడం, కనీస శిక్షణ లేని సిబ్బందిని తక్కువ వేతనాలకు వాడుకోవడం తదితర అంశాలు అందులో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దానిపై కార్మిక శాఖ పర్యవేక్షణ కూడా కొరవడింది. పెట్టుబడుల పేరుతో వచ్చే పరిశ్రమలు తక్కువ వేతనాలకే ఉద్యోగులను నియమించుకోవడం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, స్థానికేతరులకే ఎక్కువ ఉద్యోగాలు ఇవ్వడం వంటి అంశాలు ఈ ఘటనలో రుజువయ్యాయి. అన్నిటికి మించి దుర్ఘటనలో బాధ్యులను చేస్తూ ఇప్పటి వరకు ఎవ్వరినీ అరెస్టు చేయకపోవడం. ఈ విషయాన్ని స్వయంగా ప్రభుత్వ ప్లీడరే హైకోర్టు ముందు ధ్రువీకరించారు. ప్రకటించని కోటి రూపాయలు కూడా మృతుల కుటుంబాలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో చేరలేదని ట్రేడ్ యూనియన్‌లు ఆరోపిస్తున్నాయి. ఈ రెండు అంశాలను పరికించి చూస్తే అటు ఉన్నత ఆదాయ ఉద్యోగులకు, ఇటు కింది స్థాయి కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందనేది స్పష్టం. పైగా పెట్టుబడులను ఆకర్షించే పరుగులో కేంద్ర ప్రభుత్వం కంపెనీలకు అనుగుణంగా కార్మిక చట్టాల సరళీకరణ పేరుతో నిబంధనలను సడలిస్తున్నాయి. ఇటీవల పాత కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కార్మిక కోడ్‌లను కూడా తీసుకువచ్చాయి. ఇవన్నీ కూడా కంపెనీలకు అనుకూలమైనవి, పని చేసేవారి వేతన, ఉద్యోగ భద్రతలను పలుచబరిచేవే. తాజాగా ఎనిమిది గంటల పనిగంటల స్థానంలో పది పనిగంటల విధానాన్ని జిఒ 282 ద్వారానే తీసుకొచ్చారు. ఇది కార్మిక కోడ్‌లకు దొడ్డి మార్గమని ట్రేడ్‌యూనియన్‌ల ఉవాచ.

ప్రపంచం పరుగులు తీస్తుంటే, మనం కూపస్థ మండూకంలో కళ్ళుమూసుకొని కూర్చోలేము. అభివృద్ధికి పెట్టుబడులను ఆకర్షించడమనేది అనివార్యం. ఆ అభివృద్ధిలో సగటు జీవికి భాగస్వామ్యం లేకపోతే వృథా ప్రయాసే. పెరుగుతున్న అసమానతలకు కళ్ళెం వేయాలంటే, అటు పెట్టుబడులకు స్వాగతం పలుకుతూనే ప్రజల ఉద్యోగ, ఆర్థిక భద్రతకు, మెరుగైన జీవనశైలికి విశ్వాసం కల్పించే చర్యలు అవసరమని గుర్తించాలి. అప్పుడే అభివృద్ధికి అర్థం పరమార్థం. ఇది జరగాలంటే విజన్ డాక్యుమెంట్ ఖరారుకు ముందే అన్ని కోణాలపై సంబంధిత వర్గాలతో సంప్రదింపుల ద్వారానే దాని పరిపుష్ఠత సాధ్యం.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు శనివారం దేవరకొండ ఎంపిడివో డానియల్ భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో మైనంపల్లి మాజీ ఎంపిటిసి కొర్ర గౌతమి రాంసింగ్, సీత్య, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, ఉప సర్పంచ్ చిన్ననాయక్, పంచాయతీ కార్యదర్శి కీర్తి, కిషన్, కాంగ్రెస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్ లో గల శ్రీనగర్ కాలనీలో శనివారం మధ్యాహ్నం గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికీ గాయాలు, ఇంట్లో వస్తువులు దుర్గమైన సంఘటన చోటు చేసుకుంది. పూర్తి వివరాల ప్రకారం పొడిచేటి శివప్రసాద్ శ్రీనగర్ కాలనీలలో నివాసం ఉంటున్నారు. అయితే శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు గ్యాస్ సిలిండర్ లీకై ఒకేసారి మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న టీవీ,ఫ్రిజ్, బెడ్ మంచాలు తోపాటు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు నిత్యవసర వస్తువులు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు ఫైర్ ఇంజన్ పిలిపించి మంటలు ఆర్పించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.







## సాగర్‌లో పర్యాటకుల రద్దీ... భారీగా ట్రాఫిక్ జామ్

### రెండు లక్షలకు పెరిగిన ఇన్ ఫ్లో....ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద : 20 గేట్లు ఓపెన్..

ప్రజాపక్షం/నందికొండ: కృష్ణాష్టమి పండుగ పర్వదినాన సెలవు రోజు కావడంతో సాగర్‌లో పర్యాటకుల రద్దీ పెరిగింది ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరగడంతో శుక్రవారం రాత్రి వరకు 14 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల శనివారం 20 గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తూ ఉండటంతో పర్యాటకులు బారులు తీరారు నీటి విడుదల 20గేట్లకు పరిమితం చేసినా కూడా ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు పర్యాటకులతో అత్యంత రద్దీగా మారటం గమనార్హం. వాహనాల రద్దీ భారీగా పెరగడంతో స్థానికంగా ఉన్నలాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త , పాత వంతెనల వద్ద పర్యటకులతో క్రిక్కిరిసిపోవడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది అటు ఆంధ్ర ఇటు తెలంగాణ వైపు భారీగా ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్థానిక సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ ముత్తయ్య ఆధ్వర్యంలో పోసులు ట్రాఫిక్ ను ఎప్పటికప్పుడు పునరుద్ధరిస్తూ ఉన్నారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను శనివారం సాయంత్రానికి 587.50 అడుగులుగా ఉన్నది.

## చంద్రబాబు కుట్రలో భాగంగానే రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

### మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : నిన్న రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరు చంద్రబాబు ప్రసంగానికి కొనసాగింపుగా ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గోదావరిలో నీళ్లు లేవని చెప్పకుండా కాళేశ్వరం లేదనడం హేయమని, కాళేశ్వరం లేదని చెప్పడమంటే బనకరచర్లకు మద్ధతు ప్రకటించడమేనని విమర్శించారు. కాళేశ్వరం నుంచి 240 టీఎంసీలకు పైగా నీళ్లను వాడుతున్నామని చెప్పాలన్నారు. ఇది చెప్పకపోవడమంటే బనకరచర్లకు అనుమతిస్తున్నట్లుగా స్పష్టమవుతుందని చెప్పారు. ఇది ముమ్మాటికి తెలంగాణ ప్రజలకు మోసం చేయడానికేనన్నారు. వాస్తవంగా గోదావరిలో మిగులు నీళ్లు లేవు, పక్క రాష్ట్రంలో కట్టే ప్రాజెక్టులకు నిరాకరించాలని కానీ రేవంత్ రెడ్డి మాత్రం చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ని ఇక్కడ చదువుతున్నాడని ఆరోపించారు. ఇక్కడి మంత్రి ఉత్తమ్ దేవాదుల నుంచి నీళ్లు ఇస్తామంటూ కొత్త పాట అందుకున్నారని ఎద్దేవా చేశారు.

## నేడు గట్టుప్పల్‌లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఉచిత కంటివైద్య శిబిరం

ప్రజాపక్షం/చండూరు: మునుగోడు నియోజకవర్గంలోని గట్టుప్పల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్ శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మునుగోడు ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ సహకారంతో మునుగోడు నియోజకవర్గంలో ఇప్పటికే 6 విడుతలుగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 4355 మందికి కంటి పరీక్షలు చేసి అందులో 1051మందికి కంటి ఆపరేషన్‌లు సక్సెస్ ఫుల్‌గా పూర్తి చేశారు. నియోజకవర్గంలోని చండూరు మున్సిపాలిటీ, మునుగోడులో రెండు దఫాలుగా, నాంపల్లి, మర్రిగూడెం , చండూరు మండలం బంగారిగడ్డలో ఇప్పటికే 6 విడుతలుగా నిర్వహించారు. నేడు గట్టుప్పల మండల కేంద్రంలో నిర్వహించనున్న 7వ విడుత ఉచిత కంటి వైద్య శిబిరంను గట్టుప్పల మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## అంగన్‌వాడీలకు గౌరవ వేతనం రూ. 18వేలు ఇవ్వాలి



ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : అంగన్వాడీలకు 18 వేల రూపాయల గౌరవ వేతనం అందించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దేవి రెడ్డి లక్ష్మి, మంచుకొండ విజయ కోరారు.తెలంగాణ స్టేట్ ఇందిరా ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఐఎన్‌టియుసి అనుబంధం జిల్లా నూతన కమిటీని శనివారం పట్టణంలోనే ఐఎన్‌టియుసి 327 విద్యుత్, కార్మికుల యూనియన్ కార్యాలయంలో ఐ ఎన్ టి యు సి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి మొహినుద్దీన్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా దేవి రెడ్డి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మంచుకొండ విజయ, ఉపాధ్యక్షురాలుగా పోలిశెట్టి యాదమ్మ ,సహాయ కార్యదర్శిగా పెన్న మాధవి, కోశాధికారిగా కౌసర్ బేగం లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోహినుద్దీన్ నూతన కమిటీని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్ల వెల్ఫేర్ సమస్యల గురించి వాటి పరిష్కారం గురించి పని చేస్తామన్నారు. అదేవిధంగా వాలంటరీ రిటైర్మెంట్ సదుపాయం కల్పించాలని ,డ్యూటీలో ఉండి చనిపోతే రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తం ఇవ్వాలని ,ఎటువంటి పరీక్ష లేకుండా టీచర్స్ కి సూపర్వైజర్ పోస్ట్ ను సర్వీస్ ఆధారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఒక పూట సెలవులు ఇవ్వాలని ,హెల్త్ కార్డులు పిఎఫ్ సదుపాయం కల్పించాలని ఒకటి తారీకు జీతాలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల వెంకన్న ,ఉద్యోగ సంఘ నాయకులు ఎండి మహమూద్ జమాల్, తెలంగాణ స్టేట్ జాయింట్ సెక్రెటరీ జూలకంటి మల్లేశ్వరి పాల్గొన్నారు.

# కోదాడలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల గోల్‌మాల్ నిందితులు అరెస్టు

### నిందితుల్లో మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ పిఎలు

### వారి నుండి రూ.9.30 లక్షలు, 8 చెక్కులు స్వాధీనం

### వివరాలు మీడియాకు వెల్లడించిన జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మా





ప్రజాపక్షం/కోదాడ: రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల గోల్‌మాల్ వ్యవహారంలో నిందితులను కోదాడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వివరాలను సూర్యాపేట జిల్లా ఎస్‌పి కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్‌పి కె.నర్సింహా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చింతలపాలెం మండలం దొండపాడుకు చెందిన చెడపంగు నరేష్, మేళ్లచెరువు మండలం వేపలమాదారం గ్రామానికి చెందిన మర్ల వీర బాబు, మోతె మండలం సర్వారంకు చెందిన ఉప్పల మధు, మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన సురగాని రాంబాబు గౌడ్, వరంగల్ జిల్లా రంగసాయిపేటకు చెందిన గుంటుక సందీప్, మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామానికి చెందిన రంగిశెట్టి వెంకటరావు లు ఈ స్కాంలో నిందితులని వెల్లడించారు. వీరిలో కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ క్యాంపు కార్యాలయంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేసిన చెడపంగు నరేష్‌తో పాటు పిఎలుగా పనిచేసిన మర్ల వీరబాబు, ఉప్పల మధులు సిఎం రిలీఫ్ పండ్ చెక్కులను పర్యవేక్షించే వారిని పేర్కొన్నారు. 2023 నవంబర్ నెలలో జనరల్ ఎలక్షన్ కోడ్ వస్తుందని వారి వెంట తిరిగే సురగాని రాంబాబుతో కలిసి వివిధ పేర్లతో ఉన్న 44 సిఎంఆర్ చెక్కులను పక్కనపెట్టి ఆ చెక్కులను రివాల్యుడేషన్ చేయించుకుని అదే పేర్లతో ఉన్న వేరే వ్యక్తులను చూసి ఆరి అకౌంట్లలో డబ్బులు జమ చేయించి తీసుకోవాలని పథకం పన్నినట్లు చెప్పారు. శాసనమండలిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గుంటుక సందీప్ వ్యక్తి ద్వారా రివల్యూషన్ చేయించి అదే పేర్లతో ఉన్న వారిని చూసుకుని వారి అకౌంట్లలో చెక్కులు జమ చేయించి ఆ డబ్బులను అసలైన లబ్ధిదారులకు చెందకుండా నకిలీ అకౌంట్ల ద్వారా డబ్బులను డ్రా చేసుకుని అందరు కలిసి పంచుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో గుంటుక సందీప్ నుండి డ్రా చేయని ఆరు చెక్కులను నేరాణికి వాడిని ఐదు సెల్‌ఫోన్లను నకిలీ అకౌంట్ల ద్వారా ఖర్చులు పోనూ మిగిలిన రూ. 9.30 లక్షల నగదు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు మోసం చేసి బ్యాంక్ ల నుండి డ్రా చేసిన డబ్బులు రూ. 13.60 లక్షలు ఉంటుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేకు తెలియకుండానే ఈ నేరానికి పాల్పడినట్లు ఎస్‌పి వెల్లడించారు. ఈ కేసును త్వరితగతిన చేదించడానికి పర్యవేక్షణ చేసిన కోదాడ డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి, చాక్యచాక్యంగా ప్రదర్శించిన కోదాడ టౌన్ సిఐ శివశంకర్, ఎస్ఐ హనుమాన్‌నాయక్, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, హరికృష్ణ, హెడ్ కానిస్టేబుల్ కరుణాకర్, శ్రీనివాస్, సైదులు, ఆనంద్, మల్లేష్, సతీష్, శివకృష్ణ, ప్రభాకర్, హెడ్ కానిస్టేబుల్ బాల్త్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ యల్లారెడ్డి, సతీష్‌నాయుడు, రాంబాబు లను ఎస్‌పి అభినందించి రివార్డులను అందజేశారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజాపక్షం/ మానవపాడు : ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సుజాత కి , నాయిక గోకారి కి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చెక్కును అందజేసిన ఎమ్మెల్యే విజయుడు లక్కిరెడ్డి కర్ణపింహరెడ్డి జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల జల్లాపురం గ్రామానికి చెందిన బోరెడ్డి సుజాత, నాయిక గోకారి ఇటీవల కాలంలో తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ అప్పుడు చేపి చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ మాజీ నీటి సంఘం అధ్యక్షుడు లక్కిరెడ్డి కర్ణసింహ రెడ్డి స్పందించి ఎమ్మెల్యే విజయుడు తో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వీరికి రూ. 40,000 వేల చెక్కును బోరెడ్డి సుజాత , నాయిక గోకారి కుటుంబానికి లక్కిరెడ్డి కర్ణ సింహరెడ్డి ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా రోజు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ నీటి సంఘం అధ్యక్షుడు లక్కిరెడ్డి కర్ణసింహ రెడ్డి, ప్రాగటూరు సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, సామాజిక కార్యకర్త శాంతకుమార్, బోరెడ్డి, రామ్ ప్రసాద్ రెడ్డి, నాయిక గోకారి, చిన్న కృష్ణయ్య పాల్గొన్నారు.



# లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులు ప్రారంభించాలి

### రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట (పెన్‌పహాడ్) : ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని తెలంగాణ పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన పెన్‌పహాడ్ మండలం అన్నారం గ్రామం జెఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట శాసనసభ్యులు గంటకండ్ల జగదీష్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన విధంగా 400 నుంచి 600 చదరపు అడుగులలోపే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని చెప్పారు. ముగ్గులు పోసిన తర్వాత ఫోటో క్యాప్చర్ చేస్తామని, బేస్‌మెంట్ పూర్తికాగానే లక్ష రూపాయలు, స్లాబ్ లెవల్ గోడలు పూర్తి కాగానే లక్ష రూపాయలు, స్లాబ్ పూర్తికాగానే 2లక్షల రూపాయలు, ఇల్లు పూర్తి కాగానే లక్ష రూపాయలు ఇలా నాలుగు దశలలో 5 లక్షల రూపాయలను ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని తెలిపారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణం ప్రారంభించాలని కోరారు. రేషన్ కార్డులపై ఆయన మాట్లాడుతూ పేదవారి ఆత్మగౌరవానికి రేషన్ కార్డులు చిహ్నం అన్నారు. సూర్యాపేట జిల్లా నుండే సన్నబియ్యం, నూతన రేషన్ కార్డులు పంపిణీ ప్రారంభం కావడం సూర్యాపేట జిల్లా వాసుల అదృష్టమన్నారు. పేదవారు సైతం సన్నబియ్యంతో భోజనం చేయాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుందని తెలిపారు. సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికి నూతన రేషన్ కార్డులు ఇవ్వడం, సన్నబియ్యం ఇవ్వడం చాలా సంతోషమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారుడు ఇల్లు త్వరగా పూర్తి చేసుకొని గృహ ప్రవేశం చేసుకొని సంతోషంగా ఉండాలని కోరారు. మండలంలో 1477 నూతన రేషన్ కార్డులు, 613 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు, ఆర్‌డిఓ వేణుమాధవ్, సూర్యాపేట మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మండల ఇంచార్జి అధికారి అండ్ ఎస్టీ సంక్షేమ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ నాయక్, డిఎస్ఓ మోహన్ బాబు, పిడి హౌసింగ్ సిద్ధార్థ, డిఇ జబ్బార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సఖిలో బాధితులకు అండగా ఉండాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం /నల్లగొండ టౌన్: సఖిలో ఉన్న బాధితులకి ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి అందుతున్న సేవలలో జాప్యం జరిగినట్లయితే ప్రభుత్వం చిత్తశుద్ధితో పోలీస్,న్యాయ శాఖల సమన్వయంతో త్వరితగతిన న్యాయం జరగడం కోసం కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.సఖి కేంద్రాన్ని సందర్శించి సఖి సెంటర్లోని అందిస్తున్న సేవలు అందులోని విజేతలుగా ఉన్నటువంటి మహిళలని జిల్లాలో గుర్తించి వారికి గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్,సెంటర్ ఫర్ ఓల్డ్ సాలిదారిటీ వారి ఆర్థిక సౌజన్యంతో జిల్లాల్లో గుర్తించబడిన సఖి విజేతలకు 17 మందికి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. సఖి కేంద్రం నందు నెలకు సుమారుగా 60 నుంచి70 కేసులు రావడం జరుగుతుందని వారికి జిల్లాలో ఐదు రకాలైనటువంటి సేవలును ఒకే చోట అందించడంతోపాటు వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా సిబ్బంది కృషి చేయడం జరుగుతుందని అన్నారు.సఖి విజేతలు మానసిక స్థైర్యాన్ని పెంపొంది బలంగా దృఢంగా ఉండి వారు వారి కుటుంబ సభ్యుల సహకారంతో విజేతలుగా తయారవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని కెవి కృష్ణవేణి,గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ డైరెక్టర్ సుమలత,సఖి సిబ్బంది సునీత,వరుణశ్రీ,నాగమణి పాల్గొన్నారు.



## రియల్ ఎస్టేట్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ది రియల్ ఎస్టేట్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మిర్యాలగూడ నూతన అధక్షుడిగా ఆకుమర్తి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండలంలోని బాదలాపురంలోని వీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పాత కమిటీ రద్దయిన నేపథ్యంలో నూతన కమిటీలో ముందుగా అధ్యక్షుడిని మాత్రమే ఎన్నుకున్నారు. పూర్తి కమిటీని మరో నెల రోజుల తరువాత ఎన్నుకోనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సీనియర్ మీడియేటర్ చిలుముల లక్ష్మీ నరసింహా మాట్లాడుతూ కరోనా కాలంలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని, నాటి నుంచి నేటి వరకు కోలుకునే పరిస్థితి లేదన్నారు. ఇదే వృత్తిని నమ్ముకున్న మీడియేటర్లు భూములు అమ్మకాలు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధికి, ప్రభుత్వానికి అసోసియేషన్ సభ్యుల సమస్యలను వివరించి పరిష్కరించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లును పలువురు సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాసుల సత్యం, ఎండి.సాజిద్, హరి, అబ్దుల్, మోయిజ్, ఎండి.షరీఫ్, శంభయ్య, చారి, చేతక్ బాబా, అన్వర్‌పాషా, మన్సూర్‌అలీ, దైద పద్మారెడ్డి, మీసాల గోవింద్‌రెడ్డి, బాలునాయక్, పుట్టపాక శ్రీను, తలకొప్పుల సైదులు, కందుల శ్రీను, కూర సైదులు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

## బంగారు దుకాణం చోరీ కేసులో మరో ఇద్దరు నిందితుల అరెస్టు

### అరకిలో బంగారు ఆభరణాలు, రూ.92,500 నగదు రికవరీ : ఎస్‌పి



ప్రజాపక్షం/సూర్యాపేట : గత నెలలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి సంతోషి బంగారు దుకాణం చోరీ కేసులో మరో ఇద్దరు నింధితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం ఖమ్మం పట్టణానికి చెందిన ఏ7 యశోధ చెప్పిన వివరాల ఆధారంగా ఏడుగురు నింధుతులలో ఏ4మాలిక్ మోల్లను పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని దక్షిణ దినాజ్పూర్ జిల్లాలో పట్టుకొని ట్రాన్సిట్ వారెంట్ పద్ధతిన అదుపులోకి తీసుకున్నామని, ఏ6 అమర్‌భట్ ఖమ్మం పట్టణంలో నింధితుడిని పట్టుకున్నట్లు ఆయన వివరించారు. వారి ఇరువురి వద్ద నుండి 60 లక్షల విలువ గల అరకిలో బంగారు ఆభరణాలను, రూ.92,500 నగదును రికవరీ చేసినట్లు చెప్పారు. గతములో యశోధ వద్ద నుండి 14 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. మిగిలిన నింధితులను త్వరలో పట్టుకుంటామన్నారు. కొత్తవారు వచ్చినప్పుడు ఇండ్లలో ఆశ్రయం ఇవ్వడం, ఇండ్లు కిరాయికి ఇవ్వడం చేయవద్దని, వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలని, వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసుకోవాలని ప్రజలను కోరారు. జిల్లావ్యాప్తంగా ఫింగర్ ప్రింట్ స్కానర్లతో అనుమానితుల వేలుముద్రలు తనిఖీ చేస్తున్నామని ఎవరైనా పాత నేరస్తులు ఉంటే వారి యొక్క పూర్తి వివరాలు స్కానర్‌లో నమోదై ఉంటుందని ఎస్పీ వివరించారు. కేసులో ప్రతిభ కనబర్చిన సిబ్బందికి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో డిఎస్‌పి ప్రసన్న కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, సిసిఎస్ హరికృష్ణ, పెన్‌పహాడ్ ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఎస్‌సి బాలుర హాస్టల్






ప్రజాపక్షం/ ఉండవెల్లి : పేద విద్యార్థులు ఉండే సాంఘిక సంక్షేమ హాస్టర్ భవనం శిథిలా వ్యవస్థకు చేరింది. వర్షం వస్తే గోడలు తడిపిపోయి పై నుంచి వర్షం నీళ్ళు కూరుస్తూ నేల మొత్తం కడిగా మారుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పేద విద్యార్థులకు సౌకర్యాలు, వసతులు కల్పించడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైన విమర్శలు ఉన్నాయి. వివరాల్లోకెళితే అలంపూర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం శిథాలా వ్యవస్థకు చేరింది. పై పెచ్చులు పడి విద్యార్థులకు గాయాల అవుతున్నాయి. మొత్తం ఎనిమిది గదులు ఉన్న ఆరు గదులు పూర్తిగా పడిపోవడానికి సిద్ధంగా కనబడుతున్నాయి. వంటగది ఎప్పుడు ప్రమాదం సంభవస్తుంది అని భయం వలన మధ్యన గడిపే పరిస్థితులు ఏర్పడ్డాయి. మిగతా గదులు పై పెచ్చులు ఉడిపడి నేల మీద పడుతూ విద్యార్థులకు గాయాలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విద్యార్థులకు సెలవులు వస్తే చాలు హాస్టల్ లో ఉండేందుకు తీవ్ర సమస్యగా ఏర్పడుతుందని విద్యార్థులు తెలిపారు. హాస్టల్లో మొత్తం 105 మంది విద్యార్థులు ఉన్నట్లు ఐదు నుంచి 10 తరగతి విద్యార్థులాకు వసతులు కనిపించాల్సి ఉండగా భవనం పై కప్పు వర్షం వస్తే అంత అద్వానంగా మారుతుందని విద్యార్థులు వాపోతున్నారు. దోడ్లు మూత్రశాలలు స్థానపు గదులు లేక అరకురా గదులతో ఇబ్బందులు పడుతూ కాలం చెల్లిస్తున్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. స్థానాలు మూత్రవిసర్జన మరుగుదోడ్లకు ఆరు బయటనే చేయాల్సిన పరిస్థితి విద్యార్థులకు ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నత అధికారులు స్పందించి. విద్యార్థులకు హాస్టర్ భవనం నుంచి ప్రమాదం సంభవింక ముందే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## వైభవంగా శనేశ్వరస్వామికి పూజలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి:** శ్రీవిశ్వావసు సంవత్సరం శ్రావణమాసం శుక్లపక్షం శనివారం అష్టమినాడు మండల పరిధిలోని నందివడ్డెమాన్ గ్రామంలో గల శనేశ్వర స్వామికి భక్తులచే తిలతైల అభిషేక అర్చన, తదుపరి ప్రత్యేక పూజలు, అభిషేకాలు వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. శ్రీసార్వసప్తజేష్ఠ్య సమేత శనేశ్వరస్వామికి శనివారం శ్రావణ అష్టమి తిథినాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆలయప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ శ్రావణమాసంలో భక్తిపూర్వకంగా స్వామివారిని కొలవడం ఎంతో విశేష ఫలితమన్నారు. భక్తులు ప్రతిమాసంలో అష్టమి, నవమి, త్రయోదశి, చతుర్దశి, అమావాస్యతిథులు ఉన్నరోజు శనేశ్వరస్వామిని పూజించిన విశేష ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాలరావు, కమిటీ సభ్యులు రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, వీరశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## నీటిలో కొట్టుకుపోయిన భాను మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గత నాలుగు రోజుల క్రితం నీటి ఉధృతిలో చేపల వేటకు వెళ్లి తప్పిపోయిన భాను మృతదేహం శనివారం నాడు తెల్లవారుజామున ఫైర్ బృందాలకు దొరికింది. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ చేపల వేటకు వెళ్లి గల్లంతయిన భాను గత నాలుగు రోజులుగా పోలీసులు గజఈతగాళ్లు ఇతర సిబ్బందిని పిలిపించి వెతికించిన ఫలితాలు లేకపోయిందని శనివారం నాడు ఉదయం కొంత దూరంలో ముళ్ల పొదల్లో భాను మృతదేహం లభించిందని పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వారు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జడ్చర్ల పోలీసులు వివరించారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/పానగల్:** మండల పరిధిలోని బండపల్లి గ్రామానికి చెందిన కోమారి వెంకటపతి నాయుడుకి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డిలు లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కోమారి వెంకటపతి నాయుడు గత రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే నిరంజన్ రెడ్డి సహకారంతో ఒక లక్ష 25వేల రూపాయల చెక్కు మంజూరు అయినట్లు తెలిపారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, మాజీ రైతు బంధు మండల అధ్యక్షుడు వెంకటయ్య నాయుడు, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు జ్యోతి నందన్ రెడ్డి, అడ్వకేట్ రవి, రాజేష్ రెడ్డి, శేఖర్, సుధాకర్ యాదవ్, సుదర్శన్ నాయుడు, కృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/మక్తల్:** లయన్స్ క్లబ్ మక్తల్ భీమా ఆధ్వర్యంలో పట్టణంలోని ఎల్లమ్మ కుంట రోడ్‌లో ఉన్న జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో లయన్స్ క్లబ్ మక్తల్ అధ్యక్షుడు సత్యానారాయణ సహకారంతో విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి సమస్యలు ఉన్న వారికి మందులను అందజేశారు. కంటి ఆరోగ్యానికి సహకరించే కూరగాయలు, పండ్లు, ఆహారం తీసుకోవాలని సూచించారు. సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్న చందాన కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మక్తల్ అధ్యక్షుడు సత్యానారాయణ, కార్యదర్శి అంజన్ ప్రసాద్, కోశాధికారి ఆదం సత్యనారాయణ, జోన్ చైర్మన్ సూగూరు జైపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ వామెక్ష్ పృథ్వీరాజ్, సభ్యులు బి.అంబాదాస్ రావు, వాకిటి రమేష్, కంటి వైద్య నిపుణులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ :** మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో గోకులాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదటగా శనివారం ఉదయం శ్రీకృష్ణుని పూజా కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీకృష్ణుని శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల బొడ్డెమ్మలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చింతలయ్య, గౌరవ అధ్యక్షుడు నక్క భాస్కర్, ప్రధాన కార్యదర్శి పెండెం సతీష్ యాదవ్, సంఘం సభ్యులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

**వీపనగండ్లలో ....**

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గోకులాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణ, గోపికల వేషాదారణలో ఆకట్టుకున్నారు. గ్రామాల్లో ఉట్టి పోటీలు ఉత్సాహంగా సాగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీకృష్ణుని దర్శించుకున్నారు.

## శ్రీ లక్ష్మి నర్సింహస్వామికి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని సంగినేనిపల్లి శివారులో కొండగట్టుల మధ్య వెలిసిన శ్రీ లక్ష్మి నర్సింహ స్వామికి శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వయంభూగా వెలిసిన శ్రీ లక్ష్మి నర్సింహస్వామి భక్తుల కొంగుబంగారమై కోరిన కోరికలు తీర్చడం జరుగుతుంది. చివరి శనివారం కావడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధికల సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

## విశ్వజన సంక్షేమమే విశ్వహిందూ పరిషత్ లక్ష్యం



**ప్రజాపక్షం/మక్తల్:** స్థానిక మక్తల్ పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా సలహాసభ్యులు వి.భీమ్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వజన సంక్షేమమే విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని, హైందవ చైతన్యమే భారత సంక్షేమమే దిశగా విశ్వహిందూ పరిషత్ పనిచేస్తుందని అన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నారాయణపేట రోడ్డు తిలక్ మార్గ్ నందు అంబేద్కర్ చౌరస్తా యందు నేతాజీ మార్క్ చౌరస్తాలో ఓంకార కాషాయ ధ్వజాలను ఎగురవేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ప్రఖండ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, వాకిటి భీమన్న, మల్లికార్జున రావు, తిరుపతి, శ్రీను, బజరంగ్‌దళ్ నారాయణపేట జిల్లా సహ సంయోజక్ పసుపుల భీమేష్, ప్రఖండ సంయోజక్ రాహుల్, సాహ సంయోజక్ శివ, పరుశురాం, నర్సింహా రెడ్డి, కృష్ణ,మూర్తి, బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరుల ఉన్నారు.

# సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం



**ప్రజాపక్షం/వెల్దండ :** దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణరాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణకోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలపరిధిలోని పోతేపల్లి గ్రామానికిచెందిన అశ్వినికి గోలి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కును బిఆర్ఎస్ నాయకులు కొండల్ ఆధ్వర్యంలో రూ.25,500 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తగుళ్లకొండల్‌యాదవ్, శ్రీనివాస, చిన్నసైదయ్య, వావిళ్లకొండల్, మార్కండేయుడు, శోభన్‌చారి, తిరుపతయ్య, శేఖర్, కుమార్, భరత్ పాల్గొన్నారు.

**ఎల్‌ఓసి అందజేత :**

మండల పరిధిలోని దుబ్బతండాకు చెందిన జరుపులరాజునాయక్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబ్బతండా శ్రీనివాస్ సహకారంతో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిని ఆశ్రయించగా మంజూరైన ఎల్‌ఓసి చెక్కును శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో రాజుకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.2.5లక్షల ఎల్‌ఓసి పత్రాన్ని ఆ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ ఎల్‌ఓసి అని, ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# వసతులు లేవని విద్యార్థులను ఇతర కళాశాలకు పంపవద్దు



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్లకు చెందిన ఎస్సీ గురుకుల పాఠశాలను వసతులు లేని కారణంగా కొత్తకోటలో నిర్వహిస్తున్నారు. అయితే ఇంటర్ కు సంబంధించిన తరగతులను కొనసాగించకుండా వసతులు సరిగా లేవనే కారణంగా అడ్మిషన్లకు వచ్చిన విద్యార్థులను నేర్చుకొని ఇతర గురుకుల పాఠశాలకు పంపటం ఏమిటని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు ముంత మల్లయ్య యాదవ్ , ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజులు కళాశాల ప్రిన్సిపల్ ను ప్రశ్నించారు. శనివారం కొత్తకోటలో వీపనగండ్ల ఎస్సీ గురుకుల కళాశాల వసతులను పరిశీలించారు. ఇతర ప్రాంతాలకు విద్యార్థులను తరలించడం వల్ల విద్యార్థులు మానసిక వేదనకు గురై ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఇక్కడే వస్తువులు కల్పించి విద్యా బోధన చేయాలని ప్రిన్సిపల్‌ను కోరారు. గురుకుల కళాశాల ప్రైవేట్ భవనంలో కొనసాగుతుండటంతో భవనం యాజమానితో కూడా మాట్లాడటం జరిగిందని విద్యార్థులకు సరిపడా వస్తువులు కల్పించడానికి భవన యాజమాని కూడా ఒప్పుకోవడం జరిగిందని, విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వకుండా చదువులు కొనసాగించాలని ముంత మల్లయ్య యాదవ్ నాగరాజులు కోరారు. ఈ కార్యక్రమంలో భారాసా యువ నాయకులు ముంత శివయాదవ్ శేఖర్ , బాలకృష్ణ, చంటి , అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మీసాల శ్రీను, డప్పు నాగరాజు, పాము నాగులు, మీసాల గంగోలి , పాలు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ ఆశయాలను కొనసాగిద్దాం

బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** స్వాతంత్ర సమరయోధులు, బడుగు బలహీనవర్గాల ఆశజ్యోతి, కార్మిక నేత స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ వివిధ కుల సంఘ నాయకులు, పెద్దలు, విద్యార్థి సంఘ నాయకులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న ఆశయాలను కొనసాగిస్తూ ముందుకెళ్లాలని, భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అని పిలిపించుకునేంత గౌరవం దక్కించుకున్న వ్యక్తి గౌతు లచ్చన్న అని, అనేకమంది జాతీయ నాయకులతో కలిసి స్వాతంత్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొని చాలా నెలలుగా జైలు జీవితం గడిపిన గొప్ప కార్యదీక్షపరుడు సర్దార్ గౌతు లచ్చన్న అని వారు కొనియాడారు. చిన్న రాష్ట్రాలు కావాలని, మరి చెన్నారెడ్డి తో కలిసి ప్రత్యేక తెలంగాణ కొరకు చేతులు కలిసి తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని వివరిస్తూ ఒక పుస్తకం కూడా రాసిన వ్యక్తి అని, రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అని, అంటరానితనంపై పోరాడుతూ హరిజనసులకు దేవాలయాలలో ప్రవేశం కొరకు కృషి సలిపిన వ్యక్తి లచ్చన్న అని శ్రీనివాస్ సాగర్ తెలిపారు. స్వాతంత్ర ఉద్యమంలో పోరాట యోధునిగా ఎన్నో ఉద్యమాలు నడిపాడని, జమీందారీ వర్గాల వ్యతిరేక వీరునిగా ప్రజా హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మి కాంత్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, జాంగ్ర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మహేందర్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, రజక సంఘం నూతన అధ్యక్షుడు దుర్గేష్, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లేష్, బిసి విద్యార్థి సంఘం మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు దోమ వెంకటేష్, పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి సుకుమార్, గౌడ సంఘం నాయకులు వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ సతీష్‌కు పాండిచ్చేరిలో డాక్టరేట్



**ప్రజాపక్షం/వనపర్తి :** వనపర్తి మాజీ కౌన్సిలర్ , అఖిలపక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ డాక్టరేట్ బిరుదును అందుకున్నారు. శనివారం పాండిచ్చేరిలో గ్లోబల్ ఆక్రిడేషన్ కౌన్సిల్, పాండి యూనివర్శిటీ ఆధ్వర్యంలో, ఐక్యరాజ్య సమితి నేషనల్ పీస్ యూనివర్శిటీ ప్రతినిధుల సమక్షంలో జరిగిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఈ గౌరవాన్ని ప్రధానం చేశారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు అందజేయగా, తెలంగాణ రాష్ట్రం నుంచి సామాజిక సేవ ,ప్రజల శ్రేయస్సు విభాగంలో సతీష్ యాదవ్ ను ఎంపిక చేయడం విశేషం. 25 సంవత్సరాలుగా సమాజ సేవలో విశేష కృషి చేయడంతో పాటు, గత 18 ఏళ్లుగా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటంకొనసాగించినందుకు గుర్తింపుగా గౌరవం లభించింది. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నేను చేస్తున్న సేవా కార్యక్రమాలను గమనించి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం నాకు గర్వకారణం. కృష్ణాష్టమి రోజున ఈ ఘనత అందుకోవడం అదృష్టం. ఇది నాకు మరింత బాధ్యతను పెంచింది. నాకు దక్కని ఈ గౌరవానికి వనపర్తి పట్టణ, జిల్లా ప్రజానీకమే కారణం. రాబోయే రోజుల్లో వారికి మరింత సేవ చేయడానికి ఈ గుర్తింపు తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ వైస్ చాన్సలర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 26న జడ్చర్లలో పెన్షన్‌దారుల సమావేశం



**ప్రజాపక్షం/జడ్చర్ల:** ఆగస్టు 26న జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో ఉదయం 10 గంటలకు వికలాంగుల, వృద్దులు, వితంతువుల, చేయూత, పెన్షన్ దార్ల ఇతర పెన్షన్ దారుల సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ విహెచ్‌పిఎస్, యంఆర్‌పిఎస్, వ్యవస్థాపక అధ్యక్షులు హాజరవుతున్నారు. కావున, జడ్చర్ల మండల కేంద్రంలోని వికలాంగుల వృద్దులు, ఒంటరి మహిళలు వితంతువుల చేయూత, పెన్షన్ దార్లు అందరు ఆగస్టు 26న ఉదయం 10 గంటలకు జడ్చర్ల నియోజవకర్గం కేంద్రంలో జరిగే సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వికలాంగుల పెన్షన్ 6000 కు పెంచాలి, వృద్దులు, వితంతువుల, ఒంటరి మహిళలు, ఇంతర పెన్షన్లు, 4000 పెంచాలని డిమాండు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వికలాంగులకు, వృద్దులకు , వితంతువులకు , చేయూత పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వికలాంగులకు, వృద్దులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేయూత, పెన్షన్‌దారులకు ఇతర పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఈ కార్యక్రమంలో బైరపోగు శివకుమార్ మాదిగ, యంఎస్ఎఫ్, రాష్ట్ర కార్యదర్శి కమలాకర్ మాదిగ, జిల్లా అధ్యక్షులు పోలేపల్లి యాదయ్య మాదిగ యంఆర్‌పిఎస్, మండల అధ్యక్షులు చిన్న అంజయ్య, చేయూత పెన్షన్ దార్ల గ్రామ అధ్యక్షులు నాగయ్య, విహెచ్‌పిఎస్ నాయకులు వడ్ల యాదయ్య, కుర్ర చంద్రయ్య, వడ్ల వెంకటమ్మ, ఎడ్ల సెక్కమ్మ, భాగం చెన్నయ్య, ఎడ్ల శేఖర్, ఎడ్ల చెన్నమ్మ, ఎడ్ల రానమ్మ, ఏ.వీరన్న గౌడ్, బాలమణి, యాదమ్మ, చంద్రమ్మ, చిట్టమ్మ, నాగమని, ఫాతిమా, పార్వతమ్మ, శారదమ్మ, జానమ్మ, వసంత, వరమ్మ, వడ్ల పుష్పమ్మ, అనసూయ, ఇందిరమ్మ, రమాదేవి, వసంత, తదితరులు ఉన్నారు.

## సుందరకాండ పారాయణం




**ప్రజాపక్షం/బిజినేపల్లి :** పవిత్రమైన శ్రావణమాసం సందర్భంగా కనివిని ఎరుగని విధంగా నిర్వహించారు. బిజినేపల్లి గ్రామంలో సుందరకాండ పారాయణాన్ని అబ్దుల్‌కలాం అవార్డు గ్రహీత, గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత, 7805 కచేరిలు, విశ్వగురు వివేకానంద ఇండియన్ అవార్డు గ్రహీత, స్త్రీ కంఠ గాయకులు, డాక్టర్ దీక్షితులు సుబ్రహ్మణ్యం అద్భుతంగా శ్రీసిరిసంపదల భక్తాంజనేయస్వామి ఆలయ కమిటీచే జరిగింది.



## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఎస్సై వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, శనివారం రోజు నారాయణపేట ప్రధాన రోడ్డు ఏక్లాస్పూర్ చౌరస్తాలో నారాయణపేట పోలీసులు ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి సరియైన పత్రాలు లేని వాహనాలకు 49 కేసులకు గాను రూ.23,500 జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు సరైన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, వాహనాలకు సంబంధించిన ఆర్సి, లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని ఎస్ఐ తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి పోలీసు వారికి సహకరించాలని ఎస్సై తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఘనంగా ఆంజనేయస్వామి ఉత్సవాలు




**ప్రజాపక్షం/మద్దూర్ :** మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్‌లో శనివారం రోజు ఘనంగా ఆంజనేయ స్వామి ఉత్సవాలు నిర్వహించారు. పట్టణ పెద్దలు, యువకులు, మహిళలు భక్తులతో వివిధ కాలనీలలో ఆంజనేయ స్వామి జల్ది బిందేతో హనుమాన్ శోభయాత్ర, హనుమాన్ నామాస్మరణతో ర్యాలి నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేకంగా అభిషేక కార్యక్రమాలు కొనసాగాయి. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా రెట్టపట్ల పోటీలలో గెలుపొందిన వారికి వెండి కడియం బహుమతిగా ఇచ్చారు. ఇదే సందర్భంలో కృష్ణాష్టమి సందర్భంగా యువకులు ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులు భారీ ఎత్తున పాల్గొని ఉట్టి కార్యక్రమంలో పాల్గోన్నారు.

## కొత్తకోట చేనేత కార్మికునికి జాతీయ చేనేత అవార్డు



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాల్టీ వీవర్స్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు సారంగి రాములుకి కొండా లక్ష్మ ణ్ బాపూజీ జయంతి సందర్భంగా జాతీయ చేనేత అవార్డును రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర మంత్రి తమ్ముల నాగేశ్వర్ రావు చేతుల మీదుగా అందజేసింది. ఈ సందర్భంగా అవార్డు రావడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి అవార్డు రావడంలో విశేషంగా కృషి చేసిన ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డికి సారంగి రాములు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సారంగి రాములు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

## ఘనంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వివిధ గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. పాలెం వ్యవసాయ క్షేత్రపరిధి సమీపంలోగల శ్రీకృష్ణస్వామి గుడిభక్తులతో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం భక్తులతో కిటకిటలాడింది. వరుసగా సెలవులురావడంతో వివిధ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఎంతో ఉత్సాహంగా జరుపుకోవాలని కొన్ని పాఠశాలలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు పాఠశాల అనంతరం జరుపుకున్నారు. చిన్నారి విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా చిన్నారులు కృష్ణుడు, గొల్లభామ, రుక్మిణి, రాధవేషాలలో నృత్యాలు చేస్తూ పలువురిని ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టి సంబరాలను జరుపుకున్నారు. రాధాకృష్ణుల జీవిత చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. వెన్నకుండలతో బాలబాలికల హడావిడి ముచ్చట గొలిపింది. పిల్లనగ్రోవితో చిన్నారులు ఆటపాటలు అందరిని అలరించాయి.


## హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడదాం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట్ జిల్లా ఉట్కూర్ మండల పరిధిలో జరిగిన కార్యాక్రమంలో హిందువులు అందరూ, హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడదామని విహెచ్‌పి జిల్లా ఉపాధ్యక్షులు యంగలి రాములు కోరారు. శనివారం ఉట్కూరులోని మెయిన్‌బజార్‌లో విశ్వహిందూ పరిషత్ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా కాషాయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. గ్రామాల్లో వీహెచ్‌పి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భీమరాజు, ప్రఖండ అధ్యక్షులు వెంకట్ నారాయణ, ఆర్ఎస్ఎస్ నాయకులు నరసింగప్ప, నాయకులు అనిల్, భరత్, భాస్కర్, కొండన్ గోపాల్, రణవీర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

# మ్యాక్స్‌వెల్ విధ్వంసం..

### రికార్డు విక్టరీతో సిరీస్ పట్టేసిన ఆసీస్..!



పొట్టి ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా మరో సిరీస్ పట్టేసింది. సొంతగడ్డపై దక్షిణాఫ్రికాకు చెక్ పెడుతూ శనివారం రికార్డు విజయం సాధించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే మూడో టీ20లో గ్లెన్ మ్యాక్స్‌వెల్(62 నాటౌట్) బ్యాటింగ్ షోతో అదరగొట్టగా 2 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఛేదనలో కెప్టెన్ మిచెల్ మార్ష్(54) అర్ధ శతకంతో రాణించగా.. మిడిల్ ఓవర్లలో సఫారీ పేసర్లు వికెట్ల వేటతో ఒత్తిడి పెంచారు. అయితే.. మ్యాక్సీ తనదైన విధ్వంసంతో విరుచుకుపడగా మరో బంతి ఉండగా ఆసీస్ గెలుపొందింది.

తొలి రెండు మ్యాచుల్లో చెరొకటి గెలుపొందిన ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలు మూడో టీ20లో హోరాహోరీగా తలపడ్డాయి. ఎప్పుడు దంచికొడుతాడో.. ఎప్పుడు డకౌట్ అవుతాడో తెలియని గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఈసారి దక్షిణాఫ్రికా బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడి ఊచకోతకు సిరీస్‌పై ఆశలు పెట్టుకున్న సఫారీలకు నిరాశే మిగిలింది. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 172 కొట్టింది. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా గత మ్యాచ్ సెంచరీ హీరో డెవాల్డ్ బ్రెవిస్ (53) అర్ధ శతకం, డస్సెన్(38) మెరుపులతో జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించారు.

మోస్తరు ఛేదనలో ఓపెనర్లు మిచెల్ మార్ష్(54), ట్రావిస్ హెడ్(19) ఆసీస్‌కు శుభారంభం ఇచ్చారు. అయితే.. మర్క్‌మర్, కార్బిన్ బాస్చ్‌ల విజృంభణతో పటిష్ట స్థితిలో ఉన్న మార్ష్ సేన 122కే ఆరు వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన గ్లెన్ మ్యాక్స్‌వెల్ (62 నాటౌట్) బౌండరీల మోతతో సఫారీ బౌలర్లను హడలెత్తించాడు. 36 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, 2 సిక్సర్లతో విరుచుకుపడ్డ మ్యాక్సీ కడదాకా నిలిచి గెలుపు బాట పట్టించాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో బాది ఆసీస్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. తొలి, మూడో టీ20లో గెలుపొందిన మార్ష్ సేన 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది. ఒంటి చేత్తో జట్టును గెలిపించిన మ్యాక్సీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా.. టిమ్ డేవిడ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపిక య్యారు.

## పంత్ గాయంతో మేల్కొన్న బిసిసిఐ

### నిబంధనలు మారుస్తూ కీలక నిర్ణయం!



ఇంగ్లాండ్ పర్యటనలో గాయపడిన రిషభ్ పంత్ కుంటుతూనే క్రీజులోకి రావడం.. పాదం నొప్పిని భరిస్తూనే బ్యాటింగ్ చేయడం చూశాం. 'రీప్లేస్‌మెంట్ ప్లేయర్'ను తీసుకొని ఉంటే పంత్‌కు ఇబ్బంది తప్పేదిగా అని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పంత్ గాయపడిన తర్వాతి పరిణామాలతో భారత క్రికెట్ నియంత్రణ మండలి మేల్కొంది. గాయంతో బాధపడుతున్న క్రికెటర్‌కు విశ్రాంతి ఇవ్వడమే ఉత్తమమని భావించింది.

మ్యాచ్ సమయంలో తీవ్రంగా గాయపడిన ఆటగాడి స్థానంలో మరొకరిని ఆడించేలా నిబంధనలు మార్చింది. దేశవాళీ సీజన్ 2025–26 నుంచే ఈ కొత్త రూల్ అమలులోకి వస్తుందని బిసిసిఐ తెలిపింది. 'టెస్టులు వంటి మల్టీ డే మ్యాచ్ సమయంలో ఒక ఆటగాడు తీవ్రంగా గాయపడితే అతడి స్థానంలో మరొకరిని ఆడించాలి. ఆ రోజు ఆట పరిస్థితులను బట్టి రీప్లేస్‌మెంట్‌ను అనుమతించాలి. అయితే.. ప్లేయర్‌కు మ్యాచ్ సమయంలో లేదంటే మైదానంలో అయినా గాయపడాలి. అలాంటప్పుడే వాళ్లకు ప్రత్యామ్నాయంగా మరొకరిని ఆడించడానికి అంగీకరించాలి. త్వరలో ప్రారంభం కాబోయే దేశవాళీ క్రికెట్ సీజన్ నుంచే ఈ కొత్త రూల్‌ను పాటించాలి' అని బిసిసిఐ వెల్లడించింది.


## మిస్టర్ 360 వచ్చేస్తున్నాడు..

### ఆసియా కప్‌లో బరిలోకి దిగనున్న టీ20 కెప్టెన్!



టీమిండియా త్వరలో ఆసియా కప్‌లో ఆడనున్నది. టీ20 ఫార్మాట్‌లో జరగనున్నది. త్వరలోనే జట్టును ఎంపిక చేసేందుకు బిసిసిఐ సెలక్షన్ కమిటీ సమావేశం కానున్నది. ఈ క్రమంలో టీమిండియాకు శుభవార్త అందింది. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ మండలి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ అయ్యాడు. సూర్యకుమార్ చివరిసారిగా ఐపిఎల్‌లో కనిపించాడు. జూన్‌లో జర్మనీలోని మ్యూనిచ్‌లో స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ చేయించుకున్నాడు. ఈ టోర్నమెంట్ కోసం జట్టును ఎంపిక చేసే కొన్ని రోజుల్లో ఆసియా కప్ కోసం సెలక్షన్ కమిటీ సమావేశమవున్నది. ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో భారతదేశం సెప్టెంబర్ 10న యూఏఈతో మ్యాచ్‌తో టోర్నీని ఆడనున్నది. భారత్ సెప్టెంబర్ 14న దుబాయిలో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. సూర్యకుమార్ ఐపిఎల్‌లో అద్భుతంగా రాణించాడు. ఈ టోర్నీలో మొత్తం 717 పరుగులు చేశాడు. సచిన్ టెండూల్కర్ తర్వాత ముంబయి ఇండియన్స్ తరఫు ఓ ఐపిఎల్‌లో ఒక సీజన్‌లో 600 కంటే ఎక్కువ పరుగులు చేసిన రెండో బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ఐపిఎల్‌లో 2025లో ఆరెంజ్ క్యాప్ విజేత గుజరాత్ టైటాన్స్‌కు చెందిన సాయి సుదర్శన్ (759) తర్వాత సూర్యకుమార్ అత్యధికంగా పరుగులు చేశాడు. ముంబయి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఎలిమినేటర్‌లో గుజరాత్‌ను ఓడించారు. కానీ క్వాలిఫయర్2లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత సూర్య టీ20 ముంబయి లీగ్‌లో పాల్గొన్నాడు. ఐదు ఇన్నింగ్స్‌లలో 122 పరుగులు చేశాడు. ఆ సమయంలోనే హెర్నియా నొప్పితో బాధపడ్డట్లు సమాచారం. ఇందుకు సంబంధించి స్పష్టమైన సమాచారం లేదు. సూర్యకుమార్ 2023లో చీలమండ శస్త్రచికిత్స, స్పోర్ట్స్ హెర్నియా ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. శస్త్రచికిత్స తర్వాత మళ్లీ ఆడేందుకు ఫిట్‌నెస్ పరీక్ష తప్పనిసరి. సూర్యకుమార్ ఫిట్‌నెస్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు బిసిసిఐ వర్గాలు తెలిపాయి.

## ఫోకస్ బిజినెస్




# మరికొంత కాలం ఇదే అనిశ్చితి?



ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లలో ప్రస్తుతం ఉన్న అనిశ్చితి మరికొంతకాలం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అలాస్కాలో సమావేశం కానున్నారన్న వార్త వెలువడినప్పటి నుంచి, నిర్ణయాలు ఏ విధంగా ఉంటాయనే ఉత్కంఠ కొనసాగింది. ఫలితంగా స్టాక్ మార్కెట్లలో స్వల్పకాలిక అంశాలకే ప్రాధాన్యం పెరిగింది. కానీ, ఎంతో ఆసక్తి రేపిన చర్చలు ఎలాంటి ఫలితం లేకుండానే ముగియడంలో, అనిశ్చితిలో ఎలాంటి మార్పు లేదు. మరోసారి భేటీ కావాలని ఇరువురు నాయకులు నిర్ణయించినా, ట్రంప్‌ను రష్యా రావాల్సిందిగా పుతిన్ ఆహ్వానించినా, మార్కెట్లకు తక్షణం ఒరిగే ప్రయోజనం అంటూ ఏమీ ఉండదు. కాబట్టి, వచ్చే వారం కూడా స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులు తప్పకపోవచ్చు. కాగా, సోమవారం ట్రంప్‌తో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సమావేశం కానున్నారు. యుద్ధ విరమణకు పుతిన్ విధిస్తున్న షరతులను వివరించడంతోపాటు, వాటిని అంగీకరించేలా జెలెన్స్కీపై ట్రంప్ ఒత్తిడి తీసుకురాగలిగితే, పరిస్థితి కొంత వరకూ మారవచ్చు. రష్యా–ఉక్రేన్ యుద్ధానికి తెరపడితే, ముందుగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో మార్పు వస్తుంది. రవాణా వ్యవస్థ మొత్తం పెట్రోలు లేదా డీజిల్ లేదా గ్యాస్‌పై ఆధారపడి ఉంది. వీటి ధర పెరిగితే, వస్తువుల రవాణా ఖర్చులు పెరుగుతాయి. తత్ఫలితంగా ధరలు కూడా పెరుగుతాయి. జెలెన్స్కీపై ట్రంప్ ఎంత వరకూ ఒత్తిడి తీసుకొస్తారు? రష్యా ప్రతిపాదనలపై ఎలా ఒప్పిస్తారు? అనే ప్రశ్నలకు, ప్రస్తుతానికి సమాధానం లేదు. ఇలా వుంటే, ట్రంప్ తీసుకుంటున్న పలు నిర్ణయాలు అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నదని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రపంచ మార్కెట్లు సైతం అమెరికా ఆర్థిక వ్యవస్థపై, ప్రత్యేకించి అక్కడి ఫెడ్ రేట్లపై ఆధారపడతాయి. మొత్తం మీద ఏ రకంగా చూసినా, అమెరికా ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న స్తబ్దత, షేర్ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ఈ ప్రభావం సానుకూలమా లేక ప్రతికూలమా అనేది కూడా ప్రశ్నార్థకమే. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్, జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ సూచీలపై కనిపిస్తుంది. ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే, వచ్చే వారం సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లేందుకు స్పష్టమైన సంకేతాలు ఏవీ లేదు. అలాగే, ప్రతికూల పరిస్థితులు ఉంటాయని చెప్పడానికి కూడా వీల్లేని పరిస్థితి. ఏదిఏమైనా మరికొంత కాలం ఈ అనిశ్చితి కొనసాగుతుందనే వాదన బలంగా వినిపిస్తుంది. కానీ, ఇన్వెస్టర్ల సెంటిమెంట్ ఏ విధంగా పని చేస్తుందో ముందుగా ఊహించడం కష్టం.

## బులియన్ మార్కెట్

# స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు




అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం, మారుతున్న మదుపరుల అభిమతాల నేపథ్యంలో, బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షు డు వ్లాదిమీర్ పుతిన్ మధ్య చర్చలు ఎలాంటి ఫలితం లేకుండా నే ముగిసినప్పటికీ, చెప్పుకోగ్గ ప్రతికూల పరిస్థితులు కూడా లేని కారణంగా, బులియన్ మార్కెట్ రాబోయే కొన్ని రోజులు స్థిరంగా ఉండవచ్చని, ధరలు తగ్గినా ఆశ్చర్యం లేదని మార్కెట్ నిపుణులు అంటున్నారు. కాగా, శనివారం 100 గ్రాముల బంగారం ధర రూ.100 తగ్గింది. ఈ నెల తొలివారం 10 గ్రా ముల బంగారం ధర దాదాపు రూ.6,000లకు పైగా పెరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం గ్రాము బంగారం రూ.10,123 వద్ద ట్రేడ్ అవుతున్నది. 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 9,279గా, 18 క్యారట్ల బంగారం ధర రూ.7,592గా ఉంది. హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,230 వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,790 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.75,920గా ఉంది. విజయవాడలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,230 వద్ద ట్రేడ్ అవుతోండగా, 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,790, 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.75,920 పలుకుతున్నది.

**(గమనిక: ఈ ధరల వివరాలు కేవలం పాఠకుల అవగాహనకు మాత్రమే. బంగారం కొనమనిగానీ, వద్దనికానీ చెప్పడానికి కాదు).**

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## సిపిఐని ప్రజలతో మరింత మమేకం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు



**ప్రజాపక్షం/తొర్రూరు :** అనేక త్యాగాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర నాల్గొవ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ తొర్రూరు పట్టణ కేంద్రంలో వాల్ పోస్టర్‌ను ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమ బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ మేడ్చల్ జిల్లాలోని గాజుల రామారంలో సిపిఐ రాష్ట్ర నాల్గొవ మహాసభలు ఈనెల 20 నుంచి 22 వరకు కొనసాగుతాయని చెప్పారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ తప్ప మరెవరూ న్యాయం చేయలేదన్నారు. వందేళ్ల ప్రస్థానంలో ముందుకు సాగుతున్న సిపిఐని ప్రజలతో మరింత మమేకం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతున్నాయని చెప్పారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న పార్టీగా శతజయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజలు, కార్మికులు, రైతాంగ సమస్యలపైన అనేక పోరాటాలను కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాష



**ప్రజాపక్షం/మణుగూరు :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య కుటుంబాన్ని శనివారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య మరణం పార్టీకి, కుటుంబానికి తీరని లోటని, ఈ ప్రాంత పేద ప్రజలు అండను కోల్పోయారని అన్నారు ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకన్న, మువ్వా వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, అనంతనేని సురేష్ జక్కుల రాంబాబు, సుధాకర్,కుటుంబరావు, రాయల బిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు,రమేష్, బాడిస సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యం, లౌకికవాదం, హక్కుల పరిరక్షణకు

# ఐక్యంగా ఉద్యమిద్దాం



### సిపిఐ బెంగాల్ రాష్ట్ర మహాసభల్లో డి.రాజా పిలుపు

**కోల్‌కతా:** ఐక్య ఉద్యమాలతోనే ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, ప్రజల హక్కులను కాపాడుకోగలమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇందుకు కలిసి రావాలని బెంగాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని కోల్‌కతాలోని సాల్ట్ లేక్ ఇందుకు ముస్తాబైంది. అరుణశోభను సంతరించుకుంది. మహాసభల ప్రారంభానికి ముందు నిర్వహించిన ర్యాలీలో ఆ ప్రాంతం ఎరుపెక్కింది. సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళాకారులు ఆటపాటలతో సందడి చేశారు. మహాసభలలో పండుగ వాతావరణం కనిపించింది. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మోదీ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎదిరించేందుకు మరింత బలంగా ముందుకెళ్లాలని, 100 ఏళ్ల పోరాటాల స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సిపిఐ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ కార్యదర్శులు పల్లబ్ సేన్ గుప్తా, రామకృష్ణ పాండా, రాష్ట్ర కార్యదర్శి స్వపన్ బెనర్జీ తదితరులు స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు.

### ప్రధాని మోదీది మేక్ ఇండియా కాదు

# 'లూట్ ఇండియా' విధానం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వివిఎస్.బోస్ విమర్శ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత ప్రధాని నరేంద్రమోదీది మేక్ ఇండియా విధానం కాదని, లూట్ ఇండియా విధానమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్ విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమ ప్రభుత్వం "దేశ స్వయం సమృద్ధి, స్వావలంభనకు కృషి చేస్తున్నదని ప్రధాని ప్రకటించడం హాస్యస్పదమని అన్నారు. ఇంతకాలం దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించిన నరేంద్ర మోదీ నెహ్రూ విధానాలనే అమలు చేస్తున్నామని చెప్పటం విడ్డూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆర్థికస్వావలంభనకు మూలాలైన బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలను ప్రైవేటీకరించడమే కాకుండా వాటి పని విధానంలో ఆటంకాలు సృష్టిస్తూ , ఆర్థిక రంగంలో విదేశీ సంస్థలను అనుమతించటం లాంటి కార్యక్రమాలు దేశ ఆర్థిక స్వావలంభన ఏలా అవుతుందని బోస్ ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయటం, అమ్మివేయటం, అదే స్థానంలో విదేశీ సంస్థలను ఆహ్వానించటం స్వయం సమృద్ధికి వ్యతిరేమని పేర్కొన్నారు. స్వయం సమృద్ధి కోసం దివంగత ప్రధానమంత్రి నెహ్రూ డిఫెన్స్‌తో సహా అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయగా అదే బాటలో నడిచిన ఇందిరాగాంధీ ఆర్థిక సంస్థలైన బ్యాంకులు, ఇన్సూరెన్స్, బొగ్గు, ఆయిల్ లాంటి అనేక సంస్థలను జాతీయం చేశారని గుర్తు చేశారు. . నెహ్రూ, ఇందిరాగాంధీలను వ్యతిరేకిస్తూ వారి సిద్ధాంతాలను వల్లెవేస్తున్న మోడీ నిజంగా తన పాలనలో స్వయం సమృద్ధి, ఆర్థిక స్వావలంభనకు కృషి చేస్తున్నాడా అంటే అదీ లేదని బోస్ అభిప్రాయపడ్డారు. భారత్ పెట్టుబడులతో ఇక్కడే ఉత్పత్తి చేస్తే అది "మేక్ ఇండియా" అవుతుంది కానీ, విదేశీ సంస్థలు మన దేశంలో పరిశ్రమలు పెట్టి దేశ కార్మికుల శ్రమను దోచుకొని విదేశీ అవసరాల కోసం ఉత్పత్తులు తయారు చేసి వాటి కోసం ప్రభుత్వాల నుండి రాయితీ పొందే విధానం, లాభాలను తమ దేశాలకు తరలించుకుపోయే విధానం "మేక్ ఇండియా" అనిపించుకోదని, అలాంటి విధానం "లూట్ ఇండియా" అవుతుందని బోస్ అన్నారు. మోడీ తన తప్పును తెలుసుకొని ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, అభివృద్ధి చేయాలని కొత్త ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించాలని డిమాండ్ చేశారు.

### ఆర్‌టిసి కార్గో హమాలీ కార్మికుల

# రేట్లు పెంచాలి

### ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్ డిమాండ్



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** ఆర్‌టిసి కార్గో హమాలీ కార్మికుల రెట్లు పెంచాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్ డిమాండు చేశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి కార్గో హమాలీ కార్మికుల సమస్యలపై ఎఐటియుసి నేతృత్వంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి ట్రాన్స్‌పోర్టు రంగాన్ని ఆర్‌టిసి యాజమాన్యం నిర్వహించేదని ప్రస్తుతం కార్గో నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు టెండర్ల ద్వారా నిర్వాహణ ఇవ్వడం చేత ట్రాన్స్‌పోర్టు రంగం కార్గోలో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికులు సిబ్బందికి శ్రమకు తగిన రేట్లు చెల్లించడం లేదని దీని ఫలితంగా శ్రమ దోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కార్గోలో పనిచేస్తున్న హమాలి కార్మికులకు గతంలో ఆర్‌టిసి యాజమాన్యం ఐదు కిలోల బరువు లోపు ఏడు రూపాయల యాభై పైసలు 5 కిలోల పైబడిన వాటికి పది రూపాయలు, 50 కేజీల పైబడిన వస్తువులకు 15 రూపాయలు చెల్లించేదని కానీ ఆర్‌టిసి యాజమాన్యం ఏడు రూపాయల 50 పైసలకు తగ్గించిదని అన్నారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం చేత మరి దారుణంగా కార్మికుల పొట్టలు కొట్టే విధంగా హమాలి రేట్లు భారీగా తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్గో హమాలి కార్మికులు ఇప్పటికే అనేకసార్లు ప్రభుత్వాన్ని ఆర్‌టిసి యాజమాన్యాన్ని 15 రూపాయలకు పెంచాలని విజ్ఞప్తులు చేస్తు వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్ బస్టాండు కార్గో ప్రైవేటు కాంట్రాక్టర్ రాష్ట్రవ్యాప్తంగా అందిస్తున్న మాదిరిగా కార్మికులకు హమాలి రేట్లు అందించాలని లేకపోతే ఆందోళన తప్పదని అన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి కార్గో హమాలీ కార్మికులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హమాలి రేట్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు ఎస్.దేవానంద్, కార్గో హమాలీ కార్మికులు కె.రాములు, ఎం.రవికుమార్, సతీష్, నరేష్, సుధీర్, కృష్ణ, పాప, అంజి, గిరి, రఘు తదితరులు ఉన్నారు.

## సర్కార్ దవాఖానలో సమస్యలు పరిష్కరించాలి

### సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. శనివారం పట్టణంలోని లక్ష్మణాచారి భవనం లో జరిగిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశాలు ఈర్ల చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఎడతెరిపిలేని వర్షాల వల్ల కాలనీలు, గ్రామాలు, పట్టణాలు అన్ని కలుషితమై ఈగ లు, దోమలు ఎక్కువై ప్రజలురోగాలబారినపడి ప్రభుత్వ ఆస్పత్రికివస్తే అక్కడ రోగులకు సరిపడా పడకలుకాని, మందులు అందుబాటులో లేవన్నారు. చిన్నచిన్న రక్తపరీక్షలు కూడా చేయకుండా ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపడం వలన ప్రజలు చాలా ఇబ్బందిపడుతున్నారు. జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటై నాలుగు సంవత్సరాలు అవుతన్న జిల్లాప్రజలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. తక్షణమే జిల్లాయంత్రాంగం చర్యలు తీసుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులులేకుండా పిహెచ్‌సి కేంద్రాల్లోకూడా ఒక ఎంబిబిఎస్ డాక్టర్‌ను ఏర్పాటుచేయాలన్నారు. అదేవిధంగా అకాలవర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎకరాకు లక్షరూపాయల నష్టపరిహారం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రాష్ట్రసమితిసభ్యులు హెచ్.ఆనంద్‌జి, కేశవులుగౌడ్, జిల్లాకార్యవర్గసభ్యులు పెబ్బేటివిజయుడు, కోళ్లయేస య్య, జిల్లాసమితి సభ్యులు కృష్ణాజి, శంకర్‌గౌడ్, మర్యాదవెంకటయ్య, బొల్లెద్దులశ్రీను, రవీందర్, బండిలక్ష్మి ప తి, తుమ్మలశివుడు, శివశంకర్, బాలమురళి, వెంకటమ్మ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## జాగృతి రాష్ట్ర ముస్లిం మైనార్టీ అధ్యక్షుడిగా ఎండి ముస్తాఫా



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** తెలంగాణ జాగృతి రాష్ట్ర ముస్లిం మైనార్టీ అధ్యక్షుడిగా ఎండి ముస్తాఫా ఎన్నిక య్యారు. శనివారం షాద్‌నగర్ మాజీ శాసన సభ్యులు వై.అంజయ్య యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల మన్ననలు పొందుతూ క్రమశిక్షణతో పని చేస్తే భవిష్యత్‌లో ఉన్న త స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని అన్నారు. పార్టీ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడంలో కార్యకర్త లు ప్రణాళిక బద్ధంగా పని చేయాలని సూచించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో జాగృతికి బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మాజీ కన్వీనర్ బాలాజీ ఉద య్, జాగృతి సీనియర్ నాయకులు సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేస్తేనే బంగారు భవిష్యత్

కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లురవి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, కాంగ్రెస్ క్రమ శిక్షణ కమిటి చైర్మర్ డాక్టర్ మల్లురవి అన్నారు. శనివారం షాద్‌నగర్ బైపాస్ రహదారి సమీపంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మల్లురవి మాట్లాడుతూ బూత్ స్థాయి నుండి కాంగ్రెస్ కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేస్తే మున్ముందు భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రధానంగా క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, అందుకు ప్రతి ఒక్కరు కట్టుపడి పని చేయాలని సూచించారు. పార్టీ నిబంధనలు అతిక్రమించిన నేతలకు నోటీసులు ఇవ్వడమే కాకుండా వారి నుండి అభిప్రాయాలను సైతం తీసుకున్నామని గుర్తు చేశారు. షాద్‌నగర్‌లో బాల్‌రాజ్ గౌడ్, బాబర్‌ఖాన్‌లతోపాటు మరికొంతమంది నేతలు నిత్యం తమతో టచ్‌లో ఉంటారని పేర్కొన్నారు. రాజకీయంగా మంచి పేరు, పట్టుదల సాధిస్తే పార్టీ నాయకుల అశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయని అన్నారు. క్రమశిక్షణతో పనులు చేస్తే పదువులు వాటంతటికి అవే వస్తాయని, కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రఘు నాయక్, మహ్మద్ ఇబ్రహీం, రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, అలీంలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి దాతలు సహకరించండి



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి దాతలు సహకరించేందుకు కృషి చేయాలని లబ్ధిదారురాలు కోరుతున్నారు. శనివారం కొందు ర్గు మండల కేంద్రంలోని దళితవాడకు చెందిన పోమాల భారతమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈ లబ్ధిదారురాలుకు గతంలో పెంకుటిల్లు ఉండే ది.. కానీ ఇందిరమ్మ ఇల్లు మంజూరైనన తరువాతే ఉన్న ఇల్లును కూల్చివేశా రు. నూతనంగా ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించుకునేందుకు సిద్ధం కాగా బిస్మెం ట్ నిర్మించేందుకు డబ్బులు లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నా రు. రెక్కాడితే కానీ డొక్కాడని పేద జీవితాల్లో వెలుగులు నింపేందుకు దాత లు ముందుకు వచ్చేందుకు కృషి చేయాలని లబ్ధిదారురాలు కోరుతున్నారు. ఉన్న ఇల్లును కూల్చివేయడం ద్వారా తమ జీవితాలు రోడ్డుపాలు అయ్యాయని లబ్ధిదారులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిస్మెంట్ నిర్మించుకునేందుకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని వేడుకుంటున్నారు. అంతేకుండా ప్రభుత్వ అధికారులు సైతం గుర్తించి అదుకునేందుకు కృషి చేయాలని లబ్ధి దారులు కోరుతున్నారు.

## శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్‌జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాయలంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవాలయ అభివృద్ధికి మాజీ జడ్పిటిసి సభ్యుడు సాయికృష్ణ రూ.100111లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బక్కని నర్సింలు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందు కు చర్యలు తీసుకుంటున్నామని, అందుకు భక్తులు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ముందుకు వచ్చి ఆర్థిక స హాయం చేస్తున్న దాతలను ప్రత్యేకంగా అభినంధించారు. గతంలో భక్తులు లేక వెలవెలబోయిన ఈ దేవాలయంలో నేడు భక్తులతో కళకళలాడుతుందం టే మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు వెంకటేశ్వర్‌రెడ్డి, కిశోర్, సాయిశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## కొమ్మోనాబావి రోడ్డు బిటిగా మార్చాలి

సిపిఐ(ఎం)జిల్లా కమిటీ సభ్యులు పి.అంజయ్య..



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి అనుభంధ గ్రామమైన కొమ్మోనిబావి ( బర్ల శివయ్యనగర్ ) రోడ్డు బురదమయంగా మారింది. దానిని బిటి రోడ్డుగా మార్చాలని సిపిఐయం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పి. అంజయ్య డిమాండ్ చేశారు. శనివారం గ్రామానికి వేళ్ళే రోడ్డును పరిశీలించారు. ఈసంధర్భంగా అంజయ్య మాట్లాడుతూ నందివనపర్తి గ్రామానికి మూడు కిలో మిటర్ల దూరంలో ఉంది. రోడ్డు మొత్తం వర్షం రావడంతో బురద మయంగా మారింది. టు విలర్, త్రివిలర్ ఫోర్ విలర్ వాహన దారులు ఈ రోడ్డుపై నుండి వేళ్ళాలంటేనే భయపడుతున్నారు. గతంలో నందివనపర్తి నుండి మేడిపల్లి వరకు రోడ్డు వేస్తామని మధ్యలో అపారు. బ్రిడ్జిలు నిర్మాంచారు వదిలేశారు.రైతులు పండించిన కూరగాయలు, పాలు హైద్రాబాద్‌కు తీసుకు పోవాంటేనే భయపడుతున్నారు.ఎంఎల్ఏ తక్షణమే స్పందించి రోడ్డుకు నిధులు మంజూరి చేసి బిటి రోడ్డుగా మార్చాలని కోరారు. లేని పక్షంలో సిపిఐయం పార్టీ అధ్యర్యంలో అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు ఎం. జంగయ్య,శ్రీరాములు,సత్యనారి,కిష్టయ్య,జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో

# కాంగ్రెస్‌దే విజయం

రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారంజూబ్లీహిల్స్ వెంగళరావు నగర్ డివిజన్ మధుర నగర్ బూత్ లెవెల్ కమిటీ సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధి మరింత జరగాలన్న ముఖ్యమంత్రి చేసే ప్రయత్నాలు సఫలీకృతం కావాలన్నా ఈ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలన్నారు. నగరంలో ఎలివేటర్ కారిడార్, ములుగులో రహదారి విస్తరణ కోసం కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి కలిశారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ నగరానికి ఎన్నో అవకాశాలు వచ్చాయని, హైదరాబాద్ అభివృద్ధికి ఫోర్త్ సిటీ నుండి అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతుందన్నారు. మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, దేశంలో ఎక్కడ నివసించాలి అనుకుంటే హైదరాబాద్ ఆప్షన్ తీసుకుంటున్నారనిఇందుకు ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉండమేనన్నారు. జూబ్లీహిల్స్ లో ఈసారి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తామని ముఖ్యమంత్రి మద్దతుగా నిలుస్తామని స్థానికులు చెప్తున్నారుకాంగ్రెస్ పార్టీలోకి ఎవరు వచ్చి మద్దతు తెలిపిన ఆహ్వానిస్తామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు మౌళిక సదుపాయాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హైదరాబాద్ మహానగరం మరింత అభివృద్ధి జరగాలంటే ప్రభుత్వానికి మీ ఆశీర్వాదం కావాలని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజారుద్దీన్, కార్పొరేషన్ చైర్మన్‌లు అనిల్ ఈరవర్తి, జంగా రాఘవరెడ్డి, రాయల్ నాగేశ్వరరావు, గుత్తా అమిత్‌రెడ్డి, కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అర్ధరాత్రి దంచికొట్టిన వాన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. హైదరాబాద్ నగరంలోనూ రాత్రి కురిసిన వర్షానికి రోడ్లు చెరువులను తలపించాయి. కూకట్‌పల్లిలో చెట్లు విరిగి పడ్డాయి. సికింద్రాబాద్, తిరుమలగిరి తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. హైడ్రా, జిహెచ్ఎంసి, వర్షాకాల అత్యవసర సేవల సిబ్బంది రోడ్లపై నిలిచిన నీటిని తొలగించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షం కురవగా రోడ్లు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లాయి. గాజులరామారంలో రోడ్లపై నిలిచిన నీటిని హైడ్రా సిబ్బంది తొలగించారు. సూరారం జంక్షన్ వద్ద మోకాళ్ల లోతు వరద చేరి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కూకట్‌పల్లి ప్రగతి నగర్‌లో రోడ్డుపై చెట్టు ఒరిగింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. జల్ వాయువిహార్‌లో చెట్టు విరిగిపడింది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, జవహర్ నగర్, బొల్లారం, ప్యాట్నీ, పారడైజ్, రైల్వేస్టేషన్, చిలకలగూడ, మారేడుపల్లి ప్రాంతాలలో వర్షం కారణంగా రోడ్లు చెరువులను తలపించాయి. కుత్బుల్లాపూర్ వెంకటేశ్వర నగర్‌లో కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరింది. నగరంలోని రాత్రి ఒంటి గంట వరకు అత్యధికంగా గాజుల రామారంలో 8 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జీడిమెట్లలో 7.5, చింతల్ షాపూర్‌లో 7.2, కుత్బుల్లాపూర్‌లో 6.8, అల్వాల్ 5.1, బాలానగర్ 4.9, శేర్లింగంపల్లి 4.8, మూసాపేట్, నాచారంలో 4.1, సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన అన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

## 20న కలెక్టరేట్‌లు, ఎంఆర్ఓ ఆఫీస్‌ల ముట్టడి

- ఫీజుల కోసం విద్యార్థుల ర్యాలీలు, ప్రదర్శనలు
- మీడియా సమావేశంలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని 14లక్షల మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన డిగ్రీ, జూనియర్ కాలేజీల తరగతుల బహిష్కరణ, కలెక్టరేట్‌లు, ఆర్‌డిఒ, ఎంఆర్ఓ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. అనంతరం సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలిచ్చి, ర్యాలీలు, ప్రదర్శనలు శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన 'ఫీజులపోరు' సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 20 నెలలు గడస్తున్నా పేద విద్యార్థుల ఫీజుల కోసం ఒక్క రూ.20 కూడా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల కోట్లు అప్పు తెచ్చిందని, మరో రూ.2లక్షల కోట్ల పన్నులు వసూలు చేసిందని, ఈ డబ్బులన్నీ ఏం చేసిందని ప్రశ్నించారు. ఫీజుల స్కీం ఎత్తివేయడానికి తెస్తున్న 'ట్రస్ట్‌బ్యాంకు' ఏర్పాటు ప్రతిపాదనను ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించేదిలేదన్నారు. యథావిధిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంను కొనసాగించాలని, దీనిద్వారా గ్రామాల్లోని పేద కుటుంబాల పిల్లలు మెడిసిన్, ఇంజినీరింగ్, పిజి, డిగ్రీలు చదువుతున్నారని, ఫలితంగా సమాజంలో గుణాత్మక మార్పు ప్రారంభమైందని తెలిపారు. ప్రైవేట్ వర్సిటీ ప్రవేశాల్లో రిజర్వేషన్ల అమలుకు వివిధ రాజకీయ పార్టీలు ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు.
వెంటనే రాష్ట్ర ప్రభు త్వం విద్యాశాఖమంత్రిని నియమించాలని కోరారు. స మావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెం కటేశ్, నేతలు నందగోపాల్, సుధాకర్, మోదీ రాందేవ్, కార్తీక్ పటేల్, కృష్ణగౌడ్, అడ్వకేట్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ మున్సిపాలిటీగా చేయాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 6,7.9వ వార్డుల్లో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పర్యటించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర రాజదానికి అతీ సమీపంలో ఉన్న షాద్‌నగర్ మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీపుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే అనేక వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సుమారు రూ.4.50కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. గత పాలకుల నిర్లక్ష్య వైఖరీ కారణంగా మున్సిపాలిటిలో సమస్యలు ఎక్కడికక్కడే పెరిగిపోయాయని వివరించారు. ఎన్నికల సమయంలో హడావుడిగా ప్రొసిడింగ్స్ ఇచ్చారే తప్పా పనులు చేపట్టలేదని, దాంతో ఎక్కడి సమస్యలు అక్కడే పెరిగి పోయాయని గుర్తు చేశారు. దాంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా వార్డుల వారిగా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే మున్సిపాలిటిలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, లో వోల్టేజీ సమస్యలను నియంత్రించేందుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, స్థంబాలను సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలనీల్లో పర్యటిస్తున్న నేపధ్యంలో ప్రజలు నేరుగా ఎమ్మెల్యేను కలుసుకొని సమస్యలను వివరించారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే 15రోజుల్లోగా మీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, అక్కడే ఉన్న అధికారులకు సూచనలు సైతం చేశారు. షాద్‌నగర్ మున్సిపాలిటిలో వచ్చే దసరా నాటికి అభివృద్ధి పనులు పూర్త చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 6వ వార్డులోని అన్ని కాలనీల్లో ప్రజలు కోరిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మర్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నేతలు చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, ముబారక్, కొప్పునూరి ప్రవీణ్, ఖధీర శ్రీశైలం గౌడ్, పురుషోత్తంరెడ్డి, గోపాల్‌నాయక్‌లు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్ ఇంటికి వెళ్ళి దంపతులను సన్మానించిన ఎమ్మెల్యే

మాజీ సర్పంచ్ సుమిత చందునాయక్ ఇంటికి వెళ్ళి దంపతులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించి అశీర్వధించారు. శనివారం 6వ వార్డుల్లో సిసి రోడ్డు పనులు పరిశీలించారు. అక్కడే ఉన్న మాజీ సర్పంచ్ సుమితచందునాయక్ ఇంటికి వెళ్ళి తేనేటి విందు స్వీకరించి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. తాను నమ్మిన ప్రియ శిష్యుడు, తన రాజకీయ ఎదుగుదలకు ఎంతో కృషి చేసిన వ్యక్తుల్లో చందునాయక్ ఉన్నాడని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రాజకీయ పార్టీ ఏదైనా ఉండొచ్చు కానీ తన ప్రియ శిష్యుడిని ఏనాడు మరచి పోలేనని, అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించనున్నట్లు పేర్కొన్నారు.



## మట్టి వినాయకులను ప్రతిష్టించండి

జై గణేశ భక్తి సమితి పిలుపు



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** మట్టి వినాయకులను ప్రతిష్టించి, పర్యావరణాన్ని కాపాడాలని జై గణేశ భక్తి సమితి తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఎంఎల్‌సి బొగ్గారపు దయానంద్ గుప్తా , చైర్మన్ కె.ఎస్.ఆనంద్‌రావు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి ప్రతినిధులతో కలిసి వారు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, తమ సంస్థ తరఫున మట్టి వినాయకుల ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌ను నిషేధించి, మట్టివినాయకులను పూ జించాలని కోరారు. మట్టివినాయకుల తయారీ కళాకారులను, పూజించిన భ క్తులను అవార్డు ప్రదానంతోపాటు శాలువాతో సత్కరించి, మెమోంటో అందజేస్తామన్నారు. సమావేశంలో సమితి నేతలు రాములు, మహేశ్, శ్రీకాంత్, రవిబాబు, మహిళా విభాగం కన్వీనర్ శ్రీదేవిగౌడ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## '25వేల సభ్యత్వాలను నమోదు'



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** అగ్రసేన్ జయంతి నాటికి కనీసం 25వేల మంది సభ్యులను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా కోరారు. శనివారం బషీర్‌బాగ్‌లో కార్యాలయంలో జరిగిన అగర్వాల్ సమాజ్ తెలంగాణ కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వచ్చే రెండేళ్లపాటు సభ్యత్వ రుసుం రూ. 350 నుంచి రూ.21తగ్గించాలని, ఆ తర్వాత ఓటు హక్కును విస్తరించాలని నిర్ణయించారు. సమావేశంలో సమాజ్ సహ కార్యదర్శి సీమా జైన్ , ఉపాధ్యక్షులు రూపేశ్ అగర్వాల్, హరీశ్ అగర్వాల్, డకాలియాతోపాటు వివిధ శాఖల కేంద్ర కమిటీ సభ్యులు, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

## పట్నం ప్రజలను పోచమ్మ చల్లగా చూడాలి

ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి..

**ప్రజాపక్షం/యాచారం :** పట్నం ప్రజలను పోచమ్మతల్లి చల్లగా చూడాలని ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ పునర్ ప్రతిష్ట కార్యక్రమానికి అయన ముఖ్యఅతిధిగా హజరైనారు. నిర్వాకులు ఎంఎల్ఏకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసంధర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ దేవాలయాలు ఆధ్యాత్మిక చింతనకు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. అమ్మవారి అనుగ్రహం ఉంటే ఎదైనా సాదించవచ్చునని అన్నారు. గడ్డమల్లాయగూడ గ్రామాభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తానన్నారు. గ్రామంలో అవసరమైన సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణంకు నిధులు కేటాయిస్తానని తెలిపారు. ప్రజలు, నాయకు లు అభివృద్ధికి సహకరించాలని కొరారు.ఈకార్యక్రమంలో గ్రామ మాజీ స ర్పంచ్ అచ్చన జంగయ్య, ప్రవిణ్‌రెడ్డి ,బిఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మేన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.



## మానసిక ప్రశాంతతకు వ్యాయామం ముఖ్యం : సుదీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్:** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీ నందు శ్రీ రాఘవేంద్ర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, జిహెచ్ఎంసి నిధులచే నిర్మించిన ఇండోర్ ఓపెన్ జిమ్‌ను ఎల్ బినగర్ ఎంఎల్ఎ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,స్థానిక కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండోర్ ఓపెన్ జిమ్ ఎక్కడ లేదని మొదటిసారిగా ఇక్కడ చూస్తున్నామని అన్నారు. స్థలం ఎక్కడ వృధా చేయకుండా ఓపెన్ జిమ్,ఇంకుడుగుంత, వాకింగ్ ట్రాక్ నిర్మించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి,డివిజన్ భారస అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చెన్నైగోని రవీందర్ గౌడ్, మల్లీశ్వరి రెడ్డి,గుజ్జ జగన్ మోహన్,గుడాల మల్లేష్,కృష్ణరెడ్డి కాలనీ అధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి,కైలాష్ నాథ్,వెంకటేశంగౌడ్, నర్సయ్య, హరినాథ్ బాబు,బుచ్చిరెడ్డి,వెంకట్ రాములు,సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## నిరంతరం వర్షాలతో పాడైన రోడ్లు



**ప్రజాపక్షం/షాబాద్ :** గత వారం రోజులుగా నిరంతరం కురుస్తున్న వర్షాలకు షాబాద్ మండలంలోని మీరాపూర్, హైతాబాద్, నాగర్‌గూడ, ఎర్రోనిగూడ గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి వివిధ గ్రామాల రోడ్లను మర్మత్తులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## షాబాద్‌లో భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి



**ప్రజాపక్షం/షాబాద్ :** శ్రీకృష్ణమి వేడుకలు శనివారం షాబాద్ మండలంలోని దైవాలగూడ, నాగర్‌కుంట, షాబాద్, పోలారం, నాగర్‌గూడ గ్రామాల్లో అంగరంగా వైభవంగా శ్రీ కృష్టమి పండగ ఘనగా నిర్వహించారు. చిన్నారులు, శ్రీ కృష్టుని వేశధారణతో అందరిని మైమరిపించారు. అనంతరం శ్రీకృష్ణుని మహిమల గురించి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, పండితులు మహాభారతం చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.



# మహానగరి

GREATER HYDERABAD

గ్రేటర్ హైదరాబాద్

## స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న పోచమ్మకు ప్రశంసా పత్రం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉత్తమ సేవలందించిన రాంపల్లికి చెందిన మీసాల పోచమ్మకు ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలుగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌధరి ప్రశంసా పత్రం అందజేసి అభినందనలు తెలిపారు.



## వ్యవసాయదారుల సేవా సహకార సంఘాల బలోపేతం

### సిపిఐ రాష్ట్ర మహాసభల గౌరవ అధ్యక్షుడు డిజి సాయిలుగౌడ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వ్యవసాయదారుల సేవా సహకార సంఘాలను బలోపేతం చేయుటకు సిపిఐ రాష్ట్ర మహాసభల్లో తీర్మానాలను ప్రవేశ పెట్టనుందని రాష్ట్ర మహాసభల గౌరవ అధ్యక్షుడు డిజి సాయిలుగౌడ్ అన్నారు. శనివారం శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘంలో సహకార సంఘం చైర్మన్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ మధుకర్‌రెడ్డిని కలిసి రాష్ట్ర మహాసభల కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ కౌలు రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చే విధంగా నాలుగవ రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామని చెప్పారు. ఈ నెల 20 నుంచి 23 వరకు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలు వేదిక కానుందని, ప్రజా ప్రయోజనాలకు సంబంధించి విధి విధానాలను రూపొందించి ప్రజా ఉద్యమాల ద్వారా అధికార ప్రభుత్వానికి విన్నవిస్తామని అన్నారు. మహాసభలను విజయవంతం చేయడానికి మేధావులు, వ్యాపార వేత్తలు, అభ్యుదయ వాదులు, పార్టీ అభిమానులు విరాళాలు అందించి సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోసైటి వైస్ చైర్మన్ ఐలయ్య, డైరక్టర్ భూమిరెడ్డి, శామీర్‌పేట మండల ప్రధాన కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్, మూడుచింతలపల్లి మండల కార్యదర్శి తప్పెట్ల రాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పోతారం చౌరస్తా రోడ్డుకు మరమ్మతులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని పోతారం చౌరస్తా తందూర్ హోటల్ సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారి వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు నీటితో నిండి చెరువును తలపించింది. దీంతో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు రావడంతో ఆ రోడ్డులో కంకరవేసి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టారు. అలాగే వర్షపు నీరు వెళ్లడానికి పక్కన కాలువ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిధిలావస్థకు చేరిన ఇండ్లల్లో ఉండకూడదని సురక్షిత ప్రాంతంలో ఉండాలని చెప్పారు.




## ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌ను పూర్తి చేయాలంటూ మంత్రుల ఫోటోలతో ఫ్లెక్సీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఏడేళ్లుగా నత్తనడకతో కొనసాగుతూ అవస్థలకు గురి చేస్తున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌ను ఇకనైనా పూర్తి చేయాలంటూ అంసంపూర్తిగా ఉన్న పిల్లర్లకు రాష్ట్ర మంత్రి పొన్నం, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి ఫొటోలతో వెలిసిన ఫ్లెక్సీలు, పోస్టర్లు కలకలం సృష్టిస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు, పోస్టర్లు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు వారి ఫొటోలతో సహా ఉప్పల్ రోడ్డు పూర్తి చేయాలంటూ వినతులు రాసి వేడుకోవటం ఆసక్తికరంగా మారింది. వీటి ద్వారా అయిన అధికారుల్లో కదలిక వస్తుందేమోనని పలువురు వీటిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా పోచారం మున్సిపాలిటీ నారపల్లి చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి బిజెపి కాంటెస్టడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతాలకు చివరివరకు కట్టుబడిన వ్యక్తి వాజ్‌పేయి. తనకు ఎదురైన అన్ని కష్టాలను ఓర్పుతో భరించారు. వికసిత్ భారత్ దిశగా అడుగులు వేసేందుకు పటిష్టమైన పునాది ఏర్పడిందని పార్లమెంట్‌లో తనదైన ప్రసంగాలతో అందరినీ మంత్రముగ్ధులను చేసేవారు. ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రమేష్ నాయుడు, కోర్రెముల గ్రామశాఖ అధ్యక్షులు జగదీష్ గౌడ్, నాగరాజ్, పోచారం మున్సిపల్ నాయకులు బిక్షపతి గౌడ్, గుండె నరేష్, రావుల శ్రీకాంత్ జానకి, రామ్, తదితరులు పాల్గొన్నారు.

## కొరివి కృష్ణ స్వామి జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** హైదరాబాద్ నగర తొలి మేయర్, హిస్టోరియల్ ఆఫ్ హైదరాబాద్ గ్రంథ రచయిత ముదిరాజ్ కుల బాంధవుడు, స్వర్గీయ కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతి వేడుకలు హైదరాబాద్ నగరంలో ఘనంగా జరిగాయి.



ఈ వేడుకలకు ముఖ్య అతిథి గా పాల్గొన్నటువంటి కాసాని వీరేష్ మాట్లాడుతూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతి ఉత్సవాలను నిర్వహించాలని, బిసిడిలో ఉన్నటువంటి ముదిరాజు కులస్తులను 'ఏ' లోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మహిళల సంక్షేమం, అభివృద్ధే

# ప్రభుత్వ ధ్యేయం

- మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు
- పలు అభివృద్ధి భవనాలు ప్రారంభించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/నవాబుపేట:** మహిళాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం చించల్ పేట్ గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి సీతక్క, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య తో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు గావించారు. వికారాబాద్ జిల్లా, చేవెళ్ల నియోజకవర్గం నవాబుపేట్ మండలంలోని చించల్ పేట్ గ్రామంలో 15 లక్షలతో అంగన్వాడి భవనం, 20 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, 20 లక్షలతో పశు వైద్య ఉప కేంద్ర భవనం, 20 లక్షలతో ద్వాక్రా భవనం, 30లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, 20 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనం, 20 లక్షలతో గ్రామపంచాయతీ భవనాలను అతిథులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో పంచాయత్ రా శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమం చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూనే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని ఆమె అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వడ్డీ లేని రుణాలు, క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం దోహదం చేస్తుందన్నారు. మహిళలందరిని సంఘాల్లో చేర్పించాలని, సంఘాల్లో ఉన్న వారికి రుణాలు పొందే అవకాశం ఉంటుందని, ఇప్పటికే మహిళా సంఘాలకు 26 వేల కోట్ల అప్పులు ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు.



800 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని ఆమె అన్నారు. మహిళా సంఘాల్లో ఉన్న మహిళలు రుణాలు పొంది మరణించినట్లయితే 2 లక్షల లోన్ బీమా చేయించడం జరుగుతుందని ఆమె తెలిపారు. మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నాయని ఆమె అన్నారు. 15 సంవత్సరాల వారికి మహిళా సంఘాల్లో సభ్యత్వం కల్పించడం జరుగుతుందని అదే విధంగా 60 సంవత్సరాలు దాటిన మహిళలకు కూడా సంఘాల్లో చోటు కల్పించడం జరుగుతుందని ఆమె అన్నారు. 200 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రతి పేదవాడు సన్న బియ్యంతో భోజనం చేయాలన్న సదుద్దేశంతో సన్న బియ్యాన్ని అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అదేవిధంగా రైతులను సన్న వడ్లు పండించేందుకు ప్రోత్సహిస్తూ క్వింటాల్ కు అదనంగా 500 రూపాయల బోనస్ ను కూడా ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఆరోగ్యశ్రీ కింద వైద్యానికి 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచడం జరిగిందని ఆమె అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, చించలపేట గ్రామంలో పెద్ద మొత్తంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. శాఖ పరమైన ప్రజలకు సేవ చేసేందుకు నా వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట కట్టుబడి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని ఆయన అన్నారు. గ్రామాల కనీస అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వ నిధులను కేటాయించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డిఓ వాసు చంద్ర, డిఆర్డిఎ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, డిటిడబ్ల్యుఓ కమలాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం, పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం, డిడబ్ల్యుఓ కృష్ణ వేణి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇఇ ఉమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్, ఎంపీఓ విజయ్ కుమార్, సూపర్‌డేంట్ అజయ్ కుమార్, మండల వైద్యాధికారి రోహిత్, వ్యవసాయ అధికారి జ్యోతి, ఏపీఓ లక్ష్మి దేవి, ఏపీఎం దేవయ్య, పీఆర్ఏఈ ప్రణీత్, ఏఎంసీ వైస్ చైర్మన్ బాల్వంత్ రెడ్డి, బల్ రాం, బాలయ్య, చించల్ పేట్ మాజీ సర్పంచ్ కాలే శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఏక్బాల్ నాయకులు నాగిరెడ్డి, సురేందర్, నర్సింహా రెడ్డి, రవీందర్ రెడ్డి, అనంత రాములు, అనంత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రవికాంత్, చంద్రకాంత్ మహిళ సంఘాల నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కొరకై మహా విష్ణువు భూలోకంలో అవతరించి ధర్మపాలన అందించిన శ్రీకృష్ణుడు జన్మించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘట్‌కేసర్ మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాలలో శనివారం ఘనం గా జరుపుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎన్ఎఫ్‌సి నగర్, అవుషాపూర్,అంకుషాపూర్, ఎదులాబాద్,మాదారం,మర్రిపల్లిగూడ, ఘనపూర్ గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బాలబాలికలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో కోలాటాలు ఆడి ఉట్టి కొట్టడాలను చేసి అందరిని అలరించారు. బాలబాలికలు అచ్చం శ్రీకృష్ణుడు గోపికల మాదిరిగా తయారు కావడంతో తల్లిదండ్రులు సంబుర పడ్డారు. కృష్ణాష్టమి సందర్భంగా పలు ఆలయాలలో భక్తులు మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు.



**శామీర్‌పేటలో :** ఉమ్మడి శామీర్‌పేట మండలంలో శ్రీ కృష్ణాష్టమి జయతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషాదారణలో అలరించారు. గోపికల నృత్యాలతో శ్రీకృష్ణాష్టమి పండగలో సందడి చేశారు.



మూడుచింతలపల్లి, అలియాబాద్, తూంకుంట మున్సిపాలిటిల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ని కృష్ణుడుగా, గోపికలుగా వేషాదారణ చేసి వారితో ఆటపాటలు ఆడించారు. పలు పాఠశాలల్లో చిన్నారులు ఉట్టి కొడుతు సందడి చేశారు. ఉమ్మడి మండలంలోని పలు ఆలయాల్లో రాధకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**నాగారంలో :** శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సెరినిటీ పాఠశాల,బాలగోకులం ఆధ్వర్యంలో నిర్వహించిన శోభా యాత్ర ను కీసర సిఐ ఆంజనేయులు ప్రారంభించారు.విద్యార్థుల వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, నాయకులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి,మాదిరెడ్డి, సంజీవ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## టిఎవైఎల్ టికెట్ ధరలు తగ్గింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా గ్రేటర్ హైదరాబాద్ ప్రయాణికులకు టిజిఎస్ ఆర్టీసీ ఆఫర్ ప్రకటించింది. ట్రావెల్ యాజ్ యూ లైక్ (టిఎవైఎల్) టికెట్ ధరను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 15 నుంచి 31వ తేదీ వరకు తగ్గింపు ధరలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. మెట్రో డీలక్స్ బస్సులతో పాటు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 24 గంటల పాటు ఈ టికెట్లను కొనుగోలు చేసే సౌకర్యం కల్పించారు. పెద్దలకు ఇంతకు ముందు ఉన్న టికెట్ ధర రూ.150ను సవరించి రూ.130 చేశారు. మహిళలు, సీనియర్ సిటిజన్స్ కు ఇంతకుముందు రూ.120 ఉండగా, దాన్ని సవరించి రూ.110 చేశారు. పిల్లలకు ఇంతకు ముందు ఉన్న టికెట్ ధర రూ.100ను సవరించి రూ.90 చేశారు.

## వనదుర్గమ్మ ఆలయం చుట్టుముట్టిన మంజీరా

- మరో మూడురోజుల పాటు ఆలయం మూసివేత
- నీటి ఉధృతిని పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం చుట్టూ మంజీరా ప్రవహిస్తుంది. వనదుర్గమ్మను గంగమ్మ పూర్తిగా చుట్టుముట్టేసింది. మూడో రోజు సైతం జలదిగ్బంధంలోనే వన దుర్గమ్మ చిక్కుకుంది. మరో మూడు రోజుల పాటు ఆలయం మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు. శనివారం గంగమ్మ ఉధృతి విపరీతంగా పెరిగిపోయింది. దీనితో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జాయింట్ కలెక్టర్ నగేష్, జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, నీటి ఉధృతిని వేరువేరుగా పరిశీలించారు. సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలతో పాటు పోలీస్ సిబ్బంది నీటి ప్రమాదాలు జరగకుండా భారీకేడ్లను ఏర్పాటు చేసి పర్యటకులు నీటి వైపు వెళ్లకుండా కట్టడి చేస్తున్నారు. సింగూరు నుంచి దిగువకు నీటిని వదలడంతో ఆలయ సమీపంలో ఉన్న వనదుర్గా ప్రాజెక్టు పూర్తిగా నుం డి పొంగి పొర్లుతోంది. ప్రాజెక్టు పైనుంచి గంగమ్మ పరవళ్ళు తొక్కుతూ వనదుర్గామాత ప్రధాన ఆల యం ముందున్న ఏడుపాయల్లో ఒకటైన నదీ పాయ ఉధృతంగా ప్రవహించడంతో ఆలయానికి రాకపోకలు స్తంభించాయి. దీంతో గురువారం ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. రాజ గోపురంలో వనదుర్గా మాత ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అమ్మ దర్శనం కల్పిస్తున్నారు. నీటి ప్రవాహం వద్దకు భక్తులు ఎవరూ వెళ్లకుండా పోలీసులు భారీకేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహిస్తున్నారు.



యూసుఫ్‌గూడలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, గుర్రం మురళి గౌడ్



## 'టిబి' నివారణ ప్రతిఒక్కరి బాధ్యత

### గవర్నర్ జిష్ణుదేవ వర్మ

**ప్రజాపక్షం/వికారాబాద్:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి రిసార్ట్ కు తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్, చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండావేశ్వేశ్వర్‌రెడ్డి , జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ,జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి గవర్నర్‌కు పూల మొక్కలతో స్వాగతం పాలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ట్యాబర్ క్యూలోసిస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో అనంతగిరి హిల్స్‌హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన మూడవ తెలంగాణ ట్యాబర్ క్యూలోసిస్ ,చేస్ట్ డిసిసేస్ కాన్ఫరెన్స్ 2025ను రాష్ట గవర్నర్ ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ టిబి వ్యాధి నివారణ కోసము ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని ,టిబి రాకుండా జాగ్రత్తపడాలి అన్నారు. టిబి వ్యాది నివారణ కోసము చాలా రకాల మందులు వచ్చాయన్నారు. వికారాబాద్‌కి హవా మరీజోంకిదవా ,రాజకీయ నాయకులు ,కవులు ,పద్మశ్రీఅవార్డులు పొందిన వారు రచయితలు అందరిని టిబి నిర్మూలనలో అందరు కష్టపడితేనే అందరు ఆరోగ్యంగా ఉంటారు. రాష్టానికి దేశానికి అన్ని జిల్లాల కంటే వికారాబాద్ జిల్లా ను రోల్‌మాడల్ గాతీర్చి దిద్దాలని ,ప్రత్యేక ప్రణళిక రుపోందిచాలని ,తెలంగాణ టిబి చేస్ట్ డీసీసేస్ కాన్ఫిరేన్స్ సందర్భంగా అదేశించారు. అందరికి టిబి లక్షణాల గురించి అవగాహన కలిపించడం ద్వారా టిబిని నిర్మూలించవచ్చన్నారు. వికారాబాద్‌కు స్పీకర్ ,ఎంపి ఉండటం జిల్లా అదృష్టమన్నారు. టిబి నిర్మూలనలో జిల్లాను ఆదర్శంగా నిలపాలని తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టిబి జిల్లా అధికారులైన డాక్టర్ మల్లికార్జున ,మహబూబ్‌నగర్ .డాక్టర్ రాజు జోగులాంబ గద్వాల్ , డాక్టర్ సుమలత అదిలాబాద్ , డాక్టర్ పల్లరెడ్డి లకు ప్రశంశా పత్రాలు గోల్డ్‌మెడల్ మేమొంటోలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్ , జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ , జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి , టిబి అసోసియోషన్ చైర్మన్ డాక్టర్ సుదీర్ , ,ప్రసాద్ ,దీన దయాళ్ బాగ్ , నరేందర్ ,బాలచందర్ తదితరులు పాల్గోన్నారు.




## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

**ప్రజాపక్షం/బంట్వారం:** మండల పరిధిలో ఉన్న తోర్మామిడి గ్రామానికి చెందిన షబానా బేగం గత ఆరు నెలల క్రితం తన సెల్ ఫోన్‌ను తమ గ్రామంలో పోగొట్టుకోవడం జరిగింది. అదేవిధంగా రోంపల్లి గ్రామానికి చెందిన మంబపూరం పాండు రంగారెడ్డి రెండు నెలల క్రింద ఫోన్ పోగొట్టుకున్నారు. సెల్‌ఫోన్లు పోవడంతో బాధితులు స్థానిక పోలిస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తుచేసి ఫోన్లను సేకరించి శనివారం బాధితులకు అప్పగించారు. ఎవరైన మండల పరిధిలో ఎక్కడైన సెల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే పోలీస్టేషన్ సంప్రదించాలని ఎస్ఐ విమల పేర్కొ న్నారు.

## పెన్సన్లు వెంటనే పెంచాలి

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**ప్రజాపక్షం/తాండూర్/పరిగి:**వికారాబాద్ జిల్లాలోని శనివారం తాండూర్ ,పరిగి లో పెన్సన్లు పెంచాలని సభలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదాగ మాట్లాడూతు , రాష్టంలో ని పించన్‌దారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసగిస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల ఫింఛన్‌దారులకు అందాల్సిన సొమ్ము ,నెలకు వెయ్యి కోట్లు చొప్పున ఇప్పటివరకు 20వేల కోట్లు పక్కదారి పట్టించారి ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హమిలను నెరవేరుస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి 20నెలలు గడిచిన పేద ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చడం లేదని అవేదన వ్యక్తం చేశారు. తీవ్ర వైకల్యం కలిగిన కండరాలు క్షీణత ఉన్న వ్యాధిగ్రస్తుల కు రాష్ట ప్రభుత్వం నెలకు రూ15వేల పెన్షన్ ఇవ్వాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. అధికర పక్ష అన్యాయం చేస్తుంటే ప్రతిపక్ష నోరు మెదపడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రశంసాపత్రం అందుకున్న ఎస్ఐ అబ్దుల్ హాఫీజ్



**ప్రజాపక్షం/పరిగి:**ఉత్తమ సేవలు కు ప్రశంసా పత్రం అందుకున్నా అబ్దుల్ హాఫీజ్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ , ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ,జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ , మనోహర్‌రెడ్డి , జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి , చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పరిగి మున్సిపల్ 14వ వార్డు మాజీ కౌన్సిలర్ మీర్ తహేర్ అలీ వారి నివాసంలో కలిసి పూల మాలలు వేసి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో యూనిష్ బాయ్ ,మహమ్మద్ అస్తాన్ఫ్ పాల్గోన్నారు.

# రీల్



## ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్

పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓజీ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఓజాస్ గంభీరగా గ్యాంగ్‌స్టర్ అవతార్‌లో కనిపించనున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుల్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. 'ఓజీ' సినిమా నుంచి ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో ఆమె కన్మణిని పాత్రలో అలరించనున్నారు. తాజాగా విడుదలైన రెండు పోస్టర్లలో ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్ మాత్రం భిన్నంగా ఉంది. ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## 'కిష్కిందపురి' టీజర్ రిలీజ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మిస్టీరియస్ థ్రిల్లర్ 'కిష్కిందపురి' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. సెప్టెంబర్ 12న విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు 'కిష్కిందపురి' టీజర్ మిస్టీరియస్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో టీజర్ అదిరిపోయింది. మొదటి షాట్ నుంచే ఓ మిస్టరీ స్టార్ట్ అవుతుంది. ఒక వింటేజ్ మాన్షన్‌లోకి వెళ్లిన ఓ అమ్మాయి ఒక్కసారిగా అదృశ్యం అవుతుంది. ఇంతలో రేడియో నుంచి ఒక మెసేజ్ ప్రసారం చేస్తుంది.బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అనుపమ పరమేశ్వరన్ ఇద్దరి క్యారెక్టర్లను టీజర్‌లో పరిచయం చేశారు.



## యథార్థ ప్రేమ కథ '1990's


ఎమ్.ఎమ్.సి బ్యానర్‌పై అరుణ్, రాణి వరద్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం 1990's. కర్ణాటకలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన ప్రేమ కదా చిత్రం. అద్భుతమైన లొకేషన్స్‌లో పాటలు చిత్రికరించిన ఈ చిత్రం. సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని త్వరలో తెలుగు, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో విడుదల కాబోతోంది.నందకుమార్ సి.ఎమ్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాకు నిర్మాత చంద్ర శేఖర్ బీఎస్. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టీజర్‌కు మంచి రెస్పాన్స్ లభించింది. త్వరలో ఈ మూవీ సాంగ్స్ ట్రైలర్ విడుదల కానున్నాయి. ఈసీ మహారాజ్ సంగీతం అందించిన ఈ సినిమాకు హోలేస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎడిటర్ : కృష్ణ, కొరియోగ్రాఫర్: సాధిక్ సర్దార్, నిర్మాత:చంద్ర శేఖర్ బిఎస్ సహనిర్మాత : అరుణ్ కుమార్.



## 'ఫైటర్ శివ' టీజర్ విడుదల

కౌండిన్య ప్రొడక్షన్స్, అరుణ గిరి ఆరట్స్ బ్యానర్ల మీద ఉన్నం రమేష్, నర్సింహా గౌడ్ నిర్మించిన చిత్రం 'ఫైటర్ శివ'. ప్రభాస్ నిమ్మల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మణికాంత్, ఐరా బన్సాల్ జంటగా నటించారు. ఈ మూవీలో సునీల్, వికాస్ వశిష్ట వంటి వారు కీలక పాత్రలను పోషించారు. ఈ క్రమంలో 'ఫైటర్ శివ' టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ టీజర్‌ను ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ రిలీజ్ చేశారు. 'యముడుకి పోలీస్ ఉద్యోగం దొరికితే ఎలా ఉంటుందో చూపిస్తా..', 'నేను పవన్ కళ్యాణ్ లెక్క.. గెలిచే వరకు పోరాడుతా' వంటి పవర్ ఫుల్ డైలాగ్స్‌తో 'ఫైటర్ శివ' టీజర్న్ అద్భుతంగా కట్ చేశారు. హీరో మణికాంత్ మాట్లాడుతూ.. 'నన్ను హీరోని చేయాలని ఈ 'ఫైటర్ శివ' కోసం మా నాన్న చాలా కష్టపడ్డారు. పెట్టిన ప్రతీ రూపాయిని వడ్డీతో సహా ఇండస్ట్రీ నుంచి తీసుకు వెళ్తాను. ఈ ప్రయాణం అంత సులభంగా జరగలేదు. మధ్యలో ఇరుక్కుపోయిన మమ్మల్ని రమేష్ ఒడ్డుకు తీసుకు వచ్చారు. ప్రభాస్‌కి కమర్షియల్ చిత్రాలంటేనే చాలా ఇష్టం అని అన్నారు.

## 27న వస్తున్న 'కన్యాకుమారి'



ప్రముఖ నటి మధు శాలిని సమర్పకురాలిగా రూరల్ లవ్ స్టోరీ 'కన్యా కుమారి' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. రాడికల్ పిక్చర్స్ బ్యానర్‌పై సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్ లో మూవీ ప్రజెంటర్ మధు షాలిని మాట్లాడుతూ కన్యాకుమారి టీజర్ చూడగానే నాకు చాలా నచ్చేసింది. గీత్ చాలా అద్భుతమైన క్యారెక్టర్ లో చాలా అందంగా కనిపించారు. సృజన్ తీసిన పుస్తక విమానం సినిమా నాకు నచ్చింది. అలాంటి కొత్త టాలెంట్ ని సపోర్ట్ చేయాలనిపించింది. మా అమ్మ న్నాన ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహం తర్వాత మా అమ్మ ఉన్నత విద్యల్ని అభ్యసించారు. ఒకరిని ఒకరు చాలా సపోర్ట్ చేసుకున్నారు. ఈ సినిమా చూసిన తర్వాత మా అమ్మానాన్న లవ్ స్టోరీ కూడా ఇలానే స్టార్ట్ అయ్యుంటుందనిపించింది. ఇది ఈ సినిమాతో నా పర్సనల్ కనెక్షన్ అని చెప్పారు.



## 'ఫ్రెండ్లీ ఘోస్ట్' ఫస్ట్ లుక్ విడుదల

సుచిన్ సినిమాస్ లిమిటెడ్ బ్యానర్ పై మాస్టర్ జియాన్స్ సమర్పణలో సత్యం రాజేష్, రియా సచ్యదేవ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'ఫ్రెండ్లీ ఘోస్ట్'. సస్పెన్స్‌తో పాటు కామిడికి పెద్ద పీట వేస్తూ దర్శకుడు జి.మధు సూధన్ రెడ్డి ఈ సినిమాను రూపొందించారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో మంచు మనోజ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ 'మంచి కాన్సెప్ట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే విధంగా ఫ్రెండ్లి ఘోస్ట్ సినిమా త్వరలో థియేటర్స్‌లో రాబోతోంది. ఈ సినిమా విజయం సాధించి హీరో రాజేష్‌కు నిర్మాత విశ్వనాథ్‌కు, డైరెక్టర్ జి.మధు సూధన్ రెడ్డికి మంచి పేరు రావాలని కోరుకుంటున్నా'అన్నారు. భీమ్స్ సంగీతం అందించిన ఈ సినిమాలో శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, వెన్నెల కిషోర్, మధు నందన్, చమ్మక్ చంద్ర, 30 ఇయర్స్ పృథ్వి తదితరులు ముఖ్య పాత్రలో నటించారు. షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా నుండి సాంగ్స్, టీజర్, ట్రైలర్ త్వరలో రాబోతున్నాయి.

కేంద్ర, రాష్ట్ర పన్ను అధికారయంత్రాంగం జారీచేసే సమన్లకు..

## 'అసెస్సీ' కట్టుబడి ఉండాలి

సుప్రీం కోర్టు తీర్పు

**న్యూఢిల్లీ :** కేంద్ర, రాష్ట్ర ట్యాక్స్ అథారిటీ జారీ చేసేసమన్లకు 'అసెస్సీ' (పన్ను చెల్లింపు దారుడు) కట్టుబడి ఉండాలని, షోకాజ్ నోటీసుకు ప్రతిస్పందించాలని సుప్రీంకోర్టు తీర్పు తెలిపింది. 1961 ఆదాయపు పన్ను చట్టం ప్రకారం 'అసెస్సీ' అంటే చట్టం ద్వారా పేర్కొన్న విధంగా పన్ను చెల్లింపు లేదా ఆర్థిక కట్టుబాట్లు చట్టపరమైన బాధ్యతను కలిగి ఉన్న ఏదైనా వ్యక్తి లేదా సంస్థ. అందువల్ల కేంద్ర, రాష్ట్ర జిఎస్‌టి అధికారులు నకిలీ తీర్పులను నిరోధించడానికి మార్గదర్శకాలను నిర్దేశిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ జెబి.పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ 'కేవలం సమన్లు జారీ చేసినంత మాత్రాన వాటిని జారీచేసే అధికార యంత్రాంగానికి లేదా గ్రహీతకు చర్యలు ప్రారంభించబడ్డాయని నిర్ధారించుకునే అవకాశం ఉండదు' అని ధర్మాసనం పేర్కొంది. కేంద్రం లేదా రాష్ట్ర ట్యాక్స్ అథారిటీ ఒక పన్ను చెల్లింపుదారుడికి పన్ను లేదా షోకాజ్ నోటీస్ జారీచేసేటప్పుడు మొదటి సందర్భంలో పన్ను చెల్లింపుదారుడు హాజరై అభ్యర్థన ప్రతిస్పందనను అందించడం ద్వారా దానిని పాటించవలసి ఉంటుంది.'విచారించబడుతున్న లేదా దర్యాప్తు చేయబడుతున్న విషయం ఇప్పటికే మరొక అధికారి విచారణ లేదా దర్యాప్తునకు సంబంధించిన అంశం అని, ఒక అసెస్సీకి తెలిస్తే ఆ అసెస్సీ వెంటనే తదుపరి విచారణ లేదా దర్యాప్తు ప్రారంభించిన అధికారికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలి' అని ధర్మాసనం తెలిపింది.



## మా అమ్మే నాకు ప్రేరణ

బాలుడు మాస్టర్ నైతిక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'పాఠశాల విద్య, క్రీడలు, ఈతలు, నాట్యంలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో శిక్షణ పొందుతున్న తాను రాణించగానికి అడుగడుగునా నా వెన్నంటి ఉంటూ నన్ను ప్రోత్సహిస్తున్న మా అమ్మ డాక్టర్ సాహెబ్ జాదా సృజన నాకు ప్రేరణ అన్ని ఎనిమిదేళ్ళ బాలుడు మాస్టర్ నైతిక్ అన్నారు. మా అమ్మమ్మ డాక్టర్ కందిమళ్ళ భారతి, తాతయ్య ప్రొఫెసర్ ఎస్.వి. సత్యనారాయణ నాకు స్ఫూర్తి' అంటూ ముద్దుముద్దు మాటలతో వివరించాడు. బాగ్‌అంబర్‌పేటలోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ సీనియర్ సిటిజన్స్ పార్క్‌లో శనివారం కాలనీ ఉపాధ్యక్షులు సుధాకర రావు అధ్యక్షతన జరిగిన సభలో మాస్టర్ నైతిక్ రచించిన స్వీయ కథ 'గమ్యం, నేను, అమ్మ, నా పెద్ద స్వప్నం' ఆంగ్ల పుస్తకాన్ని స్వాతంత్ర్య సమరయోధుడు, బహుగ్రంథకర్త, నైతిక్ ముత్తాత కందిమళ్ళ ప్రతాపరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ 'పుస్తకాలు చదివే, రాసే అలవాటు తగ్గిపోతున్న ఎలక్ట్రానిక్ యుగంలో నా మునిమనుమడు మాస్టర్ నైతిక్ తన క్రీడాభిమానాన్ని, పుస్తక పఠన ప్రీతితో కూడిన తన స్వీయానుభవాన్ని, దీర్ఘకాలిక స్వప్నాన్ని చక్కని కథాకథన శైలిలో రాయడం సంతోషంగా ఉందన్నారు. ఒక వైపు చదువులో ప్రతిభను ప్రదర్శిస్తూనే, మరోవైపు వివిధ రంగాలలో నైతిక్ రాణించాలి' అంటూ ఆశీర్వదించారు. సభా ప్రారంభంలో ప్రొఫెసర్ ఎస్‌వి సత్యనారాయణ సభికులకు స్వాగతం పలుకుతూ తన స్వీయ కవిత 'మనుమడొస్తున్నాడు' చదివినప్పుడు శ్రోతలు ఉర్రూతలూగారు. మాస్టర్‌నైతిక్ మాతృమూర్తి డాక్టర్ సృజన పుస్తక నేపథ్యాన్ని వివరిస్తూ. 'ఈ పుస్తకం తన తండ్రిఎస్‌వి సత్యనారాయణ 72వ జన్మదినోత్సవ సందర్భంగా ఆవిష్కరించడంఆనందగా ఉందన్నారు. ఈ పుస్తకావిష్కరణలో సిహెచ్ వేణుగోపాల రెడ్డి, బి.శేఖరరెడ్డి, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, కార్యనిర్వహక కార్యదర్శి కెవిల్, కందిమళ్ల సావిత్రి, విజయలక్ష్మి , ఉషా, కళ్యాణి, పార్వతి, పుష్ప, చిలువేరు యాదగిరి, గండూరి నాగేశ్వరరావు, సింగరాజు నాగేశ్వరరావు, మక్కం మధుసూదన్, నూకల సుబ్బారావు, శర్మ, సుధాకర్, హరిప్రసాద్, వెంపటి గోపాలకృష్ణ మూర్తి, కృష్ణ మోహన్, ఆర్.పార్థసారధి, ఎం.బి.గంగారెడ్డి, డా.శివప్రసాద్ పాల్గొన్నారు.
















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com